PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 118 | విజయవాడ, బుధవారం 29 నవంబర్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Wednesday 29 November 2023 | Rs

మ్యాక్స్‌వెల్ మెరుపు శతకం

- భారీ లక్ష్యాన్ని ఛేదించిన ఆసీస్
- గైక్వాడ్ సెంచరీ వృథా
- మూడో టి20లో ఐదు వికెట్ల తేడాతో ఓడిన టీమిండియా

● లోపలి పేజీలో..●

ఇద్దరు ఐఎఎస్‌లకు జైలుశిక్ష

ప్రజాశక్తి-అమరావతి

కోర్టు ధిక్కరణ కేసులో ఇద్దరు ఐఎఎస్ అధికారులకు హైకోర్టు జైలుశిక్ష విధించింది. డిసెంబరు 8లోగా హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడీషియల్) వద్ద లొంగిపోవాలని ఆదేశించింది. ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి శ్యామలరావు, కళాశాల విద్యా కమిషనర్ పోలా భాస్కర్‌కు నెల రోజుల చొప్పున సాధారణ జైలుశిక్ష, రూ.1000 చొప్పున జరిమానాలను విధించింది. శిక్ష అమలు నిమిత్తం రిజిస్ట్రార్ వద్ద వారంలోగా లొంగిపోవాలంది. లొంగిపోయిన తర్వాత చట్ట నిబంధనలకు అనుగుణంగా జైలుకు తరలింపునకు తగిన చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రీని ఆదేశించింది. అన్‌ఎయిడెడ్ లెక్చరర్లను ఎయిడెడ్ కాలేజీల్లోకి తీసుకోవాలని గతేడాది జులైలో హైకోర్టు తీర్పు చెప్పింది. దీనిని అమలు చేయలేదంటూ సూరిబాబు ఇతర పిటిషనర్లు కోర్టు ధిక్కరణ వ్యాజ్యాలను దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ మన్మథరావు మంగళవారం ఇద్దరు ఉన్నతాధికారులకు జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.



తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి విద్యుత్ సబ్ స్టేషన్లు ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి

నాణ్యమైన విద్యుత్ అందిస్తాం

- క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు ప్రోత్సాహకాలు
- సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో విద్యుత్ పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసి, ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో సబ్‌స్టేషన్లకు వెబినార్ ద్వారా మంగళవారం ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్ సరఫరాలో భాగంగానే క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు పెద్దఎత్తున ప్రోత్సహకాలను ఇస్తున్నట్లు తెలిపారు. గోదావరి వరద ముంపునకు గురైన చింతూరు, విఆర్‌పురం, కూనవరం, ఎటపాక తదితర విలీన మండలాల్లో తాను పర్యటించినప్పుడు ససబ్‌స్టేషన్లు లేక సమస్యలు వస్తున్నాయని స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. దీనిపై అధికారులతో చర్చించిన తరువాత 14 జిల్లాల్లో 28 సబ్ స్టేషన్లను చేసట్టామని అన్నారు. వీటికోసం రూ 3,099 కోట్లను ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. వీటిలో 12 సబ్‌స్టేషన్‌ల నిర్మాణాన్ని ఇప్పటికే పూర్తి చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో ట్రాన్స్‌మిషన్ కెపాసిటీని విస్తరించుకుంటూ, నాణ్యమైన విద్యుత్‌ను ప్రతి గ్రామానికి, ప్రతిరైతుకు అందించే వ్యవస్థను తీసుకువస్తున్నామని తెలిపారు. రైతులకు 9 గంటలపాటు పగటిపూటే ఉచిత విద్యుత్ ఇవ్వాలన్న లక్ష్యంతో అధికారంలోకి వచ్చిన తొలిరోజుల్లోనే విద్యుత్ పంపిణీ వ్యవస్థ బలోపేతానికి శ్రీకారం చుట్టామన్నారు. రైతులకు ఉచిత విద్యుత్‌ను స్థిరంగా ఇచ్చేందుకు రూ 2.49లకే యూనిట్ ధరతో సోలార్ పవర్‌ను రాష్ట్రంలోకి తెచ్చామన్నారు. ఇందుకోసం 17వేల మిలియన్ యూనిట్లకు సెకీతో ఒప్పందం చేసుకున్నామని అన్నారు. ఈ ప్రాజెక్టుల కింద 2024కు 3వేల మెగావాట్లు, సెప్టెంబరు 2025 నాటికి మరో 3వేల మెగావాట్లు, సెప్టెంబరు 2026 నాటికి మరో 1,000 మెగావాట్లు అందుబాటులోకి వస్తుందన్నారు.. ఈ ప్రాజెక్టులన్నింటి కోసం విద్యుత్ రంగంలో రూ 6,500కోట్ల పెట్టుబడులు పెడుతున్నామని తెలిపారు. అలాగే కాలుష్యరహిత క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు ప్రభుత్వం పెద్దఎత్తున ప్రోత్సహకాలను ఇస్తోందని అన్నారు. అవేరా స్కూటర్స్ సంస్థ ఇప్పటికే 25వేల స్కూటర్ల ఉత్పత్తిని ప్రారంభించిందన్నారు. ఈ ప్రాజెక్టు లక్ష స్కూటర్ల ఉత్పత్తి దిశగా రూ 100కోట్లతో సామర్థ్యాన్ని పెంచుకుంటోందన్నారు. ఈ కంపెనీ ద్వారా 100 మందికి ఉపాధి అవకాశాలు వచ్చాయని తాజా పెట్టుబడితో మరో 200 మందికి ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సిఎస్ డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి, ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, ఎపి జెన్‌కో ఎండి కెవిఎన్ చక్రధర్ బాబు, ట్రాన్స్‌కో విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ జేఎండి బి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హమ్మయ్య!

ఎట్టకేలకు బయటకు

సొరంగంలో చిక్కుకున్న 41 మంది కార్మికులు బాహ్య ప్రపంచంలోకి

- 17 రోజుల వ్యథాభరిత ఉత్కంఠకు తెర
- ర్యాట్ హోల్ మైనర్లదే కీలక పాత్ర

డెహ్రాడూన్ : సరిగ్గా 17రోజుల క్రితం కుప్పకూలిన ఉత్తర కాశీ సొరంగంలో చిక్కుకుపోయిన 41మంది కార్మికులను ఎట్టకేలకు సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. 'ర్యాట్‌హోల్' టెక్నిక్ ఫలించడంతో పైపు ద్వారా కార్మికులందరూ ఒకరి తరువాత ఒకరు బాహ్య ప్రపంచంలోకి వచ్చారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిపుణుల బృందాలు, అధికార యంత్రాంగం రాత్రనకా పగలనకా శ్రమించి, 400గంటలకు పైగా ముమ్మరంగా కొనసాగించిన సహాయక చర్యలు ఫలించాయి. రాత్రి 8గంటలకు మొదట కార్మికుడు బయటకు రాగా, మొత్తంగా అందరినీ బయటకు తీసుకురావడానికి మూడు నుంచి నాలుగు గంటల సమయం పడుతుందని అధికారులు అంచనా వేసినా ఒక గంటలోనే అందరినీ విజయవంతంగా బయటకు తీసుకువచ్చారు. బయటకు తీసుకొచ్చిన వెంటనే వారిని అప్పటికే సిద్ధం చేసి వుంచిన అంబులెన్సుల ద్వారా ఆస్పత్రులకు తరలించారు. వారి శారీరక, మానసిక ఆరోగ్యాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసేందుకు అక్కడ డాక్టర్లు సిద్ధంగా వున్నారు.

ఉత్తరకాశీ జిల్లాలోని సిల్క్యారా వద్ద సొరంగం నిర్మాణ పనులు జరుగుతుండగా, ఈ నెల 12న ఒక్కసారిగా సొరంగం కుప్పకూలడంతో 41మంది కార్మికులు లోపల చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. అప్పటి నుండి వారిని వెలుపలకు తీసుకొచ్చేందుకు అనేక రకాలుగా ప్రయత్నించారు. సొరంగం ముఖ ద్వారం వద్ద భారీగా పడివున్న శిథిలాల దిబ్బలను తొలగించే క్రమంలో అధికారులకు అనేక సవాళ్లు ఎదురయ్యాయి. నేలకు సమాంతరంగా తవ్వుతున్న పనులకు పదే పదే ఆటంకాలు ఏర్పడి ముందుకు సాగకపోవడంతో నిలువుగా కొండను తవ్వేందుకు కూడా సిద్ధపడ్డారు. సొరంగానికి అడ్డంగా కూలిన శిథిలాల దిబ్బలను తొలగించేందుకు రప్పించిన అగర్ యంత్రం కూడా అనేకసార్లు సతాయించడంతో అధికారులకు ఈ తొలగింపు చర్యలు సవాలుగా మారాయి. సొరంగంలో 57 మీటర్ల వద్ద శిథిలాల తొలగింపులో యంత్రాలు పనిచేయకపోవడంతో ర్యాట్ హోల్ మైనర్ల సాయంతో మాన్యువల్ డ్రిల్లింగ్ చేపట్టి విజయవంతంగా పూర్తి చేశారు.

సొరంగం నుంచి బయటకు వచ్చిన తొలి కార్మికుడుని అభినందిస్తున్న ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి దామి

కార్మికులు బయటకు వచ్చిన వెంటనే ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ దామి, కేంద్ర సహాయ మంత్రి జనరల్ రిటైర్డ్ వి.కె.సింగ్ వారిని కలుసుకున్నారు. వారిని పూలమాలలతో సత్కరించి, ఆలింగనం చేసుకుని పరామర్శించారు. తమ వారి కోసం కళ్లలో వత్తులు వేసుకుని సొరంగం వద్ద వేచి చూస్తున్న వారి కుటుంబ సభ్యుల సంతోషానికి అవధుల్లేకపోయాయి.

మీ ధైర్యం, ఓర్పు స్ఫూర్తినిస్తున్నాయి !

ఆ 41 మందికి ప్రధాని మోడీ సందేశం

ఉత్తరకాశీ సొరంగం నుండి విజయవంతంగా బయటపడిన 41మంది కార్మికులను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోడీ అభినందించారు. అత్యంత క్లిష్టంగా సాగిన ఈ 17రోజుల కాలంలో వారు చూపిన ధైర్యం, ప్రదర్శించిన ఓర్పు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినిస్తున్నాయని ప్రధాని ప్రశంసించారు. బయటపడిన ప్రతి ఒక్కరూ మంచి ఆరోగ్యంతో బాగుండాలని అభిలషించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

సుదీర్ఘమైన నిరీక్షణ తర్వాత మన మిత్రులందరూ వారి కుటుంబ సభ్యులను కలుసుకోవడం చాలా సంతృప్తిని కలిగించిందని వ్యాఖ్యానించారు. ఈ సంక్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు చూపిన సంయమనాన్ని కూడా మరిచిపోలేమన్నారు. అత్యంత క్లిష్టమైన సవాళ్ళతో, ప్రతికూల పరిస్థితుల మధ్య సాగిన ఈ రెస్క్యూ ఆపరేషన్‌లో పాలు పంచుకున్న ప్రతి ఒక్కరికీ అభివాదం చేస్తున్నానని మోడీ ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. మానవత్వానికి, సమిష్టి నాయకత్వానికి అద్భుతమైన ఉదాహరణగా ఈ కార్యక్రమం, ఇందులో పాల్గొన్నవారు నిలిచారని ప్రశంసించారు.

కార్మికులకు సిపిఎం అభినందనలు

ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ టన్నెల్‌లో 17 రోజులపాటు ధైర్యంగా, ప్రశాంతంగా ఉండి బయటకు వచ్చిన 41 మంది కార్మికులకు సిపిఎం అభినందనలు తెలిపింది. దుర్భరమైన పరిస్థితుల్లో తవ్వకాల జరిపి, వారిని సొరంగం నుంచి బయటకు తీసుకొచ్చిన కాంట్రాక్టు కార్మికులను హీరోలుగా అభివర్ణించింది. రెస్క్యూ ఆపరేషన్‌లో పనిచేసిన అన్ని టీమ్‌లకు, ఏజెన్సీలకు అభినందనలు తెలిపింది. సెన్సిటివ్ జోన్‌లలో సొరంగాల తవ్వేటప్పుడు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించింది.

ప్రజల్లోకి విస్తృతంగా డిమాండ్లు

- సాధనకై ఐక్య ఉద్యమాలు
- పార్టీలపై ఒత్తిడి
- ముగిసిన కార్మిక, కర్షక మహాధర్నా

మహాధర్నాలో నినాదాలు చేస్తున్న కార్మిక, రైతు సంఘాల నాయకులు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి/అమరావతి బ్యూరో

కేంద్రంలో, రాష్ట్రంలో.. ఎక్కడ ఏ ప్రభుత్వం అధికారంలోకొచ్చినా రైతుల, కార్మికుల డిమాండ్లు అమలు చేసి తీరాల్సిందేనని విజయవాడ జింఖానా గ్రౌండ్ వేదికగా నిర్వహించిన కార్మిక, రైతు మహాధర్నా స్పష్టం చేసింది. కార్మికులు, కర్షకులు కలిసికట్టుగా సాగిస్తున్న ఉద్యమాలే వారి ఈతిబాధలను ఎజెండా మీదకి తీసుకొచ్చాయని వక్తలు చెప్పారు. మహాధర్నా ముందుకు తెచ్చిన అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి చైతన్యం చేసి ఎన్నికల్లో పోటీ చేసే పార్టీలపై ఐక్య పోరాటాలతో ఒత్తిడి తేవాలని కర్తవ్య బోధ చేశారు. ఢిల్లీ సరిహద్దుల్లో ఏడాదికిపైగా సాగి, మోడీ ప్రభుత్వ మెడలు వంచిన వీరోచిత రైతు పోరాట స్ఫూర్తిగా దేశ వ్యాప్త పిలుపులో భాగంగా ఎపి కార్మిక సంఘాల ఐక్య వేదిక, ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి సంయుక్తంగా సోమవారం చేపట్టిన 36 గంటల రాష్ట్ర మహాధర్నా మంగళవారం సాయంత్రం ముగిసింది. నిర్వాహకులు ఊహించిన దానికంటే మిన్నగా ధర్నా జయప్రదమైంది. రైతుల, కార్మికుల, వ్యవసాయ కార్మికుల స్పందన వెల్లువెత్తింది. పలువురి నుంచి సంఘీభావం లభించింది. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి కార్మికులు, కర్షకులు, శ్రామికులు ఉత్సాహంగా ధర్నాకు తరలివచ్చారు. రెండు రోజులూ కదలకుండా అక్కడే బస చేశారు. వేల మంది వచ్చినప్పటికీ ఎక్కడా ఇబ్బందులు కలగకుండా భోజన, వసతి ఏర్పాట్లు చేశారు. మహిళలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొనడం విశేషం. తమ డిమాండ్లతో కూడిన నినాదాలు, సంఘాల బ్యానర్లు, జెండాలతో హోరెత్తించారు. సమరోత్సాహం ప్రదర్శించారు. ధర్నా ప్రారంభం నుంచి చివరి వరకు కదలకుండా శ్రద్ధగా నాయకుల ప్రసంగాలు ఆకళింపు చేసుకున్నారు. ప్రజానాట్యమండలి, ఎపి ప్రజానాట్యమండలి, అరుణోదయ కళాకారుల ప్రదర్శనలు, గేయాలు అందరినీ కట్టిపడేశాయి. కాగా రైతులకు కనీస మద్దతు ధరలు, రైతులకు, కౌలు రైతులకు రుణాలు, ఆత్మహత్యల నివారణ, అసంఘటిత కార్మికులకు, స్కీం వర్కర్లకు, కాంట్రాక్టు, ఔట్‌సోర్స్ ఉద్యోగులకు కనీస వేతనాలు, చట్టబద్ధ బెనిఫిట్‌లు, రెగ్యులరైజేషన్, ఆదివాసీల హక్కులు, విశాఖ ఉక్కు సహా ప్రభుత్వరంగం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, వ్యవసాయ కార్మికులకు ఉపాధి పనులు, రాజ్యాంగ, పౌర హక్కులు, లౌకిక ప్రజాస్వామ్య, ఫెడరలిజం పరిరక్షణ ఇత్యాది 37 అంశాలపై చర్చించారు. డిమాండ్లు పెట్టారు. తీర్మానాలు ఆమోదించారు. వాటి సాధనకు ఐక్యంగా మిగతా 2లో

ఫైనాన్స్ కంపెనీ వేధింపులు

- యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి- వేటపాలెం (బాపట్ల జిల్లా)

గాదె వంశీకృష్ణ

కారు కిస్తీ కట్టలేదని ప్రయివేట్ ఫైనాన్స్ సిబ్బంది వేధించడంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నారు. బాపట్ల జిల్లా వేటపాలెం మండలంలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... గాదె వంశీకృష్ణ (22) చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయారు. అప్పటి నుండి పందిళ్లపల్లిలో అమ్మమ్మ, మేనమామ ఇంటి వద్ద ఉంటున్నారు. ఇటీవల ఒక ఫైనాన్స్ కంపెనీలో ఫైనాన్స్ తీసుకొని కారు కొనుగోలు చేశారు. వరుసగా నాలుగు నెలల పాటు కిస్తీలు కట్టలేక పోవడంతో ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది వేధింపులు ఎక్కువయ్యాయి. ఇటీవల మూడు నెలల కిస్తీలు చెల్లించినా, పెండింగ్ నెల కిస్తీ కూడా కట్టాలని సిబ్బంది ఒత్తిడి పెంచారు. దీంతో, వంశీకృష్ణ మనస్తాపానికి గురై ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు వేటపాలెం ఎస్ఐ జి.సురేష్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

చంద్రబాబుకు సుప్రీం నోటీసు

- 8లోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడుకు అత్యున్నత న్యాయస్థానం నోటీసులిచ్చింది. బెయిల్ రద్దు పిటిషన్‌పై డిసెంబరు 8లోగా రాతపూర్వకంగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. అలాగే స్కిల్ డెవలప్‌మెంటు కేసులో 17ఏపై తీర్పు వచ్చిన తరువాత చంద్రబాబు బెయిల్ రద్దు కేసు వింటామని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. స్కిల్ డెవలప్‌మెంటు కేసులో చంద్రబాబుకు హైకోర్టు బెయిల్ ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ సతీష్ చంద్రశర్మతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది రంజిత్ కుమార్ వాదనలు వినిపిస్తూ.. చంద్రబాబుకు హైకోర్టు విధించిన బెయిల్ షరతులను పొడిగించాలని కోర్టును కోరారు. అలాగే 'ఈ కేసు గురించి పబ్లిక్ డొమైన్‌లో ఎటువంటి ప్రకటన చేయకూడదు' అని అన్నారు. చంద్రబాబు తరపున న్యాయవాది సిద్దార్థ అగర్వాల్ జోక్యం చేసుకుని అత్యున్నత న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్న అంశాలపై ఆ శాఖ అధికారులు ఇప్పటికీ బహిరంగ ప్రకటనలు చేస్తూనే ఉన్నారని తెలిపారు. 'స్కిల్ కేసుపై బహిరంగంగా మాట్లాడకుండా ఉండటానికి మాకు అభ్యంతరం ఏమీ లేదు. కానీ అదే షరతు రెండు వైపులా వర్తింపజేయాలి' అని పేర్కొన్నారు. దీనికి సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ తీవ్ర అభ్యంతరం తెలిపారు. 'షరతు నిందితుడికి వర్తిస్తుంది. అది ప్రభుత్వానికి వర్తించదు' అని అన్నారు. నోటీసు జారీ చేయాలన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అభ్యర్థనను కోర్టు అంగీకరించడమే కాకుండా, ఈ కేసు నుంచి ఉత్పన్నమయ్యే సబ్ జ్యుడీస్ విషయాల గురించి పబ్లిక్ డొమైన్‌లో మాట్లాడకుండా చంద్రబాబుకు బెయిల్ షరతును కొనసాగించాలని ఆదేశించింది. అయితే, రాజకీయ ర్యాలీలు, సమావేశాలు నిర్వహించడం, పాల్గొనడంపై నిషేధం విధించే ఇతర బెయిల్ షరతును విధించేందుకు ధర్మాసనం నిరాకరించింది.

విరసం బాలసుబ్రమణ్యంకు 'కొమ్మారెడ్డి కేశవరెడ్డి' అవార్డు

బాలసుబ్రమణ్యంకు అవార్డును ప్రదానం చేస్తున్న లక్ష్మణరావు, వెంకటరమణమూర్తి, కేశవరెడ్డి కుటుంబసభ్యులు (వార్త 2లో..)

ప్రచారానికి తెర... ప్రలోభాల ఎర

- తెలంగాణాలో రేపు పోలింగ్

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ శాసనసభ ఎన్నికలు తుది అంకానికి చేరాయి. గత రెండు వారాలుగా హోరెత్తించిన ప్రచారానికి మంగళవారంతో తెరపడింది. వారం రోజులుగా తెలంగాణలో మకాం వేసిన ప్రధాన రాజకీయ పార్టీల అగ్ర నాయకత్వం ఢిల్లీ బాట పట్టింది. స్థానిక సమస్యల పరిష్కారం, సామాజిక న్యాయం నినాదంతో కమ్యూనిస్టు పార్టీలు తమ వాణిని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఆరు గ్యారెంటీలతో కాంగ్రెస్, సుస్థిర ప్రభుత్వ నినాదంతో బిఆర్ఎస్, బిసిలకు సిఎం పదవి హామీతో బిజెపి నేతలు జోరుగా ప్రచారం చేశారు. బిఎస్‌పి అభ్యర్థులు కూడా తమ పార్టీ విధానాలతో ప్రజల ముందుకు వెళ్లారు. మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు ప్రచారానికి తెరపడడంతో తెలంగాణ సైలెంట్ మోడ్‌లోకి వెళ్లింది. రాష్ట్రమంతటా 144 సెక్షన్ అమల్లోకి వచ్చినట్లు సిఇఒ వికాస్‌రాజ్ తెలిపారు. గడువు ముగిసిన నేపథ్యంలో సోషల్ మీడియాలో కూడా ప్రచారం చేయకూడదని ఇసి స్పష్టం చేసింది. ఈ నెల 30న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు సిఇఒ తెలిపారు. తెలంగాణ ఎన్నికలను అధికార బిఆర్ఎస్‌తోపాటు కాంగ్రెస్, బిజెపి ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో ఆయా మిగతా 7లో

విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం

- తరచూ క్యాంపస్ మార్పు
- కనీస సౌకర్యాలు మృగ్యం
- ప్రయివేట్ యూనివర్సిటీ 'బెస్టూ' నిర్వాకం

● లోపలి పేజీలో..●

గాజాలో మరో రెండ్రోజులు కాల్పుల విరమణ

- 33 మంది పాలస్తీనియన్లు, 11 మంది ఇజ్రాయిలీలు విడుదల
- సుదీర్ఘకాలం కాల్పులు విరమించండి : ఐరాస

ఉద్యోగం ఒకటే - జీతాల్లో వ్యత్యాసం

- ఎనర్జీ అసిస్టెంట్ల ప్రొబేషనరీ పట్ల అస్పష్టత
- ఒక్కో విధంగా పే స్లిప్స్
- ఎటూ తేల్చని ప్రభుత్వం, ఉద్యోగుల్లో ఆందోళన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సచివాలయాల్లో నియమితులైన ఎనర్జీ అసిస్టెంట్ల (జెఎల్ఎమ్ గ్రేడ్-2) పరిస్థితి గందరగోళంగా మారింది. విధులు ఒకటే నిర్వహిస్తున్నా రెగ్యులర్ జెఎల్ఎమ్‌కు ఇస్తున్న బేసిక్ ఎనర్జీ అసిస్టెంట్‌కు చెల్లిస్తున్న వేరుగా ఉండటంతో తాము నష్టపోతున్నామని జెఎల్ఎమ్-2లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెగ్యులర్ జెఎల్ఎమ్‌కు బేసిక్‌రూ.32,500లు కాగా అలవెన్స్‌లతో కలిపి సుమారు రూ.40,795ల వరకు వస్తోంది. ఎనర్జీ అసిస్టెంట్లకు ప్రొబేషన్ డిక్లేర్ కాక ముందు సచివాలయ ఉద్యోగుల జీతం కన్సాలిడిటేడ్ కింద రూ.15వేలు చెల్లించే వారు. ప్రొబేషన్ డిక్లేర్ అయిన తర్వాత ప్రస్తుతం బేసిక్ రూ.22,460లు కాగా, అలవెన్స్‌లతో కలిపి రూ.29వేల లోపు వస్తోంది. ఇద్దరి ఉద్యోగుల మధ్య వ్యత్యాసం రూ.10నుంచి రూ.11వేల వరకు ఉంది. గ్రామ వార్డు సచివాలయాల పరిధిలో పనిచేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 7,329 మంది ఎనర్జీ అసిస్టెంట్లుగా ప్రభుత్వం నియమించింది. వీరంతా గ్రామ సచివాలయంలో ఉంటూ విధులు నిర్వహించాలని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ఆచరణలో డిస్కమ్‌ల కింద ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

పర్మినెంట్ జెఎల్ఎమ్ బెనిఫిట్స్ ఇవ్వాలి:

పర్మినెంట్ జెఎల్ఎమ్‌లకు అందిస్తున్న బెనిఫిట్స్ తమకు కూడా ఇవ్వాలని ఎనర్జీ అసిస్టెంట్లు కోరుతున్నారు. గ్రామ వార్డు సచివాలయాల శాఖ జాబ్ చార్ట్ ప్రకారం గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో జెఎల్ఎమ్ గ్రేడ్-2గా జాబ్ చార్ట్‌లో వాటర్ వర్క్స్, వీదిలైట్లు, విధ్యుత్‌పోల్స్ మరమ్మతులు వంటి పనులు చేయాల్సి ఉండగా, డిస్కమ్‌ల పరిధిలో హైటెన్షన్ విద్యుత్తు సరఫరా పనులతో పాటు విద్యుత్తు స్థంబాలు ఎక్కిస్తున్నారు. గ్రామ సచివాలయం పరిధిలో పనిచేసేందుకు ఎనర్జీ అసిస్టెంట్ పోస్టుల కింద రిక్రూట్ చేశారు.

పే స్లిప్స్‌లో తేడాలు:

డిస్కమ్‌ల్లో పనిచేసే జెఎల్ఎమ్-2 ఉద్యోగులు రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారి ప్రొబేషన్ డిక్లేర్ చేయాలని గ్రామ వార్డు సచివాలయాలశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ విద్యుత్‌శాఖకు లేఖ రాశారు.మూడు రకాల డిస్కమ్‌ల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పే స్లిప్స్‌లో సిపిడిసిఎల్ ఉద్యోగుల పే స్లిప్‌లో రెగ్యులర్, ఎపిఎస్‌పిడిసిఎల్ ఉద్యోగుల పే స్లిప్స్‌లో ఎమర్జన్సీ అంటూ ఇపిడిసిఎల్ ఉద్యోగులకు పే స్లిప్‌లో ప్రొబేషనరీ అని చూపుతున్నారు.

డిస్కమ్‌ల పరిధిలోఎనర్జీ అసిస్టెంట్‌లు :

సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులందరికీ మదర్ డిపార్టు మెంట్ లైనింగ్ డిపార్టుమెంట్ గాపర్యవేక్షిస్తోంది. 18 శాఖలన్ని మునిసిపల్ కమిషనరు, ఎంపిడిఓ నియంత్రణలో ఉండగా, లైనింగ్ బాధ్యతలన్నీ ఆయా మాతృశాఖలు పర్యవేక్షిస్తున్నాయి. మునిసిపల్ కమిషనరుకు తమను అప్పజెప్పకుండా డిస్కమ్‌ల కిందనే ఉంచుకుంటూ 24/7 గంటలు పనిచేయిస్తున్నారని ఎనర్జీ అసిస్టెంట్లు పేర్కొంటున్నారు.

ప్రతి రోజు ఉదయం గ్రామ వార్డు సచివాలయంలో బయోమెట్రిక్ వేసిన అనంతరం డ్యూటీలు చేసేందుకు సంబంధిత ట్రాన్స్‌కో ఎఇ, డిఇ వద్దకు వెళుతున్నారు. ఇది ఇబ్బందిగా మారిందని, ఎనర్జీ అసిస్టెంట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. ఎనర్జీ అసిస్టెంట్లకు మిగతా 2లో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై
ఐక్య ఉద్యమాలు

ముగిసిన కార్మిక, రైతు సంఘాల మహాధర్నా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కార్మికులు, రైతులకు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై ఐక్య సమరం ద్వారానే హక్కులు సాధించుకోగలమని వక్తలు పిలుపునిచ్చారు. విజయవాడ జింఖానా గ్రౌండ్‌లో 36గంటల పాటు జరిగిన మహా ధర్నా మంగళవారం సాయంత్రం ముగిసింది. వేలమంది రైతులు, కార్మికులు తరలిరావడంతో జింఖానా గ్రౌండ్ కిక్కిరిసిపోయింది. రెండోరోజు సభకు వై.కేశవరావు, కెవివి ప్రసాదు, జాస్తి కిషోర్‌బాబు, కె.ధనలక్ష్మి, చుండూరి రంగారావు అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ఉదయం నుంచి వివిధ సంఘాల నాయకులు చెందిన మాట్లాడుతూ. దేశ వ్యాప్తంగా రైతులు, కార్మికులకు న్యాయం జరిగిందంటే పోరాటాల ద్వారానే సాధ్యమైందని పేర్కొన్నారు. నరేంద్రమోడీ అనుసరిస్తున్న విధానాలను కూడా పోరాటాల ద్వారానే ఎదుర్కోవాలని, అది కార్మిక, కర్షక ఐక్యతతోనే సాధ్యమవుతుందని అన్నారు. సంతలో పశువుల్లా కొంటున్నారు.

అన్నిటినీ మార్కెట్ చేస్తున్నారు

• ఎమ్మెల్సీ ఐ. వెంకటేశ్వరరావు

ఉచితంగా ప్రజలకు అందించాల్సిన వాటినీ ప్రభుత్వం మార్కెట్ సరుకుగా చేస్తున్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముతున్నారు. ప్రజలతో ఎన్నుకుని ప్రభుత్వాన్ని నడుపుతూ అదే ప్రజలపై భారాలు వేసి వారిని ముప్పతిప్పలు పెట్టడం ఎంతవరకు సమంజసం. కార్పొరేట్లకు దోచిపెట్టడం కోసమే పాలన చేస్తున్నారా అన్నట్లు ఈ ప్రాంతీయ పార్టీలు వ్యవహరిస్తున్నాయి.

ప్రాజెక్టులను పూర్తి చేయాలి

• రైతు నాయకులు కె.ప్రభాకరరెడ్డి, కొల్లా రాజమోహన్

ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారానే అక్కడ కరువు పరిస్థితులను ఎదుర్కోవచ్చు, రైతులను కాపాడవచ్చు. కానీ పాలకులు ఆదివగా ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదు. రాయలసీమలో ప్రాజెక్టులు పూర్తి చేస్తే అక్కడ కరువును నివారించవచ్చు ఆపని చేయడం లేదు.

రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది

• కృష్ణా జెడ్‌పి మాజీ ఛైర్‌పర్సన్ అనూరాధ

వ్యవసాయాన్ని కాపాడుకోవాలని కృష్ణా జిల్లా మాజీ జెడ్‌పి ఛైర్‌పర్సన్ గద్దె అనూరాధ అన్నారు. రైతులు బాగుంటేనే దేశం బాగుంటుంది. మహిళలను ఆదుకోవాల్సిన అవసరం ఉంది. ప్రచ్ఛన్న నిరుద్యోగాన్ని ఎదుర్కొంటున్నారు. వారికి ఉపాధి కల్పించాల్సిన అవసరం ఉంది.

నోరెత్తితే అరెస్టులు చేస్తున్నారు

• న్యాయవాదులు ముప్పాళ్ల సుబ్బారావు, సుంకర రాజేంద్రప్రసాద్

ప్రజలెదుర్కొంటున్న సమస్యలపై నోరెత్తితే పోలీసులతో అరెస్టులు చేయిస్తున్నారు. కేంద్రం మతోన్మాదాన్ని రెచ్చగొడుతుంటే, రాష్ట్రం ప్రజాపోరాటాల అణచివేసేందుకు నిర్బంధాలకు దిగుతోంది. విలువైన గనులను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ఇష్టారీతిగా దోపిడీకి పాల్పడుతున్నారు. సహజ వనరులదోపిడీ కోసమే మణిపూర్లో కుకీలపై దాడులకు రెచ్చగొట్టారు. ఇటువంటి వాటిని కాపాడాల్సిన న్యాయవ్యవస్థపైనా కేంద్రం దాడికి దిగుతోందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును అమ్ముతోంది. రాజ్యాంగాన్ని, లౌకికతత్వాన్ని తుంగలో తొక్కుతున్నారు. మతపిచ్చి ప్రజలకు ఎక్కించి శాశ్వతంగా అధికారంలోకి ఉండాలని కోరుకుంటున్నారు. దీన్ని దేశ ప్రజలు అంగీకరించరు.

సంతలో పశువుల్లా కొంటున్నారు

• సిఐటియు నాయకులు వి.ఉమామహేశ్వరరావు

కేంద్రంలో బిజెపి వచ్చాక ఎంఎల్ఎలు, ఎంపిలను సంతల్లో పశువుల్లా కొంటున్నారని, ఇ.డి, సిబిఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలతో బెదించి లొంగదీసుకుంటున్నారని సిఐటియు రాష్ట్ర నాయకులు వి ఉమామహేశ్వరరావు అన్నారు. రాష్ట్రాల హక్కులను, ఎన్నికైన ప్రజా ప్రభుత్వాలను ఇబ్బందులు పెడుతున్న బిజెపితో వైసిపి, టిడిపి, జనసేన అంటకాగడం దేనికని ప్రశ్నించారు.

రైతు ఉత్పత్తులను నేరుగా కొనాలి

• సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి.నాగేశ్వరరావు

రైతు ఉత్పత్తులను నేరుగా ప్రభుత్వం కొని ప్రజలకు పంపిణీ చేయాలి. ఈ విషయంలో కేరళ ప్రభుత్వం అనుసరిస్తున్న పద్ధతులను అనుసరించాలి. పెట్రోల్, డీజిల్‌పై పన్నులను తగ్గించాలి. గ్యాస్ సిలిండర్ ధర తగ్గించాలి. ప్రజలకు తక్కువ ధరకే నిత్యావసరాలు అందేలా చూడాలి. అంతేగానీ కార్పొరేట్ల చేతుల్లో పెట్టి ప్రజలను దోచుకునే విధానాన్ని అడ్డుకోవాలి.

పోరాటం కోసం పోరాటాలు చేయాల్సిన పరిస్థితి

• ఎపి ఎన్‌జిఒ సంఘ నాయకులు ఎ.వి.సాగర్

ఉద్యోగుల హక్కులను కాలరాస్తున్నారు. వారు ప్రశ్నిస్తే కేసులు బనాయిస్తున్నారు. పోరాటాలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. ఉద్యోగులు, కార్మికులు, రైతులు అందరినీ పక్కనబెట్టే పరిస్థితి దాపురించింది. ఇతర రాష్ట్రాల్లో ప్రజల హక్కులపై నినదిస్తున్నారు. కానీ రాష్ట్రంలో ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకుంటున్నారు. నోరెత్తనీయడం లేదు. మీటింగులు పెట్టనీయడం లేదు. పోరాటం కోసం పోరాటాలు చేయాల్సిన పరిస్థితి వచ్చింది.

రవాణా రంగాన్ని ఆదుకోవాలి

• లారీ ట్రాన్స్‌పోర్టు నాయకులు వైవి ఈశ్వరరావు, తుమ్మల లక్ష్మణస్వామి

దేశానికి రైతులు, శ్రామికులు ఎంత అవసరమో రవాణా రంగం కూడా అంతే అవసరం. జాతీయ లాజిస్టిక్ పాలసీ పేరుతో రవాణా వ్యవస్థను దెబ్బతీస్తున్నారు. మోయలేని భారాలు మోపుతున్నారు. డీజిల్, టోల్‌గేటు రేట్లు తగ్గించకుండా అది సాధ్యం కాదు. కేంద్రం ద్వంద్వ వైఖరి అనుసరిస్తోంది. దీన్ని అడ్డుకోవడానికి జరిగే పోరాటంలో అందరం కలిసి వస్తాము.

బలిచ్చే ముందు అలంకరించినట్లు స్కూళ్లను చేస్తున్నారు

• ఎపిటిఎఫ్ నాయకులు భానుమూర్తి

పాఠశాలలను నిర్వీర్యం చేసేందుకు విద్యా వ్యవస్థను ధ్వంసం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నారు. బలిచ్చే ముందు మేకను అలంకరించినట్లు స్కూళ్లను అలంకరించి వాటిని కార్పొరేట్లకు కట్టబెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు.

రైతు పోరాటాలకు పూర్తి మద్దతు

• యుటిఎఫ్ అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు, బెఫి నేత ఆర్.అజయ్‌కుమార్

రైతులు, కార్మికులు చేస్తున్న పోరాటం వారికోసమే కాదు, దేశ ప్రజలందరి కోసం. అందుకనే ఈ పోరాటానికి ఉపాధ్యాయులు, బ్యాంకింగ్ రంగ సిబ్బంది నుండి పూర్తి మద్దతు ఇస్తున్నాము. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును అడ్డుకోవాలి. లేనిపక్షంలో మనుగడ ప్రశ్నార్థకం అవుతుంది.

పత్రికా స్వేచ్ఛను దెబ్బతీస్తున్నారు

• ఐజెయు నాయకులు సోమసుందర్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యమాలను అనుమతించడం లేదు. జర్నలిస్టులు కూడా బాధితులే. సమస్యలపై రోడ్డెక్కడానికి ప్రయత్నించిన అన్ని సందర్భాల్లోనూ ఆంక్షలు పెడుతున్నారు. నోరెత్తనీయడం లేదు. నిజాన్ని నిర్భయంగా చెబితే మీడియా సంస్థలపై కేసులు నమోదు చేసి జర్నలిస్టులను జైళ్లలో పెడుతున్నారు.

ప్రజలను చీల్చి పాలన చేస్తున్నారు

• ఎం.వెంకటరెడ్డి, స్త్రీ విముక్తి సంఘటన నాయకులు చల్లపల్లి విజయ, పిఓడబ్ల్యు నాయకులు పద్మ

ప్రజలను చీల్చి అధికారంలో శాశ్వతంగా ఉండాలనే ఆలోచనతో పాలకులు వ్యవహరిస్తున్నారు. వాటిని ధీటుగా కార్మికులు, రైతులు ఎదుర్కోవాలి. లేకపోతే మనుగడ కష్టమవుతుంది. మహిళలను అన్యాయంగా చంపిన మతోన్మాదులపై చర్యలు తీసుకోవాలి. మణిపూర్లో జాతుల సమస్య అంటే కరెక్టు కాదు. అది భూమి సమస్య అన్నారు. ముఖ్యమంత్రి కుట్రగా చూడాలి.

పోరాటానికి సన్నద్ధం కావాలి

• రైతు నాయకులు హరినాథ్, కార్మిక నాయకులు రవీంద్రనాథ్, క్రాంతికుమార్

రైతులకు గిట్టుబాటు ధరలు అందించాలని స్వామినాథన్ కమిషన్ చేసిన సూచనలను కేంద్రం అమలు చేయాలి. రైతులు, శ్రామికులపై దాడులకు దిగుతున్న మోడీ ప్రభుత్వంపై పోరాటం కొనసాగించాలి. కేంద్రంలో బిజెపిని, రాష్ట్రంలో ఉన్న వైసిపిని గద్దె దించాలి, నోరెత్తని తెలుగుదేశం, జనసేనకు బుద్ధిచెప్పాలి.

కరువు పట్టడం లేదు

• ఎఐకెఎస్ నాయకులు కె.రామచంద్రయ్య, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు జెట్టి గుర్నాథరావు

రాష్ట్రంలో కరువు తాండవిస్తోంది. దీన్ని ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ప్రజలను పట్టించుకోవడం లేదు. ప్రజలు తిండిలేక అల్లాడుతుంటే అదేమీ పెద్ద సమస్యకాదన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఇటువంటి పాలకులకు బుద్ధిచెప్పాల్సిన అవసరం ఉంది.

ఎల్ఐసిని కాపాడుకోవాలి

• ఐసిఇయు నేత కిషోర్‌కుమార్

45 లక్షల కోట్ల విలువైన ఆస్తులున్న ఎల్ఐసిని ప్రైవేటీకరించేందుకు కేంద్రం ప్రయత్నిస్తోంది. దీన్ని అడ్డుకునేందుకు జరిగే పోరాటంలో అందరూ కలిసి రావాలి. దేశంలో కోట్లమంది జీవితాలకు భద్రత కల్పిస్తున్న ఎల్ఐసిని దెబ్బతీయడం అంటే దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడమే. దీనిపై గళమెత్తాలి.

ప్రజల సంపదను దోచి పెడుతున్నారు

• రైతు నేతలు ఇండ్ల ప్రభాకరరెడ్డి, రాధాకృష్ణమూర్తి

ప్రజల సంపదను అదానీ, అంబానీలకు దోచీపెడుతున్నారు. ఇదెక్కడి పాలనో అర్థం కావడం లేదు. దీనిపై రైతులు, కార్మికులు, శ్రామికులు, ఉద్యోగులు ఆలోచించాలి. మహాధర్నా భవిష్యత్ ఉద్యమాలకు సూచికగా కనిపిస్తోంది. ఢిల్లీ ఉద్యమం రైతులను ఉత్సాహపరిచింది. దీన్ని కొనసాగించాలి.

ప్రశ్నిస్తే వేధిస్తున్నారు

• రైతు కూలీ సంఘం నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు

కేంద్ర చేస్తున్న తప్పులు ప్రశ్నించిన వారిని ఎత్తిచూపిన వారిని అరెస్టులు చేయిస్తున్నారు. ఉపా చట్టాలు మోపుతున్నారు. కార్పొరేట్‌శక్తులు దోచుకుంటుంటే వాటిని అడ్డుకున్న ఆదివాసీలకు మద్దతుగా నిలిచిన వారిపైనా దేశ ద్రోహం కేసులు బనాయించారు. అడ్డుకునేందుకు జరిగే అన్ని పోరాటాల్లోనూ అందరూ కలిసి రావాలి.

మతోన్మాదంతో హత్యలకు పాల్పడుతున్నారు

• అవాజ్ రాష్ట్ర కార్యదర్శి చిష్తీ

గోరక్షణ, లవ్ జిహాద్ పేరుతో మతోన్మాదులు హత్యలకు పాల్పడుతున్నారు. మోడీ హిందూత్వం పేరుతో హింసను ప్రేరేపిస్తున్నారు. ఇటువంటి విధానాలకు వ్యతిరేకంగా జరిగే ఆందోళనల్లో అందరూ కలిసి రావాలి.

సహజ వనరులను దోచేస్తున్నారు

• పర్యావరణ వేత్త రాందేవ్

రాష్ట్రంలో ఉన్న సహజ వనరులను దోచేస్తున్నారు. రాష్ట్రంలో ఉన్న గ్యాస్‌ను గుజరాత్‌కు తరలించుకుపోయి అదే గ్యాస్‌ను మనకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. మన గ్యాస్‌ను మనం ఎందుకు వినియోగించుకోకూడదు. దీనిపై కేంద్రం సమాధానం చెప్పాలి. లేదా ప్రజలంతా నిలదీయాలి.

నివాళులర్పిస్తున్న ప్రముఖ చరిత్రకారులు కొప్పర్తి వెంకటరమణమూర్తి, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం

విఠపు బాలసుబ్రమణ్యంకు 'కొమ్మారెడ్డి కేశవరెడ్డి' అవార్డు

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సీనియర్ నాయకులు, ఐక్య ఉపాధ్యాయ పత్రిక మాజీ సంపాదకులు, అనువాదకులు, సాహితీవేత్త కొమ్మారెడ్డి కేశవరెడ్డి స్మారక సాహితీ అవార్డును మాజీ ఎమ్మెల్సీ, విద్యావేత్త విఠపు బాలసుబ్రహ్మణ్యానికి ప్రదానం చేశారు. ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ప్రొఫెసర్, ప్రముఖ చరిత్రకారుడు కొప్పర్తి వెంకటరమణ మూర్తి, కేశవరెడ్డి కుటుంబసభ్యులు ఈ అవార్డును అందించారు. విద్యారంగానికి, ఉపాధ్యాయ ఉద్యమానికి, సమాజానికి విఠపు బాలసుబ్రహ్మణం చేసిన సేవలను కొనియాడారు. ఎపి యుటిఎఫ్, సాహితీ స్రవంతి, ప్రజాశక్తి బుక్‌హౌస్ ఆధ్వర్యంలో మంగళవారం ఒంగోలులోని అంబేద్కర్ భవన్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కె శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ.. కేశవరెడ్డి ఒక ఉపాధ్యాయుడిగా, రచయితగా, అనువాదకుడిగా దేశానికి ఎంతో సేవ చేశారని కొనియాడారు. ఆయన జీవితం ఎంతో ఆదర్శప్రాయమైనదని తెలిపారు. ప్రముఖ చరిత్రకారుడు, ప్రొఫెసర్ కొపర్తి వెంకటరమణమూర్తి స్మారక ఉపన్యాసం చేశారు. మన దేశ చరిత్రను వక్రీకరించే కుట్ర జరుగుతోందన్నారు. చరిత్రతోపాటు సామాజిక శాస్త్రాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయని తెలిపారు.

మొఘులాయిల చరిత్ర, మహ్మదీయుల చరిత్రను తొలగిస్తున్నారని వివరించారు. ఇండియాను భారత్‌గా పేరు మార్చే కుట్ర జరుగుతోందన్నారు. మతంలో విశ్వాసం ఒక్కటే ఉంటుందని, విశ్వాసం ఎప్పుడు ప్రశ్నించదని, అటువంటి విశ్వాసాలను ఆయుధంగా చేసుకొని లౌకిక దేశంలో విచ్ఛినానికి కుట్రలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆధారాలు లేని చరిత్రలను బలవంతంగా ప్రజలమీద రుద్దుతున్నారని, మేధావులు దీన్ని ప్రతిఘటించాలని కోరారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. భౌతికంగా కేశవరెడ్డి మన మధ్య లేకపోయినప్పటికీ ఆయన రచనలు, ఆశయాలు మన మధ్య ఉన్నాయని తెలిపారు. సాహితీ అవార్డు గ్రహీత, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. కొమ్మారెడ్డి కేశవరెడ్డితో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

కార్యక్రమంలో లేబర్ డిపార్ట్‌మెంట్ రిటైర్ట్ అసిస్టెంట్ కమిషనర్ డి ఆంజనేయరెడ్డి, కేశవరెడ్డి కుమారుడు శ్రీనివాసరెడ్డి, ప్రజాశక్తి బుక్ హౌస్ బాధ్యులు కె.లక్ష్మయ్య, సాహితీ స్రవంతి నాయకులు ఎవి పుల్లారావు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవి, వీరారెడ్డి, డి ఆంజనేయులు, ప్రముఖ రచయిత్రి టి.అరుణ, ఆల్ పెన్సర్స్ అసోషియేషన్ నాయకులు జి శేషయ్య తదితరులు పాల్గొన్నారు. దాచూరి రామిరెడ్డి విద్యాకేంద్రం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన చిత్రలేఖన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు అతిథులు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి జెవివి నాయకులు కె సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. నిర్వాహకులు మాట్లాడుతూ.. త్వరలోనే దాచూరిరామిరెడ్డి విజ్ఞాన కేంద్రం తరపున ప్రకాశం జిల్లాలో బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

'ఉక్కు'పై కుట్రలను తిప్పికొడతాం

• పోరాట కమిటీ నాయకులు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేయడానికి జరుగుతున్న కుట్రలను ఐక్యపోరాటాలతో తిప్పికొడతామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 1020వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ సింటర్ ప్లాంట్ కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు జె.రామకృష్ణ మాట్లాడుతూ.. విభాగాల వారీగా ప్రయివేటీకరణకు టెండర్లు పిలవడం, ప్రధాన విభాగాల్లో ఉత్పత్తిని గణనీయంగా తగ్గించడం ద్వారా ప్లాంట్‌ను నష్టాల్లోకి నెట్టడం, కార్మికులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను నెరవేర్చకపోవడం వంటి చర్యలతో ఉక్కు యాజమాన్యం కుట్రలు పన్నుతోందని విమర్శించారు. సకాలంలో రా మెటీరియల్‌ను కొనుగోలు చేయడం లేదన్నారు. ప్లాంట్ పరిరక్షణే ధ్యేయంగా వెయ్యి రోజులుకు పైగా ధర్నాలు, నిరాహార దీక్షలు చేస్తున్నా మోడీ సర్కారు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. దీక్షల్లో నాయకులు కె.భాస్కర్‌రావు, కెవి.సత్యనారాయణ, డివికె.రాజు పాల్గొన్నారు.

వైసిపి కార్యాలయంలో పూలేకి ఘన నివాళి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వెనుకబడిన తరగతులు అన్ని రంగాల్లో రాణించాలనే జ్యోతిరావు పూలే ఆశయాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సాకారం చేస్తూ బిసిల సాధికారత కోసం కృషి చేస్తున్నారని పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో జ్యోతిరావు పూలే వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే విగ్రహానికి మంత్రులు, వైసిపి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. దేశంలో బడుగు, బలహీన తరగతుల హక్కుల కోసం పోరాటం చేసిన యోదుడు జ్యోతిరావు పూలే అని అన్నారు. పూలే ఆశయ సాధన కోసం వైసిపి కార్యకర్తలు ముందుకు రావాలని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు, సంస్కృత అకాడమి ఛైర్మన్ లక్ష్మీపార్వతి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం ఒకటే - జీతాల్లో వ్యత్యాసం

(మొదటిపేజీ తరువాయి)

మాత్రం విద్యుత్తు శాఖ చెల్లిస్తోంది. ఇప్పటికే అత్యవసర సేవల పేరుతో 24 గంటలు షిప్టుల వారీగా అర్ధరాత్రి, అపరాత్రి కూడా విధులు చేయాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. తమను గ్రామ వార్డు సచివాలయాలశాఖ ఉద్యోగులుగా గుర్తిస్తే జాబ్ చార్ట్ ఆ శాఖ సూచించిన విధంగా ఉంచాలని, లేక విద్యుత్ శాఖ ఉద్యోగులుగా గుర్తిస్తే ఆశాఖ బేసిక్ అమలయ్యే విధంగానైనా అమలు చేయాలని గతంలో ఎనర్జీ అసిస్టెంట్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

మరణించిన వారిని ఆదుకోరా?

ఎనర్జీ అసిస్టెంట్లు విద్యుత్తు స్తంభాలు ఎక్కిన సమయాల్లో ప్రమాదాలకు గురై మరణించినా తీవ్ర గాయాల పాలైన గ్రామవార్డు సచివాలయశాఖ లేక, విద్యుత్‌శాఖ నుంచి ఎటువంటి పరిహారం ఇవ్వడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వర్కుఛార్ట్ తయారు చేసి న్యాయం చేయాలని ఎనర్జీ అసిస్టెంట్లు కోరుతున్నారు.

ప్రజల్లోకి విస్తృతంగా డిమాండ్లు

(మొదటిపేజీ తరువాయి)

ఉద్యమించాలని ధర్నా దిశా నిర్దేశం చేసింది. కేంద్రంలో మోడీ సర్కారును ఓడించి దేశాన్ని రక్షించుకోవాలన్న రాజకీయ లక్ష్య సాధనను మార్గ నిర్దేశం చేసింది. రాష్ట్రంలో బిజెపికి మద్దతిచ్చే పార్టీలు ఆలోచించుకోవాలని, లేదంటే వారినీ ఓడిస్తామని మహా ధర్నా హెచ్చరించింది.

ధన్యవాదాలు: వడ్డే

ధర్నాకు వేలాదిగా తరలివచ్చి అనుకున్నదానికంటే మిన్నగా విజయవంతం చేసిన రైతులు, కార్మికులకు ఎపి రైతు సంఘాల కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు ధన్యవాదాలు తెలిపారు. మహిళలు ఇంత దూరం ధర్నాకు చైతన్యంతో కదలడం భవిష్యత్తు ఉద్యమాలకు ఉత్సాహాన్నిస్తుందన్నారు. సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు చెప్పారు. ఎపి రైతు సంఘం నాయకులు వై కేశవరావు మాట్లాడుతూ ధర్నా సన్నాహాల కోసం కృషి చేస్తున్న సమయంలో శోభనాద్రీశ్వరరావు రెండు తడవలు అస్వస్థులయ్యారని, గుంటూరు ఆస్పత్రిలో చేరారని, ఆపై హైదరాబాద్‌లోనూ చికిత్స తీసుకున్నారని తెలిపారు. ఆరోగ్యాన్ని లెక్క చేయకుండా కృషి చేసి తమందరిలో స్ఫూర్తి నింపారన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

ఎల్జీ పాలిమర్స్ తరలింపుపై తీర్పు వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

విశాఖలోని ఎల్జీ పాలిమర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందిన ఇపిసి ప్లాంటును రీలొకేట్ చేసేందుకు అనుమతించాలని ఆ సంస్థ హైకోర్టులో దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌పై హైకోర్టు తీర్పును వాయిదా వేసింది. చిత్తూరు జిల్లాలోని శ్రీసిటీకి తమ ప్లాంట్‌ను తరలింపునకు అనుమతి ఇవ్వాలనే వ్యాజ్యంపై తీర్పును రిజర్వులో పెడుతున్నట్లు జస్టిస్ దుర్గాప్రసాదరావు, జస్టిస్ ఎం కిరణ్మయితో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ప్రకటించింది.
ఎల్జీ పాలిమర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ఇంజినీరింగ్ ప్లాస్టిక్ కౌంపౌండింగ్ ప్లాంట్‌ను తరలింపు అంశంపై డిసెంబరు 7న తుది ఉత్తర్వులు ఇస్తామని ప్రకటించింది.
2020 మే 7న ఎల్జీ పాలిమర్స్ నుంచి గ్యాస్ లీకేజీ జరిగి పలువురు మరణించారు. దీనిపై హైకోర్టు సుమోటోగా విచారణ చేస్తోంది. కోర్టు ఆదేశాల మేరకు ఆ సంస్థ జిల్లా కలెక్టర్ బ్యాంక్ ఖాతాలో రూ.143 కోట్లను జమ చేసింది.
ప్లాంట్‌ను రీలొకేట్ చేసేందుకు అనుమతినివ్వాలనే వ్యాజ్యంపై మంగళవారం వాదనలు పూర్తవ్వడంతో తీర్పు వాయిదా పడింది.

మంటగలిసిన సామాజిక న్యాయం

• టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సామాజిక న్యాయాన్ని మంటగలుపుతోందని, సిఎం తమ వర్గానికి పెద్దపీట వేస్తున్నారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు ఆరోపించారు. కేంద్రం నుంచి 15 మంది అధికారులు రాష్ట్రానికి డిప్యుటేషన్‌పై వస్తే వారిలో పది మంది ఆయన సామాజిక వర్గానికి చెందిన వారేనన్నారు. మంగళగిరిలోని టిడిపి కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పెరిగిన మద్యం ధరలు, కల్తీ మద్యం అమ్మకాలను ప్రశ్నించారన్న అక్కసుతో ఓం ప్రతాప్ అనే దళిత యువకుడిని దారుణంగా చంపించడమేనా జగన్ అమలు చేస్తున్న సామాజిక న్యాయం? అని అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. ఇసుక దోపిడీపై ప్రశ్నించిన పాపానికి వర ప్రసాద్ అనే దళిత యువకుడికి ప్రభుత్వం శిరోముండనం కానుకగా ఇచ్చిందన్నారు.చేసిన తప్పులకు టిడిపి ప్రభుత్వం వస్తే శిక్షిస్తుందనే భయంతోనే కొందరు ఉన్నతాధికారులు తిరిగి కేంద్ర సర్వీసులకువెళ్లడానికి వెంపర్లాడుతున్నారన్నారు. సమావేశంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు, ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు, మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ పాల్గొన్నారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆందోళనకరం : యనమల

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, అప్పుల భారం లెక్కలేనంతగా పెరిగిపోయిందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు విమర్శించారు. ఆర్థిక పరిస్థితిపై వాస్తవాలు వెల్లడించాలని తాను రాసిన లేఖకు ఆర్థికశాఖ మంత్రి, కార్యదర్శుల నుంచి జవాబు రాకపోవడంతో తమ అవగాహన సరైందిగా భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. వైసిపి ప్రభుత్వం 2024 మార్చి నాటికి రూ.10 లక్షల కోట్ల అప్పు, ఏడాదికి రూ.50 వేలకోట్లు వాయిదా కట్టే పరిస్థితిని తెస్తోందన్నారు. ఈ అప్పులకు తోడు అదనంగా ప్రభుత్వ గ్యారెంటీల పేరుతో రుణాలు ఇబ్బడి ముబ్బడిగా తెస్తోందన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ప్రభుత్వ గ్యారెంటీలు ఆ నిధులను ఏ ప్రయోజనాలకు వెచ్చించారో శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పేదల అభ్యున్నతికి కులగణన దోహదం

• కులగణన ప్రాంతీయ సదస్సులో కలెక్టర్ వెంకట రమణారెడ్డి

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

పేదల అభ్యున్నతికి కులగణన దోహదపడుతుందని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కుల గణన - 2023 ఆవశ్యకతపై తిరుపతి, ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు, చిత్తూరు, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లాల ప్రాంతీయ సదస్సు మంగళవారం శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో జరిగింది. ఈ సదస్సుకు కలెక్టర్ వెంకట రమణారెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడారు. సమాజంలో అంతరాలు తొలగాలంటే కులగణన తప్పనిసరని పేర్కొన్నారు. వాస్తవంగా ఉన్న కులాల వారి జనాభాను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కులగణనకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. దీని వల్ల కులాల వారీగా వారి సామాజిక, విద్య, ఆర్థిక పురోగతి తెలుసుకోడానికి, సముచిత విధాన నిర్ణయాలు తీసుకోడానికి, ప్రభుత్వ పథకాల రూపకల్పనకు ఉపయోగపడుతుందని తెలిపారు. చిత్తూరు పార్లమెంటు సభ్యులు రెడ్డప్ప మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల్లో ఉన్న అంతరాలు తొలగిపోవాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం కుల గణన చేపడుతుందని తెలిపారు. సమసమాజ స్థాపనకు కులగణన తప్పనిసరి పేర్కొన్నారు. సదస్సులో శాసనమండలి సభ్యులు సిపాయి సుబ్రహ్మణ్యం, తిరుపతి నగర మేయర్ శిరీష, చిత్తూరు నగర మేయర్ అముద, వివిధ జిల్లాల కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, వివిధ కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజు లేఖరిపై కాల్పులు

• అక్కడికక్కడే మృతి

• నల్లజర్ల మండలం పుల్లలపాడులో ఘటన

ప్రజాశక్తి-నల్లజర్ల(తూర్పుగోదావరి)

తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం పుల్లలపాడు గ్రామానికి చెందిన దస్తావేజు లేఖరి కాట్రగడ్డ ప్రభాకర్‌రావు(60) దారుణ హత్యకు గురయ్యారు. ఆగంతకులు తుపాకీతో కాల్పులు జరపడంతో అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పుల్లలపాడు గ్రామానికి చెందిన ప్రభాకర్‌రావు అనంతపల్లి గ్రామంలోని సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ వద్ద కొంతకాలంగా దస్తావేజు లేఖరుగా పనిచేస్తున్నారు. మంగళవారం యథావిధిగా తన విధులను ముగించుకుని సాయంత్రం ఇంటికి వచ్చారు. తన ఇంటి వద్ద బెంచ్‌పై కూర్చుని ఉండగా ఇద్దరు వ్యక్తులు కారులో వచ్చారు. బయట ఎవరూ లేని సమయం చూసుకుని వారి వెంట తెచ్చుకున్న తుపాకీతో ప్రభాకర్‌రావు ఛాతీ, తలపై కాల్పులు జరిపారు. కాల్పుల శబ్దంతో ఆయన భార్య సత్యవతి బయటకు వచ్చారు. అప్పటికే ప్రభాకరరావు రక్తపు మడుగులో విగత జీవిగా పడి ఉన్నారు. ఆమె వెంటనే బంధువులకు సమాచారం అందించారు. చుట్టుపక్కల వారు ఘటన నుండి తేరుకునే లోగా అగంతకులు అక్కడ నుంచి పారిపోయారు. ఎస్‌పి జగదీష్, డిఎస్‌పి విఎస్ఎన్.వర్మ, సిఐ నున్న రాజు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తిరుపతి నగరాభివృద్ధికి టిటిడి నిధులు ఖర్చు చేయొచ్చు

• రౌండ్ టేబుల్ సమావేశంలో రాజకీయ పార్టీలు, జర్నలిస్టులు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

తిరుపతి నగరాభివృద్ధికి టిటిడి నిధులు ఖర్చు చేయడం ఏ మాత్రమూ తప్పు కాదని రాజకీయ పార్టీల నేతలు, జర్నలిస్టులు ముక్త కంఠంతో పేర్కొన్నారు. నగరాభివృద్ధికి అడ్డు చెబుతున్న బిజెపి అభ్యంతరాలను లెక్కపెట్టాల్సిన అవసరం లేదని ఏకగ్రీవంగా తీర్మానించారు. 'టిటిడి నిధులతో తిరుపతి అభివృద్ధి' అనే అంశంపై తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి మాట్లాడుతూ.. తిరుపతిలో 42 శాతం టిటిడి ఆస్తులు ఉన్నా మున్సిపల్ కార్పొరేషన్ ఒక్క రూపాయి కూడా పన్ను వసూలు చేయడం లేదన్న విషయాన్ని గుర్తు చేశారు. 1987 న ప్రభుత్వం ఆమోదించిన టిటిడి చట్టంలోని 146వ పేజీ 111 పాయింట్‌లో తిరుపతి నగరంలో యాత్రికులు, యాత్రికుల కోసం తాగునీరు, పారిశుధ్యం, విద్య, వైద్యం కోసం నిధులు ఖర్చు చేయవచ్చని స్పష్టంగా ఉందన్నారు. జెరూసలెం నగరాభివృద్ధికి అన్ని మత సంస్థలు, వాటికన్ సిటీ అభివృద్ధికి పోప్ సంస్థానం కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేస్తున్నాయనే విషయం బిజెపి నాయకులు తెలుసుకుంటే మంచిదన్నారు. టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి చినబాబు మాట్లాడుతూ.. తిరుపతి అభివృద్ధికి టిటిడి ఎన్ని నిధులు అయినా ఖర్చు చేయవచ్చని చెప్పారు. వైసిపి నాయకులు వెంకటేష్, అజయ్, వాసు యాదవ్, ఆర్‌పిఐ పార్టీ నాయకులు ఆంజయ్య, సిపిఐ నాయకులు మురళి, రాయలసీమ మేధావుల ఫోరం అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు కృష్ణప్రసాద్‌తో పాటు పలువురు జర్నలిస్టులు మాట్లాడారు. తిరుపతి అభివృద్ధికి, పారిశుధ్య నిర్వహణకు నిధులు ఇవ్వాలని టిటిడి పాలకమండలి తీసుకున్న నిర్ణయాన్ని అభినందించారు.

ఆందోళన విరమించకుంటే కఠిన చర్యలు

- సిహెచ్ఒలపై కృష్ణబాబు ఫైర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సామాజిక ఆరోగ్యాధికారులు (సిహెచ్ఒలు) వెంటనే ఆందోళన విరమించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామంటూ వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు ఫైర్ అయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామీణ ప్రజలకు అవసరమైన వైద్య సేవలను అందించేందుకు ప్రభుత్వం 2019 నుంచి సిహెచ్ఒలను నియమించిందని అన్నారు. వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో నియమితులైన సిహెచ్ఒలను కాంట్రాక్టు పద్ధతిలో నియమితులయ్యారని, వారి పనితీరు అంచనా ఆధారంగా ఆ కాంట్రాక్టును పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. వీరికి నెలకు రూ.25 వేల వంతున వేతనంతోపాటు రూ.15 వేల ప్రోత్సాహకాన్ని వారి పనితీరు ఆధారంగా అందజేస్తున్నామన్నారు. నియామకం సందర్భంలో వీరు ప్రభుత్వంతో కుదుర్చుకున్న వార్షిక ఒప్పంద షరతుల ప్రకారం విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా, సరిగ్గా విధులు నిర్వహించలేకపోయినా జిల్లా ఆరోగ్య సమాఖ్య వారి వేతనాలను నిలుపుదల చేయడంతోపాటు విధుల్లోంచి తొలగించే అధికారం కలిగి ఉంటుందన్న అంశం అత్యంత ప్రధానమైనదని ఆయన గుర్తు చేశారు. వారికి కాంట్రాక్టు ప్రోత్సాహకంతోపాటు మరో 30 శాతం అందించాలని నిర్ణయించిందని, ఈ ప్రకారమే ఇప్పుడు వేతన చెల్లింపులు కొనసాగుతున్నామని వివరించారు. వారి డిమాండ్ మేరకు ఏటా 15 రోజులు సాధారణ సెలవులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. వెంటనే సిహెచ్ఒలు విధుల్లో చేరాలని విజ్ఞప్తి చేశారు.

జీతాలు ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం

- పురందేశ్వరి

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందని, ఉద్యోగులకు సకాలంలో జీతాలు కూడా ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం ఉందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. విజయనగరంలోని తోటపాలెంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఇసుక, మైనింగ్, మద్యం వ్యాపారాలతో వైసిపి నేతలు జేబులు నింపుకుంటున్నారని ఆరోపించారు. ప్రజలకు అన్యాయం చేస్తూ సామాజిక సాధికార యాత్ర చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ఏ హక్కు ఉందని ప్రశ్నించారు. వంశధార, నాగావళిలో ఇసుక మాఫియా అక్రమ వ్యాపారం జరుగుతోందని ఆరోపించారు. 1.80 లక్షల ఎకరాలకు నీరందించే తోటపల్లి రిజర్వాయర్ పూడికలతో నిండిపోయిందని తెలిపారు. సుగర్ ఫ్యాక్టరీలు మూతపడితే వాటిని తెరిపించకుండా జిల్లా వాసులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షులు నడికుదుటి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం

- తరచూ క్యాంపస్ మార్పు
- కనీస సౌకర్యాలు మృగ్యం
- ప్రయివేట్ యూనివర్సిటీ 'బెస్టూ' నిర్వాకం

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

విద్యార్థుల జీవితాలతో ప్రయివేటు విశ్వవిద్యాలయం ఆటలాడుతోంది. తరచూ క్యాంపస్ మారుస్తుండడంతో విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారు. కొంతమంది మధ్యలోనే చదువు ఆపేస్తున్నారు. నాణ్యమైన విద్యనందిస్తామని నమ్మబలుకుతున్న ప్రయివేటు విశ్వవిద్యాలయాలు తమ ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం గౌనివారిపల్లిలో భారతీయ ఇంజనీరింగు సైన్సు అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ యూనివర్సిటీ (బెస్టూయు) 2018లో ఏర్పాటైంది. ఈ ప్రయివేటు విశ్వవిద్యాలయంలో అగ్రికల్చర్ బిఎస్‌సి, హార్టికల్చర్ బిఎస్‌సి, ఇంజనీరింగు, మేనేజ్‌మెంట్ కోర్సులను నిర్వహించడానికి అనుమతులు తీసుకున్నారు. ప్రధాన క్యాంపస్ గౌనిపల్లిలోని 147 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. అంతవరకు తాత్కాలికంగా అనంతపురం నగరం సమీపంలోని వడియంపేట వద్ద ఉన్న వైటిఆర్ ఇంజనీరింగు కళాశాల ఆవరణలో ఒక క్యాంపస్‌ను నిర్వహించారు. ఇక్కడ వసతులు సరిగా లేవని విద్యార్థులు అప్పట్లో ఆందోళనకు దిగినా యూనివర్సిటీ యాజమాన్యం పట్టించుకోలేదు. గతేడాది మెయిన్ క్యాంపస్‌లో అన్ని రకాల సౌకర్యాలూ ఏర్పాటు చేసినట్లు చెబుతూ ఇక్కడి నుంచి గౌనిపల్లికి మార్చారు. అక్కడ బాలికలకు వసతి గృహం క్యాంపస్‌లో ఉన్నప్పటికీ బాలురకు లేదు. పక్కన గ్రామాలు కూడా లేనిచోట దీన్ని ఏర్పాటు చేయడంతో బాలురు వసతిని 20 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో చూసుకోవాల్సి వచ్చింది. ఇక్కడ ఇబ్బందులు ఉన్నాయని విద్యార్థులు చెబుతున్నా పట్టించుకోలేదు.

ఈ ఏడాది అడ్మిషన్ల సమయంలో క్యాంపస్‌ను అనంతపురం జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న అక్కంపల్లిలోని ఒక ప్రయివేటు పాఠశాల భవనానికి మార్చారు. ఇక్కడే 14 సంవత్సరాల పాటు క్యాంపస్ ఉంటుందని చెప్పడంతో అందుబాటులో ఉంటుందనే ఉద్దేశంతో కొంతమంది విద్యార్థులు వివిధ కోర్సుల్లో మూడు మాసాల క్రితం కొత్తగా చేరారు. మళ్లీ ఇప్పుడు క్యాంపస్‌ని 120 కిలోమీటర్ల దూరంలోని గౌనిపల్లికి మారుస్తామని యజమాన్యం చెప్పడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళనబాట పట్టారు. అంతదూరంలో, సౌకర్యాలు లేనిచోట తమ పిల్లలు ఎలా ఉండగలరని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్యాంపస్‌లో 270 మంది వరకు విద్యార్థులు ఉన్నారు. వీరందరిలోనూ ఇదే రకమైన ఆందోళన నెలకొంది.

క్యాంపస్ ముందు ఆందోళన చేస్తున్న విద్యార్థులు, నాయకులు (ఫైల్ ఫొటో)

కలెక్టర్‌కు ఫిర్యాదు

పేరుకే విశ్వవిద్యాలయమని, ఏ మాత్రమూ సౌకర్యాల్లేవని, అధ్యాపకులు కూడా సరిగాలేరని జిల్లా కలెక్టర్ గౌతమి దృష్టికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీసుకెళ్లారు. యూనివర్సిటీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. విశ్వవిద్యాలయం క్యాంపస్‌ను తరచూ మారుస్తున్నారని, విద్యా బోధన సరిగా లేదని, వసతి గృహాల్లో పరిశుభ్రత లోపించిందని ఈ వినతిపత్రంలో పేర్కొన్నారు. తమ పిల్లల భవిష్యత్ కాపాడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు.

ప్రయివేటు విశ్వవిద్యాలయంపై పర్యవేక్షణ పెంచాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయివేటు విశ్వవిద్యాలయాలకు అనుమతులిచ్చి వదిలేస్తున్నాయి. వీటిపై పర్యవేక్షణ కరువైంది. దీంతో, వాటికిష్టమెచ్చినట్టు వ్యవహరిస్తున్నాయి. బెస్టూ విశ్వవిద్యాలయంలోనూ ఇదే రకంగా ఉంది. సరైన వసతులు, బోధనా సిబ్బంది లేరు. ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలి.

– పరమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి, అనంతపురం

చెత్తలో పేలుడు

- ఐదుగురు విద్యార్థులకు గాయాలు

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్(కాకినాడ జిల్లా)

కాకినాడ జిల్లా మామిడాడలోని ఏలేరు కాలువ సమీపంలో తగులబెట్టిన చెత్తలో పేలుడు సంభవించింది. ఈ పేలుడులో ఐదుగురు విద్యార్థులు గాయపడ్డారు. ఈ సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మామిడాడ గ్రామానికి చెందిన ఎనిమిది మంది విద్యార్థులు స్నానం చేసేందుకు సోమవారం సాయంత్రం ఏలేరు కాలువ వద్దకు వెళ్లారు. కాలువగట్టు సమీపంలో పంచాయతీ సిబ్బంది డంప్ చేసిన చెత్తను గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. స్నానాల అనంతరం చలి ఎక్కువగా ఉండడంతో నిప్పుపెట్టిన చెత్త చెంతన మంట కాగేందుకు ఆగారు. అ సమయంలో మంటలో పెద్ద శబ్దంతో పేలుడు సంభవించింది. మంటకాగుతున్న విద్యార్థులపై నిప్పులు పడడంతో మంద రాజ్ కుమార్(16), జంగం ఏసుబాబు (15), చింత ఆనంద్‌కుమార్ (15), ఉప్పాడ మురళి (17), ఉప్పాడ రామ్‌చరణ్ (12) గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఘటనా స్థలానికి చేరుకుని వారిని కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం చిన్నారుల పరిస్థితి బాగానే ఉందని, భయపడాల్సిన అవసరం లేదని వైద్యులు తెలిపారు. చికిత్స పొందుతున్న చిన్నారులను టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ పరామర్శించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

ప్రజలకు అభివాదం చేస్తూ పాదయాత్ర చేస్తున్న లోకేష్

జగన్ హయాంలో ఆక్వా హాలిడే

- యువగళం యాత్రలో లోకేష్

ప్రజాశక్తి - అమలాపురం

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఆక్వా హాలిడే ప్రకటించే పరిస్థితులు ఏర్పడ్డాయని, ఆక్వా రైతుల పరిస్థితి నేడు అగమ్యగోచరంగా తయారైందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం పేరూరు క్యాంప్ సైట్ నుంచి 211వ రోజు యువగళం పాదయాత్రను మంగళవారం ఆయన కొనసాగించారు. అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో యాత్ర సాగింది. యాత్రలో భాగంగా వివిధ సామాజిక తరగతులు, ఆక్వా రైతులు, యువత, స్థానికులతో సమావేశమయ్యారు. ఆయా రంగాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తొలుత అమలాపురం పేరూరు క్షత్రియ కళ్యాణ మండపం వద్ద ఆక్వా రైతుల సమావేశంలో పాల్గొన్నారు. గిట్టుబాటు ధర రావడం లేదని, ఫీడ్ యజమానులు సిండికేట్లుగా మారి ధరలు పెంచేస్తున్నారని, రొయ్యల ఎగుమతిదారులు సైతం సిండికేట్లుగా మారి ధరలను నియంత్రిస్తున్నారని ఆక్వా రైతులు వాపోయారు. లోకేష్ మాట్లాడుతూ... సీడ్, ఫీడ్, విద్యుత్ ఛార్జీలు భారీగా పెంచి ఆక్వా రైతులను వైసిపి ప్రభుత్వం కోలుకోలేని దెబ్బతీసిందన్నారు. టిడిపి అధికారంలోకొస్తే ఆక్వా రంగాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. యూనిట్ రూ.1.50కే విద్యుత్ అందిస్తామని తెలిపారు. అనంతరం అమలాపురం క్లాక్ టవర్ సెంటర్‌లో చేనేత కార్మికులతో సమావేశమయ్యారు. నాలుగున్నరేళ్ల జగన్ పాలనలో చేనేత రంగం పూర్తిగా నిర్వీర్యమైందని మండిపడ్డారు. ముమ్మిడివరం గేటు వద్ద లోకేష్‌ను వికలాంగులు కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం శెట్టిబలిజ సంఘం నాయకులతో లోకేష్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసిపి ప్రభుత్వ హయాంలో బిసి కులాలు, కులవృత్తులు నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. బిసిల కోసం ఖర్చుచేయాల్సిన రూ.75,760 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిందని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే దామాషా పద్ధతిన శెట్టి బలిజలకు నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ముమ్మిడివరంలోని మహిళా కళాశాల వద్ద ఏర్పాటు చేసిన క్యాంప్ సైట్ వద్దకు యాత్ర చేరుకుంది. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే అయితా బత్తుల ఆనందరావు, హరీష్‌మాథూర్, మెట్ల రమణబాబు తదితరులు ఉన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.5 కోట్లు

ప్రజాశక్తి- తిరుమల

తిరుమల శ్రీవారికి హుండీ లెక్కింపు ద్వారా రూ.3.5 కోట్ల ఆదాయం వచ్చింది. శ్రీవారి దర్శనానికి మంగళవారం తొమ్మిది కంపార్టుమెంట్‌లలో యాత్రికులు వేచి ఉన్నారు. దర్శనానికి నాలుగు గంటల సమయం పడుతుందని, యాత్రికుల రద్దీ సాధారణంగా ఉందని టిటిడి అధికారులు పేర్కొన్నారు. నకిలీ గుర్తింపు కార్డులతో ఓ వ్యక్తి తిరుమల శ్రీవారి సుప్రభాత సేవ 70 టికెట్లను నమోదు చేశాడు. నిందితుడిని గుంటూరుకు చెందిన రసూల్‌గా టిటిడి విజిలెన్స్ అధికారులు గుర్తించారు. విజిలెన్స్ అధికారుల ఫిర్యాదుతో తిరుమల పోలీసులు కేసు నమోదు చేశారు.

నూతన పింఛన్లకు నిబంధనల మెలిక!

సర్కారు నిర్ణయంతో దరఖాస్తుదారుల్లో ఆందోళన

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

నూతన పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే వారికి ప్రభుత్వం విధించిన కొత్త నిబంధనలు ఆందోళన కలిస్తున్నాయి. పింఛను పొందేందుకు గతంలో ఆధార్ కార్డు, రైస్/ రేషన్ కార్డు, విద్యుత్ బిల్లుల జిరాక్స్ కాపీలు ఇస్తే సరిపోయేది. ఈ నెల పది నుంచి ప్రభుత్వం కొత్త మెలిక పెట్టింది. వీటితోపాటు గ్యాస్ బుక్, ఓటరు కార్డు లేదా పాస్‌పోర్టు ఈ మూడింటిలో ఏదేని ఒకటి తప్పనిసరిగా ఉండాలని నిబంధన విధించింది. దీంతో, దరఖాస్తుదారుల్లో ఆందోళన నెలకొంది. తూర్పుగోదావరి జిల్లాలోని 19 మండలాల్లో 2,43,160 మంది పింఛను లబ్ధిదారులు ఉన్నారు. వృద్ధాప్య, వితంతు, వికలాంగుల కేటగిరీలతోపాటు మొత్తం 17 రకాల పింఛన్లను అందజేస్తున్నారు. ఈ ఏడాది రెండు విడతల్లో 13,212 మందికి నూతనంగా పింఛన్లు మంజూరు చేశారు. కొత్త దరఖాస్తులను ఈ నెల పదో తేదీ నుంచి ఈ నెల 24వ తేదీ వరకూ స్వీకరించారు. జిల్లాలోని అన్ని సచివాలయాలకూ 50 నుంచి 60కి తక్కువ కాకుండా దరఖాస్తులు వచ్చాయి. కొందరి దరఖాస్తుదారుల వయసు ఆధార్ కార్డులో ఒకలా, ఓటరు కార్డులో మరోలా ఉంది. 60 ఏళ్లు నిండిన వారికే పింఛను మంజూరయ్యే అవకాశం ఉండగా, ఓటరు కార్డులు పొందిన సమయంలో వయసుకు సంబంధించి పలు లోపాలు జరిగాయి. కొత్త నిబంధనలతో అర్హులైన దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ నెలాఖరులోగా అర్హులైన వారి వివరాలు పొందుపరిస్తే వచ్చే ఏడాది జనవరి నెలకు పింఛను మంజూరయ్యే అవకాశం ఉందని అధికారులు చెప్తున్నారు. లేనిపక్షంలో మరో ఆరు నెలల వేచి చూడక తప్పదని అంటున్నారు. గతంలో దరఖాస్తు చేసుకున్న పలువురు వికలాంగులకు సెకండ్ ఫేజ్‌లో పింఛన్లు మంజూరు కాలేదు. పలు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఫలితం లేకపోయింది.

వృద్ధులు, వితంతువులతోపాటు వివిధ కేటగిరీలకు పింఛన్లు మంజూరయ్యాయి. కానీ, వికలాంగులకు నిరాశే ఎదురైంది. సదరంలో ధ్రువీకరణ పత్రం పొందిన వారు, 40 శాతం పైబడి వైకల్యం ఉంటే పింఛనుకు అర్హులని ప్రభుత్వం పేర్కొంది. అయితే, సదరం ధ్రువీకరణ పత్రాల జారీ ఆలస్యం కావడంతో పింఛన్లు మంజూరు కాలేదని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు దృష్టి సారించి నిబంధనల్లో మార్పు చేయాలని, అర్హత ఉన్న వారందరికీ పింఛను మంజూరు చేయాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

అర్హులందరికీ పింఛన్లు

సచివాలయాలకు అందిన ఆదేశాల మేరకు పింఛను కోసం అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. గ్రామాల్లో స్థానికంగా ఉన్నారా? లేదా? అని తెలుసుకోవడానికే ఓటరు గుర్తింపు కార్డు కోరారు. విద్యుత్ వినియోగం 300 యూనిట్ల పరిమితిని పరిశీలించేందుకు బిల్లులను జతపర్చాలని అడిగారు. దరఖాస్తులను పరిశీలించి వికలాంగులతోపాటు అర్హులైన వారందరికీ పింఛన్లు మంజూరు చేస్తాం.

– వీణాదేవి, ఇన్‌ఛార్జి ప్రాజెక్టు డైరెక్టర్, డిఆర్‌డిఎ

నరసరావుపేట వైసిపిలో గ్రూపు విభేదాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో వైసిపిలో విభేదాలు బహిర్గతమయ్యాయి. మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా మంగళవారం నరసరావుపేటలోని వైసిపి కార్యాలయం నుండి పల్నాడు రోడ్డులోని ఆయన విగ్రహం వద్దకు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తన అనుచరులతో భారీ ర్యాలీగా వెళ్లారు.

పూలే విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ "నాలో మంచితనాన్నే చూశారు... ఇక మీదట నేనేంటో చూపిస్తా" అంటూ వ్యాఖ్యానించారు. ప్రజలలో తనకు పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక ఒక గ్రూపు తనను దెబ్బతీయాలని చూస్తోందని, ఆ ఇంటి నుంచి ఈ ఇంటికి ఎంత దూరమో ఈ ఇంటి నుంచి ఆ ఇంటికి అంతే దూరమనే విషయం గుర్తు పెట్టుకోవాలని అన్నారు. ఎవరెన్ని కుట్రలు కుతంత్రాలు పన్నినా నరసరావుపేట సీటు, గెలుపు తనదేనని తేల్చి చెప్పారు. ఇదిలా ఉండగా అరగంట తర్వాత వైసిపి నేత డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి తన అనుచరులతో ర్యాలీగా పూలే విగ్రహం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో, విజయసాయిరెడ్డి నేతృత్వంలో వైఎస్ఆర్ కుటుంబానికి విధేయనిగా పని చేస్తానని అన్నారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని ప్రకటించారు. నరసరావుపేట ఎమ్మెల్యే సీటు కోసం బ్రహ్మారెడ్డి ప్రయత్నిస్తుండగా తన సీటు కాపాడుకోవడానికి శ్రీనివాస్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని, అందుకే వీరిద్దరూ వేర్వేరు గ్రూపులుగా వ్యవహరిస్తున్నారనే ప్రచారం స్థానికంగా జరుగుతోంది.

పెన్షన్ ఆప్షన్లకు గడువు పెంచండి

- ఎస్‌డబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్‌టిసి ఉద్యోగులకు పెన్షన్ ఆప్షన్లు తీసుకోవాలని అధికారులు ఒత్తిడి చేయడం సరైందికాదని, పెన్షన్ ఆప్షన్లు ఇచ్చేందుకు గడువు పెంచాలని ఎపిపిటిడి ఎస్‌డబ్ల్యుఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావుకు ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్‌కె జిలాని బాషా, రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ సుందరయ్య, ప్రధాన కార్యదర్శి అయ్యపురెడ్డి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఒపిఎస్ అయితే ఉద్యోగులకు ఎలాంటి సమస్య వుండేది కాదని తెలిపారు. సిపిఎస్‌లో ఆప్షన్ ఇవ్వాలనడంతో ఉద్యోగులు ఆప్షన్ ఇచ్చేందుకు ఇబ్బంది పడుతున్నారని, ఇపిఎఫ్ వైపు కూడా ఆలోచన చేస్తున్నారని తెలిపారు. జిపిఎస్‌ను చట్టం చేసినా అందుకు సంబంధించిన మార్గదర్శకాలు రూపొందనందున ఉద్యోగుల్లో గందరగోళ పరిస్థితులు వున్నాయన్నారు. జనవరి 24 నాటికి రిటైర్డు అయ్యే ఉద్యోగులు మాత్రమే ఆప్షన్‌ను తీసుకుని మిగిలిన ఉద్యోగులకు గడువును పెంచాలని కోరారు.



విశాఖ తీరంలో నేవీ డే రిహార్సల్స్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

విశాఖలోని ఆర్‌కె బీచ్‌లో నేవీ డే రిహార్సల్స్ విన్యాసాలు మంగళవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. నేవీ డే వేడుకల్లో భాగంగా తూర్పు నావికాదళం ఆధ్వర్యాన ఈ వేడుకలు ప్రారంభించారు. తొలిరోజు జరిగిన ఆపరేషనల్ డెమో విన్యాసాల్లో తూర్పు నావికాదళానికి చెందిన యుద్ధ విమానాలు, హెలీకాప్టర్లు, యుద్ధనౌకలు, సబ్ మెరైన్లు పాల్గొన్నాయి. వీటి విన్యాసాలు తీరంలోని వీక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. జనం పోటెత్తారు. ఈ నెల 30న, డిసెంబర్ 2న సాయంత్రం 4 గంటల నుంచి మళ్లీ ఈ విన్యాసాలు సాగనున్నాయి. ఫైనల్ ఆపరేషనల్ విన్యాసాలు డిసెంబర్ 4న నిర్వహించనున్నారు. పలువురు ప్రముఖులు అతిథులుగా హాజరుకానున్నారు.

రూ.1 లక్ష కోట్లు పెరిగిన అదాని స్టాక్స్ విలువ

ముంబయి : అదాని గ్రూపు కంపెనీల షేర్లు పరుగులు పెట్టాయి. అదాని సంస్థలపై వచ్చిన ఆర్థిక ఆరోపణల విచారణలో సెబీ విశ్వసనీయతను ప్రశ్నించడానికి ఎటువంటి కారణం కనడడటం లేదని సుప్రీంకోర్టు పేర్కొనడంతో మంగళవారం ఆ కంపెనీల స్టాక్స్ భారీగా పెరిగాయి. అదానికి చెందిన 10 లిస్టెడ్ కంపెనీల స్టాక్స్ విలువ ఒక్క పూటలోనే రూ.1.05 లక్ష కోట్ల మేర పెరిగి రూ.11..31 లక్షల కోట్లకు చేరింది. గడిచిన ఏడాదిన్నరలో ఒక్క రోజులో ఈ స్థాయిలో లాభపడటం ఇదే తొలిసారి. కాగా.. భారత స్టాక్ మార్కెట్లకు రెండు రోజుల వరుస నష్టాల నుంచి ఉపశమనం లభించింది. బిఎస్ఇ సెన్సెక్స్ 204 పాయింట్లు లేదా 0.31 శాతం పెరిగి 66,174 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 95 పాయింట్ల వృద్ధితో 19,890 వద్ద ముగిసింది. బిఎస్ఇలో మిడ్‌క్యాప్ సూచీ 0.30 శాతం, స్మాల్ క్యాప్ సూచీ 0.06 శాతం చొప్పున రాణించాయి.

ICICI PRUDENTIAL LIFE INSURANCE

ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ 98.14 క్లెయింల సెటిల్‌మెంట్

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో 98.14 శాతం క్లెయింలను సెటిల్‌మెంట్ చేసినట్లు ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ వెల్లడించింది. ప్రయివేటు రంగ జీవిత బీమా సంస్థలలో క్లెయిమ్ సెటిల్‌మెంట్ నిష్పత్తిలో తమ సంస్థనే అగ్రస్థానంలో ఉందని పేర్కొంది. 2023 జూన్ త్రైమాసికంలో 97.9 శాతం క్లెయిమ్‌లను సెటిల్‌మెంట్ చేసినట్లు తెలిపింది. ఖాతాదారులు, వారి కుటుంబాలకు చేసిన వాగ్దానాలను నెరవేర్చడంలో సంస్థ నిబద్ధతకు ఇది నిదర్శనమని పేర్కొంది.

రూ.63వేల చేరువలో బంగారం ధర

న్యూఢిల్లీ : బంగారం ధర రూ.63వేల చేరువలో ఉంది. మంగళవారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల పసిడి ధర రూ.100 పెరిగి రూ.62,750కి చేరిందని హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ పేర్కొంది. కిలో వెండి ధర మాత్రం యథాతథంగా రూ.78,200గా నమోదయ్యింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఒక్క ఔన్స్ పసిడి ధర 4 డాలర్లు పెరిగి 2,014 డాలర్లుగా పలికింది. కాగా.. చెన్నయ్‌లో 10 గ్రాముల బంగారం ధర రూ.63,050కి చేరి ఆల్‌టైం రికార్డ్‌ను దాటాయి. అభరణాలకు ఉపయోగించే 22 క్యారట్ల బంగారం ధర రూ.57,800గా నమోదయ్యింది.

ఐఫోన్ కేసుల తయారీకి టాటా భారీ నియామకాలు

న్యూఢిల్లీ : ఐఫోన్ కేసుల తయారీ విస్తరణకు టాటా గ్రూపు వేలాది మంది ఉద్యోగుల నియామకాలకు కసరత్తు చేస్తుందని సమాచారం. హోసూర్‌లో తన ఐఫోన్ కేసింగ్ తయారీ ప్లాంట్ సామర్థ్యాన్ని రెట్టింపు చేసేందుకు కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం 500 ఎకరాల్లో 15,000 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ఉద్యోగుల సంఖ్యను 25,000 నుంచి 28,000 వరకూ పెంచడానికి టాటా ఎలక్ట్రానిక్స్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ యోచిస్తోంది. నూతనంగా సమీకరించిన ఐఫోన్ అసెంబ్లింగ్ ప్లాంట్ సామర్థ్యాన్ని వినియోగించుకుంటూ.. ఈ రంగంలో మరింత రాణించడానికి ప్రణాళికలు రూపొందిస్తుందని రిపోర్టులు వస్తున్నాయి.

తొలి యుపిఐ చెల్లింపునకు 4 గంటలు ఆగాల్సిందే..!

రూ.2వేల పైబడిన మొత్తాలకు నిబంధన

న్యూఢిల్లీ : డిజిటల్ చెల్లింపుల్లో సైబర్ మోసాలను అరికట్టడానికి కేంద్ర ప్రభుత్వం కొత్త ఆలోచన చేస్తోందని సమాచారం. ఇద్దరు వ్యక్తుల మధ్య తొలి ఆన్‌లైన్ లావాదేవీకి నాలుగు గంటల వ్యవధి తర్వాతనే చెల్లింపులు జరిగేలా కొత్త నిబంధన ప్రవేశపెట్టనుంది. రిటైల్ లావాదేవీల్లో ఇబ్బంది లేకుండా రూ.2,000 కంటే ఎక్కువ మొత్తం చెల్లింపులకు మాత్రమే కొత్త నిబంధనను వర్తింపు చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నట్లు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఓ కథనంలో తెలిపింది.

సైబర్ మోసాలను అరికట్టేందుకు ఇది దోహదం చేయనుంది. కొత్తగా యుపిఐ ఖాతా ప్రారంభించినప్పుడు మొదటి 24 గంటల్లో కేవలం రూ.5,000 చెల్లింపునకు మాత్రమే అవకాశం ఉన్న విషయం తెలిసిందే.

ఫారం-A
బహిరంగ ప్రకటన

(ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టీస్ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఇన్‌సాల్వెన్సీ రెజుల్యూషన్ ప్రాసెస్ ఫర్ కార్పొరేట్ పర్సన్స్) రెగ్యులేషన్స్, 2016లోని రెగ్యులేషన్ 6 క్రింద)
M/s.A G S మేనేజ్‌మెంట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క ఋణదాతల గమనిక కొరకు

సంబంధిత వివరములు

1.	కార్పొరేట్ డెటార్ పేరు	M/s.A G S మేనేజ్‌మెంట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్
2.	కార్పొరేట్ డెటార్ నమోదు తేది	15-11-2011
3.	సదరు కార్పొరేట్ డెటార్ నమోదైన / రిజిస్టర్ అయిన అథారిటీ	ఆర్ఓసి–హైదరాబాద్
4.	కార్పొరేట్ డెటార్ యొక్క కార్పొరేట్ గుర్తింపు సం. / లిమిటెడ్ లయబిలిటీ ఐడెంటిఫికేషన్ నం.	U45208TG2011PTC077420
5.	కార్పొరేట్ డెటార్ నమోదిత కార్యాలయం మరియు ప్రధాన కార్యాలయం (ఏదైనా ఉన్నచో) చిరునామా :	హెచ్.నెం.1-36-98, ప్లాట్ నెం.27, ఫేజ్-2, పైగా హౌస్, యస్‌పి రోడ్డు, హైదరాబాద్, సికింద్రాబాద్, తెలంగాణ, 500003, ఇండియా.
6.	కార్పొరేట్ డెటార్‌కు సంబంధించి ఇన్‌సాల్వెన్సీ ప్రారంభ తేది	23-11-2023 (NCLT నుండి ఆర్డర్ 28.11.2023 న స్వీకరించబడింది)
7.	ఇన్‌సాల్వెన్సీ రెజల్యూషన్ ప్రాసెస్ ముగింపుకు అంచనా తేది	26-05-2024
8.	ఇంటెరిమ్ రెజల్యూషన్ ప్రొఫెషనల్‌గా వ్యవహరిస్తున్న ఇన్‌సాల్వెన్సీ ప్రొఫెషనల్ పేరు మరియు రిజిస్ట్రేషన్ నెంబరు	శ్రీ నరేందర్ రెడ్డి బాణాల IBBI/IPA-003/IP-N00376/2021-22/13910 AFA Validity period from 02-02-2023 to 02-02-2024
9.	బోర్డ్‌తో నమోదు చేయబడిన విధంగా ఇంటెరిమ్ రెజల్యూషన్ ప్రొఫెషనల్ చిరునామా మరియు ఇ-మెయిల్	3-7-406/పియస్/204, 2వ ఫ్లోర్, ఫ్లాట్ నెం.204, పార్క్ స్టోన్ అపార్ట్‌మెంట్స్, సిరిమల్లె నగర్ కాలనీ, హైదర్‌గూడ, ఆదిత్య ఫార్మసీ, హైదరాబాద్, తెలంగాణ-500048. Email: Bnreddy.acs@gmail.com
10.	ఇంటెరిమ్ రెజల్యూషన్ ప్రొఫెషనల్‌తో సంప్రదింపుల కొరకు ఉపయోగించవలసిన చిరునామా మరియు ఇ-మెయిల్	3-7-406/పియస్/204, 2వ ఫ్లోర్, ఫ్లాట్ నెం.204, పార్క్ స్టోన్ అపార్ట్‌మెంట్స్, సిరిమల్లె నగర్ కాలనీ, హైదర్‌గూడ, ఆదిత్య ఫార్మసీ, హైదరాబాద్, తెలంగాణ-500048. Email: agsmanagement.ibc@gmail.com
11.	క్లెయిమ్స్ దాఖలుకు చివరి తేది	12-12-2023 (28-11-2023 నుండి 14 రోజులు అనగా IRP ద్వారా గౌరవనీయ NCLT, హైదరాబాద్ బెంచ్ యొక్క ఆదేశాన్ని స్వీకరించిన తేదీ)
12.	ఇంటెరిమ్ రెజల్యూషన్ ప్రొఫెషన్ ద్వారా నిర్ధారించబడి, సెక్షన్ 21లోని సబ్-సెక్షన్ (6A) యొక్క క్లాజ్ (b) క్రింద ఋణదాతలు, ఎవరైనా ఉంటే	పరిమిత సమాచారం ఆధారంగా, ప్రస్తుత తేదీనాటికి IBC యొక్క u/s 21(6A)(b) ప్రకారము ఋణదాతల తరగతి లేదు
13.	క్లాస్‌లో క్రెడిటార్స్ యొక్క అధికార ప్రతినిధులుగా వ్యవహరించుటకు గుర్తింపు పొందిన ఇన్‌సాల్వెన్సీ ప్రొఫెషనల్స్ పేర్లు (ప్రతి క్లాస్‌లో ముగ్గురు పేర్లు)	ప్రస్తుత తేదీనాటికి సమాచారం అందుబాటులో లేదు
14.	(a) రిలవెంట్ ఫార్మ్స్ మరియు (b) అధీకృత ప్రతినిధుల వివరాల లభ్యత :	వెబ్‌లింక్ : https://ibbi.gov.in/home/downloads భౌతిక చిరునామా : వర్తించదు

ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా M/s.A G S మేనేజ్‌మెంట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క కార్పొరేట్ దివాలా పరిష్కార ప్రక్రియను ప్రారంభించుటకు **23-11-2023** తేదీన నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ వారు ఉత్తర్వులు జారీచేసినారు. ఎంట్రీ నెం.10 పై తెలిపిన చిరునామా వద్ద ఇంటెరిమ్ రెజల్యూషన్ ప్రొఫెషనల్‌కు **12-12-2023**న లేదా ఆలోగా రుజువులతో తమ క్లెయిమ్స్ దాఖలు చేయవలసిందిగా M/s.A G S మేనేజ్‌మెంట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ క్రెడిటార్లు కోరబడుచున్నారు. ఆర్థిక ఋణదాతలు ఎలక్ట్రానిక్ విధానం ద్వారా మాత్రమే రుజువుతో తమ క్లెయిమ్‌లు దాఖలు చేయాలి. ఇతర ఋణదాతలు అందరూ స్వయంగా, తపాలా ద్వారా లేదా ఎలక్ట్రానిక్ విధానం ద్వారా రుజువుతో క్లెయిమ్‌లు దాఖలు చేయవచ్చును.
ఎంట్రీ నెం.12కు ఎదురుగా జాబితా చేయబడిన ఒక క్లాస్‌కి చెందిన ఒక ఫైనాన్షియల్ క్రెడిటార్, ఎంట్రీ నెం.13కు ఎదురుగా జాబితా చేయబడిన ముగ్గురు ఇన్‌సాల్వెన్సీ ప్రొఫెషనల్స్ నుండి అధీకృత ప్రతినిధి ఎంపికను సూచిస్తుంది. ఫారం CA క్లాస్ యొక్క అధీకృత ప్రతినిధిగా వ్యవహరించడానికి (తరగతి నిర్దిష్ట పరచండి) ప్రస్తుతము వర్తించదు.
తప్పుడు సమాచారం లేదా అసంబద్ధ సాక్ష్యములు దాఖలు చేసినచో జరిమానాలు విధించబడును.

తేది : 28-11-2023
ప్రదేశం : హైదరాబాద్

శ్రీ నరేందర్ రెడ్డి బాణాల
ఇంటెరిమ్ రెజల్యూషన్ ప్రొఫెషనల్
M/s.A G S మేనేజ్‌మెంట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్
Regn. No. IBBI/IPA-003/IP-N00376/2021-22/13910

సంపాదకీయం

కన్నీటి ప్రపంచం

తల్లిగా, సోదరిగా, జీవిత భాగస్వామిగా అడుగడుగునా అండగా.. తోడుగా.. నీడగా ఉండే మహిళ కన్నీరుపెడుతోంది. అక్కడ.. ఇక్కడ అని కాదు ప్రపంచమంతా ఇదే కథ.. ఇదే వ్యథ... ప్రతి ముగ్గురిలో ఒక మహిళ హింసకు గురవుతుండగా, ప్రతి 11 నిమిషాలకు ఒక స్త్రీ దారుణ హత్యకు గురవుతోందన్న ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) తాజా నివేదిక ఆవేదనగొల్పుతోంది. నేటి ఆధునిక పరిస్థితుల్లోనూ... ఆలోచనలు ఇంకా పాతాళంలోనే ఉన్నాయని ఐక్యరాజ్యసమితి, డబ్ల్యుహెచ్ఓ వెలువరించిన తాజా గణాంకాలు చాటిచెబుతున్నాయి. ప్రపంచవ్యాపితంగా 33 శాతం మంది అంటే 73.6 కోట్ల మంది మహిళలు శారీరక లేదా లైంగిక హింసకు గురవతున్నారు. గత దశాబ్ద కాలంగా కానీ, 2021కి, ఇప్పటికీ పోల్చిచూసినా గానీ ఈ గణాంకాల్లో పెద్దగా మార్పేమీ రాలేదు. నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం అని మహాకవి శ్రీశ్రీ అంటే... అందులోనూ మహిళలపై పీడన మరీ దారుణం. కార్పొరేట్, సామ్రాజ్యవాద శక్తులు ఓ వినియోగ వస్తువులా చూపించే విషసంస్కృతిని ప్రోత్సహించడం, పురుషాధిపత్య భావజాలం... ఈ దారుణాలకు కారణమవుతోంది. సన్నిహిత భాగస్వామి లేదా కుటుంబ సభ్యులు, పరిచయస్తుల నుంచే ఈ హింస అధికంగా ఉంటోంది. గత ఏడాదిలో 16 శాతం మంది 15-24 ఏళ్ల వయసున్న యువతులు భర్త, సన్నిహిత భాగస్వామి చేతిలో హింసకు గురయ్యారు. మరో ఆరు శాతం మంది ఇతరుల వల్ల లైంగిక వేధింపులకు గురవుతున్నారు. ఈ హింస వారి శరీరంపైనే కాకుండా మానసికంగానూ దీర్ఘకాలిక ప్రభావం చూపుతోంది. నిరాశ, ఆందోళన, మానసిక రుగ్మతలకుసైతం దారితీస్తోంది. ఈ హింసాకాండ ఆగ్నేయాసియాలో 21 శాతం ఉండగా, తూర్పు ఆసియాలో 20 శాతం, మధ్య ఆసియాలో 18 శాతం, యూరప్ దేశాల్లో 16 నుంచి 23 శాతం ఉంది. తక్కువ అభివృద్ధి చెందిన దేశాల్లోనూ, భారత్‌సహా దక్షిణాసియాలోనూ, సబ్‌సహారా, ఓషియానియా దేశాల్లోనూ 37 శాతం మంది హింసకు గురికావడం మరింత దిగ్భ్రాంతికరం.

మనదేశంలోనూ పరిస్థితి ఏమాత్రం ఆశాజనకంగా లేదు. జాతీయ నేరగణాంక సంస్థ (ఎన్‌సిఆర్‌బి) లెక్కల ప్రకారం 2021లో స్త్రీలపై అకృత్యాలకు సంబంధించి 4.28 లక్షల కేసులు నమోదయ్యాయి. అవి ముందుటేడాదితో పోలిస్తే 15 శాతం అదనం. వాటిలో గృహ హింసకు సంబంధించినవే 1.36 లక్షలు. 2001-18 మధ్య కాలంలో అత్యాచార నేరాలు 70 శాతానికి పైగా ఎగబాకాయి. మహిళలపై హింసాత్మక, ఇతర నేరాలకు సంబంధించి జిల్లా, దిగువ న్యాయస్థానాల్లో 36 లక్షలు, హైకోర్టుల్లో మూడు లక్షలకుపైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. లైంగిక నేరాల నుంచి చిన్న పిల్లల పరిరక్షణ చట్టం (పోక్సో) కేసులు 2016-20 మధ్య కాలంలో 30 శాతానికిపైగా పెరిగాయి. ఇల్లు, పనిచేసే చోటు, ఇంటర్నెట్.. ఇలా అన్ని చోట్లా మహిళలు వేధింపులకు గురవుతూనే ఉన్నారు. స్త్రీల భద్రతకు సంబంధించి 2021-22లో చేపట్టిన అంతర్జాతీయ అధ్యయనంలో మొత్తం 177 దేశాల్లో 148వ స్థానంలో మనదేశం ఉంది. మహిళలపై పెరిగిపోతున్న నేరాలను నియంత్రించలేని ఉత్తర ప్రదేశ్ సర్కారు సాయంత్రం పూట ప్రైవేటు కోచింగ్ సెంటర్లకు వెళ్లవద్దంటూ తాజాగా ఆదేశాలు జారీ చేయడం మరో విడ్డూరం. మనదేశంలో మణిపూర్‌లోనైనా, గాజాపై ఇజ్రాయిల్ దాష్టీకంలోనైనా అత్యధికంగా బలవుతున్నది మహిళలే. మద్యం, మాదక ద్రవ్యాలు, అశ్లీల చిత్రాల ప్రభావంతోనే ఎక్కువమంది దారుణాలకు పాల్పడుతున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. మోడీ, అమిత్‌షాల సొంత రాష్ట్రం గుజరాత్‌లోనే గత ఐదేళ్లలో 41 వేల మంది మహిళలు అదృశ్యం కావడం దేశంలో పరిస్థితిని తేటతెల్లం చేస్తోంది.

మహిళలపై హింసకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల ఇటలీ రాజధాని రోమ్‌లో ఐదు లక్షల మంది అతి పెద్ద ర్యాలీ నిర్వహించారు. పారిస్ ర్యాలీలో 'మీ అమ్మాయిని రక్షించండి, మీ అబ్బాయిని ఎడ్యుకేట్ చేయండి' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు.

ఈ దుస్థితి పోవాలంటే గర్భస్థ శిశువు మొదలు వృద్ధాప్యంలోనూ కొనసాగుతున్న లింగవివక్ష అంతం కావాలి. అందుకు అన్ని స్థాయిల్లోనూ కృషి జరగాలి. అది కుటుంబంలో, సమాజంలోని అన్ని విభాగాల్లో ముఖ్యంగా పాలకుల విధానాలు, పాలనా వ్యవహారాల్లో మార్పు రావాలి. అందుకు అవసరమైన ఐక్య ఉద్యమాలు సాగాలి.

మహనీయుల మాట



స్త్రీ పురుషుడిపై ఆధార పడాల్సి వస్తోంది. తల్లిదండ్రులు పిల్లలపై ఆధార పడాల్సి వస్తోంది. ఈ పరాధీనతకు మూలం సొంత ఆస్తే. కమ్యూనిస్టు సమాజం సొంత ఆస్తిని రద్దు చేస్తుంది.

- కారల్ మార్క్స్, ఏంగెల్స్,
కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక .

తిరోగమనంలో ఆంధ్రప్రదేశ్ విద్యారంగం

విశ్లేషణ

కె.యస్.లక్ష్మణరావు

భారత రాజ్యాంగంలోని 45వ నిబంధన '14 సంవత్సరాలలోపు పిల్లలందరికి ఉచిత, నిర్బంధ విద్య కల్పించాలని స్పష్టంగా పేర్కొన్నది. 86వ రాజ్యాంగ సవరణ ద్వారా 21-ఎ నిబంధనలో ప్రాథమిక విద్యను ప్రాథమిక హక్కుగా మార్చి, జాతీయ విద్యా హక్కు చట్టాన్ని రూపొందించింది. కాని 1991 ఆర్థిక సంస్కరణల తర్వాత గత మూడు దశాబ్దాలుగా విద్యారంగంలో కూడా ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ చోటు చేసుకున్నాయి. విద్యారంగంలో రెండు సమాంతర వ్యవస్థలు కొనసాగుతున్నాయి. ఒకవైపు ప్రభుత్వ విద్యారంగం, రెండోవైపు ప్రైవేట్ విద్యారంగం కొనసాగటం విద్యారంగ అసమానతలకు దారితీసినది. 1997 నుంచి ప్రపంచ బ్యాంకు ప్రయోగాలకు ఆంధ్రప్రదేశ్ ప్రయోగశాలగా నిలిచింది. అప్పటి నుంచి విద్యారంగంలో కూడా ప్రపంచ బ్యాంకు ప్రభావం కొనసాగుతూనే ఉన్నది. ఆంధ్రప్రదేశ్‌లో 74 లక్షల మంది పిల్లలు పాఠశాలల్లో చదువుతుంటే సుమారు 40 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల్లో, 34 లక్షల మంది ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్నారు.

ప్రస్తుత ప్రభుత్వం-ఉపాధ్యాయులపై దాడి

2019 మే లో ఏర్పడిన వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం పాఠశాలలో మౌలిక వసతులు కల్పించామని, అదే విద్యారంగ అభివృద్ధి అని ఊదరగొడుతున్నది. కాని ఆచరణలో ప్రభుత్వ విద్యారంగం, ప్రభుత్వ పాఠశాలలు నష్టపోయే చర్యలు చేపడుతున్నది. ఇంతకు ముందు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేసిన బి.రాజశేఖర్, కమిషనర్‌గా పనిచేసిన వాడ్రేవు చినవీరభద్రుడు, ఇప్పుడు ముఖ్య కార్యదర్శిగా చేస్తున్న ప్రవీణ్ ప్రకాష్ వంటి అధికారులను ఉసికొల్పటం ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయులు పనిచేయటం లేదనే వాతావరణాన్ని సృష్టించి, ప్రభుత్వ పాఠశాలలను దెబ్బ తీసే మార్గాన్ని ఎంచుకున్నది. ఐ.ఏ.యస్ ప్రవీణ్ ప్రకాష్ గత 8 నెలలుగా తనిఖీల పేరుతో ఉపాధ్యాయులపై, విద్యాశాఖ అధికారులపై దాడి చేస్తున్నారు. అనేక వందల మందికి మెమోలు, చార్జ్ మెమోలు ఇస్తున్నారు. పదుల సంఖ్యలో సస్పెన్షన్లు చేశారు. ఆయన వైఖరితో ఉపాధ్యాయులే కాదు,

విద్యాశాఖలో ఉన్నత స్థాయి అధికారులు కూడా సంతృప్తిగా లేరు. ప్రవీణ్ ప్రకాష్‌ను వెంటనే విద్యాశాఖ నుంచి బదిలీ చేయాలని డిమాండ్ చేస్తున్నాము.

జీ.వో నెం-17 : తరగతుల తరలింపు

పాఠశాల విద్యాశాఖ జీ.వో నెం.117 ద్వారా ఉపాధ్యాయుల రేషనలైజేషన్ చేపట్టింది. రేషనలైజేషన్ ద్వారా ఉపాధ్యాయ పోస్టులు తగ్గించటంతో పోస్టులు అదనంగా ఉన్నట్లు తేల్చారు. ఈ జీవో ద్వారా కూడా పనిభారాన్ని విపరీతంగా పెంచారు. స్కూళ్లలో ఇంగ్లీష్ మీడియం ఒక్కటే కొనసాగించి, తెలుగు మీడియంను ఎత్తివేయటంతో కొన్ని పోస్టులు రద్దయినాయి. అనేక చోట్ల ఉపాధ్యాయులు లేక పాఠశాలలు విశ్వసనీయత కోల్పోతున్నాయి. ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి జీవో నెం.117 రద్దు చేయవలసిన అవసరముంది. ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ ఏ మాత్రం హేతుబద్ధతలేని అసమంజసమైన నిర్ణయం చేసింది. 3 కిలోమీటర్ల లోపు ప్రాథమిక పాఠశాలలోని 3,4,5 తరగతులను హైస్కూల్‌కు తరలించాలనే నిర్ణయం ప్రాథమిక పాఠశాలల మనుగడను దెబ్బతీసింది. ఒక కిలోమీటరు లోపు ఉన్న ప్రాథమిక పాఠశాలల్లోని 3,4,5 తరగతులను తరలించారు. ఉపాధ్యాయ సంఘాల ఉద్యమ ఫలితంగా అనేక పాఠశాలలను నిలుపుదల చేయించాము. ఈ నిర్ణయంతో రాష్ట్రంలో 12 వేలకుపైగా ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారాయి. తరగతుల తరలింపుకు వ్యతిరేకంగా పి.డి.ఎఫ్ ఎమ్మెల్సీలు చేసిన బస్సు యాత్రలో వేలాదిమంది తల్లిదండ్రులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. 3,4,5 తరగతుల తరలింపు జాతీయ విద్యా హక్కు చట్టానికి పూర్తి విరుద్ధం. 3,4,5 తరగతుల విద్యార్థులకు సెకండరీగ్రేడ్ ఉపాధ్యాయులు మాత్రమే బోధించాలని నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ స్పష్టంగా పేర్కొన్నది.

భర్తీ కాని ఉపాధ్యాయ పోస్టులు

దేశవ్యాప్తంగా 10 లక్షల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని 'నీతి ఆయోగ్' పేర్కొన్నది. మన రాష్ట్రంలో వై.యస్.జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్క డి.ఎస్.సి నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు. రాష్ట్రంలో సుమారుగా 30 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండగా 8,366 పోస్టులు మాత్రమే ఖాళీగా ఉన్నాయని మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటించారు. జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలతో పాటు మున్సిపల్ పాఠశాలలు, మోడల్ స్కూళ్లు, గురుకులాలలో ఖాళీగా ఉన్న పోస్టులన్నిటిని భర్తీ చేయాలి. ఉపాధ్యాయ పోస్టుల భర్తీ నోటిఫికేషన్ కోసం బి.ఇడి, డి.ఇడి పూర్తి చేసిన అభ్యర్థులంతా ఆశగా ఎదురు చూస్తున్నారు.

టెక్నాలజీ ప్రత్యామ్నాయం కాదు

ఉపాధ్యాయుడికి టెక్నాలజీ ప్రత్యామ్నాయం కాదని ఇటీవల 'యునెస్కో' విడుదల చేసిన నివేదిక స్పష్టంగా పేర్కొన్నది. కరోనా తర్వాత స్మార్ట్‌ఫోన్‌లు, ట్యాబ్‌ల వాడకం పెరిగింది. కాని విద్యార్థికి సామాజిక విలువలు, క్రమశిక్షణ, సామాజికీకరణ టెక్నాలజీ ద్వారా సాధ్యం కాదన్నది అందరూ అంగీకరిస్తున్న విషయం. కాని రాష్ట్ర ప్రభుత్వం బైజూస్ కంటెంట్, ట్యాబ్‌లు, టీవీలు మొదలగు వాటిని ఉపాధ్యాయుడికి ప్రత్యామ్నాయంగా తీసుకురావాలని భావిస్తున్నది. ప్రపంచ బ్యాంకుతో కుదుర్చుకున్న 'సాల్ట్' ఒప్పందం దీనికి ఒక ప్రధాన కారణం. 'సాల్ట్' ఒప్పందం టెక్నాలజీ పాత్ర పెంచి, మానవ వనరుల పాత్ర తగ్గించాలని చెప్పింది. దీనిలో భాగంగానే ఉపాధ్యాయుల సంఖ్య తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది. ఉపాధ్యాయుడికి టెక్నాలజీ సహాయకారిగా ఉంటుందిగాని, ప్రత్యామ్నాయం కాదని విద్యారంగ నిపుణులు, సామాజికవేత్తలు భావిస్తున్నారు.

ఉపాధ్యాయులు ఏం చేయాలి?

ప్రవీణ్ ప్రకాష్ లాంటి వారిని చూసి కొంతమంది బెంబేలెత్తుతున్నారు. టెన్షన్ పడుతున్నారు. ఎందుకు ఈ టెన్షన్? అలాంటి వారు సంవత్సరమో రెండు సంవత్సరాలో ఉంటారు. కాని విద్యావ్యవస్థ పని చేసేది ఉపాధ్యాయులతో మాత్రమే. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు మాత్రమే విద్యా వ్యవస్థలో శాశ్వతం. ఈ మొత్తం ప్రక్రియ ప్రైవేటీకరణలో భాగంగా జరుగుతున్న పెద్ద నాటకం. ప్రైవేటీకరణ ఇంకా జరగాలని, ప్రభుత్వాలు కోరుకుంటున్నాయి. దానికి ప్రభుత్వ విద్యా వ్యవస్థ సక్రమంగా పని చేయటం లేదనే బురదను ప్రవీణ్ ప్రకాష్ లాంటి వారి ద్వారా వేయిస్తున్నది.

దీనికి ఒక్కటే మార్గం. మనం ప్రజల మద్దతు పొందాలి. చరిత్ర నిర్మాతలు ప్రజలే. మనం పని చేసే గ్రామాన్ని ప్రేమించాలి, గ్రామ ప్రజలను ప్రేమించాలి, పాఠశాలను ప్రేమించాలి, తల్లిదండ్రులను ప్రేమించాలి, మన దగ్గర చదివే బిడ్డలను ప్రేమించాలి. వారందరి అభిమానం పొందాలి. అవసరమైతే పాఠశాలలో ఒక గంట అదనంగా గడపాలి. విద్యను సృజనాత్మకంగా బోధించాలి. పిల్లలతో మమేకం కావాలి. ఇలా చేసినప్పుడు మాత్రమే ప్రభుత్వ విధానాలు, ప్రైవేటీకరణ విధానాలను, ప్రవీణ్ ప్రకాష్ వంటి వారి చర్యలను ఓడించగలుగుతాం. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలనే నినాదాన్ని ఆచరణలో చూపిద్దాం.

(వ్యాసకర్త శాసనమండలి సభ్యులు, సెల్ : 8309965083)

> **ఉపాధ్యాయుడికి టెక్నాలజీ ప్రత్యామ్నాయం కాదని ఇటీవల 'యునెస్కో' విడుదల చేసిన నివేదిక స్పష్టంగా పేర్కొన్నది. కరోనా తర్వాత స్మార్ట్‌ఫోన్‌లు, ట్యాబ్‌ల వాడకం పెరిగింది. కాని విద్యార్థికి సామాజిక విలువలు, క్రమశిక్షణ, సామాజికీకరణ టెక్నాలజీ ద్వారా సాధ్యం కాదన్నది అందరూ అంగీకరిస్తున్న విషయం. కాని రాష్ట్ర ప్రభుత్వం బైజూస్ కంటెంట్, ట్యాబ్‌లు, టీవీలు మొదలగు వాటిని ఉపాధ్యాయుడికి ప్రత్యామ్నాయంగా తీసుకురావాలని భావిస్తున్నది. ప్రపంచ బ్యాంకుతో కుదుర్చుకున్న 'సాల్ట్' ఒప్పందం దీనికి ఒక ప్రధాన కారణం.**

> **పాఠశాల విద్యాశాఖ జీ.వో.నెం.117 ద్వారా ఉపాధ్యాయుల రేషనలైజేషన్ చేపట్టింది. రేషనలైజేషన్ ద్వారా ఉపాధ్యాయ పోస్టులు తగ్గించటంతో పోస్టులు అదనంగా ఉన్నట్లు తేల్చారు. ఈ జీవో ద్వారా కూడా పనిభారాన్ని విపరీతంగా పెంచారు. స్కూళ్లలో ఇంగ్లీష్ మీడియం ఒక్కటే కొనసాగించి, తెలుగు మీడియం ఎత్తి వేయటంతో కొన్ని పోస్టులు రద్దయినాయి. అనేక చోట్ల ఉపాధ్యాయులు లేక పాఠశాలలు విశ్వసనీయత కోల్పోతున్నాయి. ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి జీవో నెం.117 రద్దు చేయవలసిన అవసరముంది.**

జనవాక్యం

వార్ధక్యంలో...

ఈ డిజిటల్ సమాజంలోని వ్యక్తులు ముసలితనంలోకి జారుకుంటున్నామని తెలిసి కూడా వృద్ధాప్యాన్ని జయిస్తూ ఆనందమయ జీవితాలను గడపడానికి సిద్ధపడడం లేదు. పిల్లలు రెక్కలొచ్చిన పక్షుల వలె ఉద్యోగ ఉపాధుల వేటలో ఇంటికి, ఊరుకు దూరమై పోతున్నారు. వృద్ధ తల్లిదండ్రులు తాము అనాథలం అయ్యామని మదనపడుతున్నారు. కొందరు వృద్ధులు అనాథాశ్రమాల దారి పట్టడం కూడా చూస్తున్నాం. కన్న పిల్లలు నిరంతరం నీడలా ఉంటూ మన యోగక్షేమాలను చూస్తారని ఆశించడం నేడున్న పరిస్థితుల్లో సరికాదేమో. తల్లిదండ్రులుగా పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పి, వారికి మంచి భవిష్యత్తును ఇవ్వడం వరకే మన బాధ్యత అనుకోవాలి. తల్లిదండ్రులను చక్కగా చూసుకునే సంతానం దగ్గరగా ఉంటే మంచిదే. అయితే వారు మనల్ని పెద్దగా పట్టించుకోకపోయినా మన బతుకుల్ని మనమే స్వతంత్రంగా జీవించడానికి మానసికంగా సిద్ధంగా ఉండాలి. పిల్లలపై భారీ ఆశలు పెట్టుకుంటే నిరాశే ఎదురవుతుంది. మనల్ని అనుక్షణం చూడడానికి వారికీ సమయం ఉండదు. వారికి కూడా కుటుంబ బాధ్యతలు వచ్చి పడతాయని మరువరాదు.

- మధుపాలీ

పరుష వ్యాఖ్యలేల...

సమాజంలో మంచి గుర్తింపు, ఓ స్టేటస్ పొందిన రాజకీయ నాయకులు, సినీనటులు, క్రీడాకారులు, వ్యాపారవేత్తలు మహిళలతో గౌరవంగా, మర్యాదగా మెలుగుతూ ఆదర్శప్రాయంగా నిలవాలి. కానీ చాలా సందర్భాలలో కొంతమంది రాజకీయ నాయకులు మొదలుకొని అన్ని రంగాలకు చెందిన కొంతమంది ప్రముఖుల వరకు ఇలా ఏదోక సందర్భంలో మహిళలను చులకనగా, పలుచనగా మాట్లాడుతూ తమ అనైతిక, కుసంస్కారాన్ని బయట పెడుతుండటం సిగ్గు చేటు. ఏమైనా ప్రస్తుతం సమాజంలో వున్న అనారోగ్యకర పరిస్థితుల్లో ప్రతి తల్లిదండ్రుల లక్ష్యం, ఎజెండా, ఆశయం ఒక్కటే కావాలి. ఆడపిల్లలను గౌరవించేలా అబ్బాయిలను పెంచడం. టీనేజీ అబ్బాయిలకు సరయిన కౌన్సిలింగ్ ఇవ్వడం అత్యంత అవశ్యకం. ఎందుకంటే ప్రస్తుత చట్టాలు ఎంత బలంగా వున్నా తెలిసో, తెలియకో, అహంకారంతోనో మహిళలపై పరుష వ్యాఖ్యలు, అసభ్య చేష్టలు నేరుగా గాని, సోషల్ మీడియాలో గాని చేస్తే దాని ప్రభావం వారిపై అత్యంత తీవ్రంగా ఉంటుందని, అది వారి బంగారు భవిష్యత్‌ను ప్రమాదంలో నెట్టివేస్తుందనే జ్ఞానాన్ని, వివేకాన్ని ప్రతి ఒక్క అబ్బాయిలో కలిగించాలి!

- బుగ్గన మధుసూదనరెడ్డి,
బేతంచెర్ల,
నంద్యాల జిల్లా.

మీ వ్యాసాలు 5000 క్యారెక్టర్లు లేదా 700 పదాలు వుండాలి.
పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

ఎలక్ట్రిక్ కార్లు - వాణిజ్య యుద్ధం !

అంతర్జాతీయం

ఎం. కోటేశ్వరరావు

ప్రపంచంలో ఎలక్ట్రానిక్ కార్ల వాణిజ్య యుద్ధానికి తెర లేచే సూచనలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే చైనా ఒక వైపు, ఐరోపా సమాఖ్య-అమెరికా మరోవైపు మోహరిస్తున్నాయి. అమెరికా కంపెనీ టెస్లా కార్ల దిగుమతికి మన కేంద్ర ప్రభుత్వంతో ఒక ఒప్పందం కుదిరిందని, వచ్చే ఏడాది నుంచి ఓడల్లో కార్లు దిగనున్నాయని వార్తలు. అధికారికంగా జనవరిలో ప్రకటించవచ్చు. రానున్న రెండు సంవత్సరాల్లో కార్ల తయారీ (విడి భాగాలను తీసుకువచ్చి ఇక్కడ అమర్చటం) కూడా ప్రారంభించే అవకాశం ఉందనీ చెబుతున్నారు. ప్రపంచంలో అత్యధిక కార్లను అమ్ముతున్న చైనా బివైడి కంపెనీతో కలసి కార్ల తయారీని ప్రారంభిస్తామన్న మెఘా ఇంజనీరింగ్ ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం తిరస్కరించింది. టెస్లా రెండు వందల కోట్ల డాలర్ల మేర కార్ల తయారీ కేంద్రానికి పెట్టుబడి పెడుతుందని మన దేశం నుంచి 1,500 కోట్ల డాలర్ల విలువగల విడి భాగాలను కొనుగోలు చేస్తుందని చెబుతున్నారు. కేంద్ర వాణిజ్య మంత్రి పియూష్ గోయల్ సెప్టెంబరు నెలలో కాలిఫోర్నియా లోని టెస్లా కంపెనీని సందర్శించి వచ్చిన సంగతి తెలిసినదే. వంద కోట్ల డాలర్ల పెట్టుబడితో హైదరాబాద్‌లో ఏటా పది నుంచి పదిహేను వేల కార్ల తయారీ, చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు చేస్తామని చైనా బివైడి-మెఘా చేసిన ప్రతిపాదనను కేంద్రం పక్కన పెట్టింది. ప్రస్తుతం ఉన్న నిబంధనలు చైనా నుంచి వచ్చే పెట్టుబడులను అనుమతించే అవకాశం లేదని కారణం చెప్పింది. మెఘా కంపెనీ పెట్టుబడి పెడితే సాంకేతిక పరిజ్ఞానం చైనా కంపెనీ అందజేస్తుందని చెప్పినప్పటికీ అంగీకరించ లేదు. దీనికి కారణం అమెరికన్ కంపెనీ టెస్లాను అనుమతించేందుకు సుముఖంగా ఉండటమే అని చెప్పవచ్చు. మనం ఎలాగూ తయారు చేయలేనపుడు రెండు విదేశీ కంపెనీలు పోటీ పడి ధరలను తగ్గిస్తే మన వినియోగదారులకు లాభం, కొన్ని విడి భాగాలు ఇక్కడే తయారీ ద్వారా కొంత మేరకు ఉపాధి కల్పించే అవకాశం ఉన్నప్పటికీ టెస్లా వైపే మొగ్గు చూపటం ఏమిటన్న ప్రశ్న ముందుకు వస్తున్నది. చైనాలో స్వంతంగా తయారు చేసే కంపెనీలు ఉన్నప్పటికీ టెస్లాను కూడా అనుమతించిన కారణంగా పోటీ పడి అది కూడా తక్కువ ధరలకే అక్కడ కార్లు అమ్ముతున్నది. మెఘా ఇంజనీరింగ్ కంపెనీ ఇప్పటికే చైనా కంపెనీతో కలసి ఎలక్ట్రిక్ బస్సులను తయారు చేస్తున్న సంగతి తెలిసిందే. దానికి లేని అడ్డంకి కార్లకు వచ్చిందంటే 2020లో జరిగిన సరిహద్దు ఘర్షణలు, చైనా వ్యతిరేక కూటమిలో మన దేశం మరింతగా భాగస్వామి కావటమే అని చెప్పవచ్చు.

> **వంద కోట్ల డాలర్ల పెట్టుబడితో హైదరాబాద్‌లో ఏటా పది నుంచి పదిహేను వేల కార్ల తయారీ, చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు చేస్తామని చైనా బివైడి-మెఘా చేసిన ప్రతిపాదనను కేంద్రం పక్కన పెట్టింది. ప్రస్తుతం ఉన్న నిబంధనలు చైనా నుంచి వచ్చే పెట్టుబడులను అనుమతించే అవకాశం లేదని కారణం చెప్పింది. మెఘా కంపెనీ పెట్టుబడి పెడితే సాంకేతిక పరిజ్ఞానం చైనా కంపెనీ అందజేస్తుందని చెప్పినప్పటికీ అంగీకరించలేదు. దీనికి కారణం అమెరికన్ కంపెనీ టెస్లాను అనుమతించేందుకు సుముఖంగా ఉండటమే అని చెప్పవచ్చు. మనం ఎలాగూ తయారు చేయలేనపుడు రెండు విదేశీ కంపెనీలు పోటీ పడి ధరలను తగ్గిస్తే మన వినియోగదారులకు లాభం, కొన్ని విడి భాగాలు ఇక్కడే తయారీ ద్వారా కొంత మేరకు ఉపాధి కల్పించే అవకాశం ఉన్నప్పటికీ టెస్లా వైపే మొగ్గు చూపటం ఏమిటన్న ప్రశ్న ముందుకు వస్తున్నది.**

ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తిలో చైనా జోరు ప్రపంచ మార్కెట్లను దిగ్భ్రాంతికి గురిచేస్తున్నది. సాంప్రదాయ కార్ల నుంచి ఎలక్ట్రానిక్ వాహనాలకు మారితే ప్రస్తుతం తమ సంఘం లోని లక్షా యాభై వేల మంది కార్మికుల్లో 35 వేల మందికి ఉపాధి పోతుందని 'అమెరికా యునైటెడ్ ఆటో వర్కర్స్ యూనియన్' తెలిపింది. తమ దేశంలో 2032 నాటికి మూడింట రెండు వంతులు ఎలక్ట్రానిక్ కార్ల విక్రయమే ఉంటుందని అమెరికా ప్రకటించగా, 2035 నుంచి కేవలం ఎలక్ట్రిక్ కార్లనే అమ్ముతామని ఐరోపా సమాఖ్య పేర్కొన్నది. ఈ లక్ష్యాలను సాధించటానికి చైనా నుంచి వాహనాల దిగుమతులను అనుమతించాలా వద్దా అని ఆ దేశాలు మల్లగుల్లాలు పడుతున్నాయి.

ఐరోపా సమాఖ్య (ఇ.యు) 2022లో చైనా నుంచి దిగుమతి చేసుకున్న కార్లు సమాఖ్య మొత్తం ఎలక్ట్రిక్ కార్ల అమ్మకాల్లో మూడు శాతమే. అవి 2030 నాటికి 20 శాతానికి చేరతాయని స్థానిక కార్ల కంపెనీలు ఆందోళన చెందుతున్నాయి. చైనా పెద్ద మొత్తంలో సబ్సిడీలు ఇచ్చిన కారణంగా తక్కువ ధరలకు విక్రయిస్తున్నట్లు ఆరోపిస్తూ వాటి మీద విచారణ జరపాలని ఇ.యు నిర్ణయించింది. దిగుమతి సుంకాల మీద ఒక నిర్ణయం తీసుకొనేందుకు పూనుకుంది. ఇ.యు నిర్ణయం రక్షణాత్మక చర్యలు తప్ప మరొకటి కాదని వెంటనే చైనా స్పందించింది. అక్కడ ఇస్తున్న సబ్సిడీల సంగతేమిటని ప్రశ్నించింది. ఏ హోదాతో తమపై విచారణ జరుపుతుందని నిలదీసింది. చైనా నుంచి వస్తున్న దిగుమతులతో స్థానికంగా ఉన్న కార్ల గిరాకీ 20 శాతం తగ్గుతుందని అంచనా. చైనా కస్టమ్స్ సమాచారం ప్రకారం వర్తమాన సంవత్సరం ఏడు నెలల్లో గతేడాది కంటే 113 శాతం పెరగ్గా, 2020తో పోల్చితే 3,205 శాతం ఎక్కువ. చైనా ఇస్తున్న సబ్సిడీలు ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు వ్యతిరేకంగా ఉంటే పోరాడాల్సిందేనని జర్మనీ మంత్రితో భేటీ అయిన ఫ్రెంచి ఆర్థిక మంత్రి బ్రూనో లీ మెయరే చెప్పాడు. అయితే కొందరు ఐరోపా వాణిజ్యవేత్తలు దర్యాప్తును వ్యతిరేకిస్తున్నారు. దీంతో చైనా కూడా ఎదురు దాడికి దిగితే తమ ప్రయోజనాలు దెబ్బతింటాయని ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు అనేక దేశాలు చైనా నుంచి చౌకగా వచ్చే కార్లను దిగుమతి చేసుకోవాలని ఉన్నా స్థానిక కార్మికులకు పని లేకుండా పోతుందనే భయం మరోవైపు ఉంది.

అమెరికాలో పికప్ ట్రక్కుల మీద 25 శాతం తప్ప సాధారణ పన్ను 2.5 శాతమే, అయితే చైనాతో వాణిజ్య పోరు ప్రారంభించిన డోనాల్డ్ ట్రంప్ చైనా కార్ల మీద 25 శాతం విధించగా దాన్ని జోబైడెన్ కొనసాగిస్తున్నాడు. జపాన్‌లో అసలు పన్ను లేదు, పది శాతం వసూలు చేస్తున్న ఇయు చైనా కార్ల మీద పన్ను పెంచాలని చూస్తున్నది. చైనా కంపెనీలు తక్కువ ధరలకు కార్లను ఎందుకు విక్రయించగలుగుతున్నాయన్నది ప్రశ్న. ఎలక్ట్రిక్ కార్లలో కీలకమైనవి. లిథియం-అయాన్ బ్యాటరీలు. వీటి పరిశోధన-అభివృద్ధికి చైనా ప్రభుత్వం పెద్ద మొత్తంలో ఖర్చు పెట్టింది. ఆ రంగంలో ఉన్నవారికి రాయితీలిచ్చింది. దానికి తోడు వాటి తయారీకి అవసరమైన ముడిపదార్థాలు చైనాలో పుష్కలంగా ఉండటం అక్కడి కంపెనీలకు కలసివచ్చింది. దీంతో స్థానిక వినియోగదారులు ఆకర్షితులౌతున్నారు. ప్రపంచంలో వంద కార్లు అమ్మితే గతేడాది చైనాలోనే 59 అమ్మారు. ఈ ఊపుతో ప్రపంచ మార్కెట్లకు విస్తరించాలని అక్కడి కంపెనీలు చూస్తున్నాయి.

ప్రస్తుత తీరుతెన్నులను చూస్తే చైనా-ఇతర దేశాల మధ్య కార్ల ధరల యుద్ధం జరిగే సూచన కనిపిస్తున్నది. అమెరికా కంపెనీ టెస్లా దీనికి నాంది పలికింది. దీంతో చైనాలోని కొన్ని రకాల కార్ల ఉత్పత్తిని ఆపివేయాల్సి వచ్చింది. ఈ ఏడాది తొలి ఏడు నెలల్లో దేశీయ మార్కెట్లో 114 లక్షల కార్లను విక్రయించగా 20 లక్షలు ఎగుమతి చేసింది. విదేశీ ఎగుమతులు 80 శాతం పెరగ్గా, స్వదేశీ మార్కెట్ 1.7 శాతమే పెరిగినందున ధరల పోటీకి దిగితే చైనా కూడా నష్టపోవచ్చని కొందరు చెబుతున్నారు. గతేడాది డిసెంబరు నాటికి చైనాలో 4.3 కోట్ల కార్ల ఉత్పత్తి సామర్థ్యం ఉందని, ఉన్న సామర్థ్యంలో 2017లో 66.6 శాతం వినియోగిస్తే గతేడాది 54.5 శాతంగా ఉందని రాయిటర్స్ పేర్కొన్నది. అక్కడ ఆటో పరిశ్రమ మీద ప్రత్యక్షంగా పరోక్షంగా మూడు కోట్ల మంది ఆధారపడి ఉన్నారు. జపాన్ కార్ల పరిశ్రమకు సైతం చైనా సెగ తగులుతోంది. టయోటా తదితర కంపెనీలు తమ డిమాండ్ పడిపోకుండా చూసుకుంటున్నాయి. చైనాలో హైబ్రిడ్ కార్లకు మార్కెట్ ఎక్కువగా ఉంది. నిజంగా కార్ల ధర యుద్ధమే తీవ్రమైతే చైనాకు తక్షణమే ఇబ్బంది ఉండదు. ఇప్పటికే సామర్థ్యాన్ని సమకూర్చుకున్నందున పూర్తి స్థాయిలో ఉత్పత్తి వెంటనే జరపవచ్చు. అదే మిగతా దేశాల్లో సామర్థ్యాన్ని పెంచుకొనేందుకు భారీగా పెట్టుబడులను కూడా పెట్టాల్సి వస్తుంది.

మన దేశంలో ఎలక్ట్రానిక్ కార్ల తయారీకి పూనుకుంటే ముడి పదార్థాలు, బ్యాటరీల కోసం చైనా మీద ఆధారపడటం పెరుగుతుందని 'గ్లోబల్ ట్రేడ్ రిసెర్చ్ ఇనీషియేటివ్' (గ్రిటి) ఈ ఏడాది మార్చి నెలలో తన నివేదికలో పేర్కొన్నది. భారత్‌లో తయారయ్యే వాహనాలకు అవసరమైన వాటిలో 70 శాతం వస్తువులను చైనా, ఇతర దేశాల నుంచి సమకూర్చుకోవాల్సి ఉంటుంది. తమ కాలుష్య కారక పరిశ్రమలను రక్షించుకొనేందుకు, ప్రపంచ వాణిజ్యాన్ని చిన్నాభిన్నం చేసేందుకు ఎలక్ట్రిక్ వాహనాల వైపు మళ్లాలని ఐరోపా దేశాల చెబుతున్నాయి తప్ప ప్రపంచమంతా అలా లేదు. ఎలక్ట్రిక్ స్కూటర్లకు చార్జర్లకు ఒక ప్రమాణం లేదు. అందువలన ప్రతి సంస్థ తనదైన నమూనాను ఇస్తున్నది. దేశమంతటా ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుంటున్నదని గ్రిటి పేర్కొన్నది.

★

సొరంగం కూలడానికి బాధ్యులెవరు?

డెహ్రాడూన్: నిర్మాణంలో ఉన్న సొరంగం కూలిపోవడానికి బాధ్యులెవరో గుర్తించి, శిక్షించాలని గబ్బర్ సింగ్ నేగి సోదరుడు మహరాజ్ సింగ్ న్యూస్ ఛానెల్‌కిచ్చిన ఇంటర్వ్యూలో డిమాండ్ చేశారు. తన సోదరుడితోపాటు 41 మంది కార్మికుల ప్రాణాలను ప్రమాదంలో పడేసిన సంస్థను శిక్షించాలని ఆతను కోరాడు. సహాయక బృందాల కృషి ఫలితంగా 17 రోజుల తరువాత సొరంగం నుంచి కార్మికులు బయటకు రావడంపై సంబరాలు చేసుకుంటుండడం గురించి మీడియాలోని ఒక సెక్షన్ మంగళవారం రాత్రి ఆదే పనిగా ఊదరగొట్టడం ద్వారా ఒక తీవ్రమైన తప్పిదాన్ని కప్పిపుచ్చడానికి ప్రయత్నించింది. హిమాలయాల నడిబొడ్డున విపత్తుకు కారణమైన 'చార్ధామ్ ప్రాజెక్ట్' ఆగిపోతుందా అన్న ప్రశ్నకు సమాధానం లేదు. 'మోడీ హై తో ముమ్కిన్ హై' నినాదాలు, సిల్కియారా వద్ద సొరంగం ముఖ ద్వారం వద్ద బాణాసంచా కాల్చుతూ ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్న దృశ్యాలకు ఇచ్చిన ప్రాధాన్యతలో నూరవ వంతు కూడా ,తీర్థయాత్ర టూరిజం పేరుతో పర్యావరణ నిబంధనలకు కాలరాస్తున్న అంశంపై పెట్టకపోవడం మీద విమర్శలొస్తున్నాయి. ఈ అంశాన్ని దేశంలోని పర్యావరణవేత్తలు, జియాలజిస్టులు, నిపుణులు లేవనెత్తారు. సొరంగం పక్కనే చిన్నపాటి మట్టి కొండ కనిపించింది. వర్షంలో ఎప్పుడైనా కొండచరియలు విరిగిపడవచ్చు. ఇది నదీజలాలతో కలసి దిగువ ప్రాంతాలకు చేరుకుని ఉత్తరాఖండ్ ప్రాంతాలలో విపత్తును కలిగిస్తుంది. మట్టిని కోస్తే కాపలా గోడతో అడ్డుకట్ట వేయాలని జియాలజిస్టులు చెబుతున్నారు. ఉత్తరాఖండ్‌లోని జోషిమఠ్‌లో ఇళ్లు ఒకదాని తర్వాత ఒకటి కూలిపోతున్నాయి, పగుళ్లు కనిపించాయి. ఈ నేపథ్యంలో చార్ధామ్ ప్రాజెక్ట్ పర్యావరణ నిబంధనలకు అనుగుణంగా ఉందా అనే సందేహాలు తలెత్తడం సహజమే.

కేంద్రంలోని నరేంద్ర మోడీ నేతత్వంలోని బిజెపి ప్రభుత్వం ఈ ప్రాజెక్టు కోసం 2016లో రూ.800 కోట్లకు పైగా నిధులు కేటాయించింది. హిమాలయాలలోని ఈ భాగంలోని పునాది భౌగోళికంగా పెళుసుగా ఉంటుందని నిపుణులు అంటున్నారు. తత్ఫలితంగా, అటువంటి సున్నపు రాతి రాళ్లలో పేరుకుపోయిన నేల–నీటి మిశ్రమం యొక్క స్వభావాన్ని ముందుగానే అంచనా వేయడం చాలా కష్టం. చాలా మంది అభిప్రాయం ప్రకారం, ఇటువంటి నిర్లక్ష్యపు ప్రాజెక్టుకు అనుమతి ఇచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వమే ఇందులో మొదటి ముద్దాయి. సొరంగ నిర్మాణంతో ప్రమేయం ఉన్న నిర్మాణ సంస్థల అధినేతలను శిక్షించాలని ఇరుక్కుపోయిన కార్మికుల కుటుంబాలు డిమాండ్ చేస్తున్నాయి. 41 మంది కార్మికుల ప్రాణాలకు ముప్పు కలిగించడానికి బాధ్యులెవరో దర్యాప్తు చేసే అవకాశం చాలా తక్కువగా ఉందని సంబంధిత వర్గాలు భావిస్తున్నాయి. ఎందుకంటే అలా చేస్తే దేశ ప్రభుత్వం, ప్రధాని బాధ్యత వహించాల్సి ఉంటుంది. లేకుంటే మరెన్నో ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుంది.

మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

MANAPPURAM HOME FINANCE LTD.

గతంలో మణప్పురం హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్

సిఐఎన్: U65923K12010PIC039179

నమోదిత కార్యాలయం: IV/470A(పాతది)W/638A(కొత్తది) మణప్పురం హౌస్ వలపడ్ త్రిస్సుర్, కేరళ 680567

కార్పోరేట్ కార్యాలయం: మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్, మూడవ అంతస్తు, యూనిట్ నం.301 నుండి 315, ఎ వింగ్, 'కనకియ వాల్ స్ట్రీట్', అందేరి–కుర్ల రోడ్, అందేరి తూర్పు, ముంబాయి 400093, మహరాష్ట్ర. ఫోన్ నం.022–66211000, వెబ్‌సైట్: www.manappuramhomefin.com

డిమాండ్ నోటీసు

ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా దిగువ రుణగ్రహీత/లు కంపెనీ నుండి వారి ద్వారా పొందిన అసలు మరియు రుణ సౌకర్యం యొక్క వడ్డీ తిరిగి చెల్లించుటలో విఫలం చెందినారు మరియు రుణాలను నాన్–పెర్ఫార్మింగ్ అస్సెట్స్ (ఎన్‌పిఎ) గా వర్గీకరించడమైనది. వారిచే కంపెనీకి తెలిపిన చివరి చిరునామాలకు సెక్షన్ 13 (2) ఆఫ్ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్–2002 క్రింద వారికి తేదిన నోటీసు జారీ చేయబడింది, దిగువ లెక్కించిన రుణగ్రహీతల సమాచారం యొక్క ప్రయోజనాల కోసం అదనంగా, ఈ పబ్లిక్ నోటీసు ద్వారా సదరు రుణగ్రహీతలకు తెలియజేయబడుతుంది.

క్ర. సం	రుణగ్రహీత/సహ–రుణగ్రహీత పేరు/ ఎల్ఎఎన్/శాఖ	సృష్టింబడిన వడ్డీ విషయంలో సెక్యూర్డ్ అస్సెట్ వివరణ	ఎన్‌పిఎ తేది	డిమాండ్ నోటీసు తేది మరియు మొత్తం బకాయిలు
1	బొంగులూరి సుధారాణి బొంగులూరి అనిల్‌బాబు / MA90MHLONS000005011051/ విజయవాడ	డో.నం.1-121, మూల్యాంకనం నం.121, ఆర్.ఎస్.నం.01, బర్లపుడి గ్రామ పంచాయతీ, మొవ్వ మండలం, పి.ఓ. కూచిపుడి సెంటర్, జిల్లా–కృష్ణ, ఆంధ్రప్రదేశ్, పిన్ : 521136.	15-11-2023	18-11-2023 & Rs. 6,61,267/-

పై రుణగ్రహీత/లు సలహా ఏమనగా నోటీసు U/s. 13(2) జారీచేసిన తేది నుండి 60 రోజులలోగా మొత్తం బకాయిలు చెల్లించవలెను, విఫలమైనయెడల సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క నిబంధనల ప్రకారం పైన పేర్కొన్న తేదిన నోటీసు U/s. 13(2) యొక్క జారీ తేది నుండి 60 రోజులు దాటిన తరువాత తదుపరి చర్యలు తీసుకొనబడును.

తేది: 29 నవంబర్ 2023
ప్రదేశం: ఆంధ్రప్రదేశ్

సం/– అధీకృత అధికారి
మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

Chola
Enter a better life

కార్పోరేట్ ఆఫీసు: చోలా క్రెస్ట్, సూపర్ బి, సి54 మరియు సి55, 4, తిరు వి క ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై–600032. టి.ఎన్.

డిమాండ్ నోటీసు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 (రూల్స్) మరియు సెక్యూరిటైజేషన్ మరియు రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్స్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్ 2002 ("చట్టం") యొక్క నిబంధనల క్రింద

కింద సంతకం చేసిన **చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** యొక్క ఆధీకృత అధికారి (సెక్యూర్డ్ క్రెడిటార్) చట్టంలోని సెక్షన్ 13(12) కింద అందించబడిన అధికారాలను అమలు చేసూ, నిబంధన 3తో చదివిన సెక్షన్ కింద డిమాండ్ నోటీసు(లు) జారీ చేయబడింది. చట్టంలోని 13 (2) పేర్కొన్న నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు సంబంధిత నోటీసు (ల)లో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా రుణగ్రహీత(లు)ని పిలవడం జరిగింది. రుణగ్రహీత (లు) డిమాండ్ నోటీసు (ల) సేవలను తప్పించుకుంటున్నారని/ నివారిస్తున్నారని దిగువ సంతకం చేసిన వారు సహేతుకంగా విశ్వసిస్తున్నారు. కాబట్టి నిబంధనల ప్రకారం అనుబంధం చేయడం మరియు ప్రచురించడం ద్వారా నోటీసు సేవ ప్రభావితమవుతుంది. డిమాండ్ నోటీసు(ల)లోని విషయాలు ఇక్కడ దిగువన సంగ్రహించబడ్డాయి.

క్ర. సం.	రుణగ్రహీత/సహ–రుణగ్రహీతల పేరు మరియు చిరునామా	రుణం మొత్తం	డిమాండ్ నోటీసు తేది మరియు బాకీపడిన మొత్తం	సెక్యూర్డ్ అసెట్/ ఆస్తి యొక్క వివరాలు
1.	రుణ ఖాతా నెం. *HL03GUT000010136* 1) మనోజ్ కుమార్ దేవరపు, 2. దేవరపు గురవమ్మ **ఇరువురి నివాసం:** డో.నం.3-3-21/ఎ, చంద్రమౌళీశ్వర అగ్రహారం, ఎస్‌బి జుట్‌మిల్ వద్ద, గుంటూరు, ఆంధ్రప్రదేశ్–522 006; **ఇక్కడ కూడా :** కన్న టవర్స్, అక్కిరెడ్డి పాలెం గ్రామం రోడ్డు, చల్లావారి పాలెం, అక్కిరెడ్డిపాలెం గ్రామ పంచాయతీ హామ్లెట్, గుంటూరు, మస్జిద్ అక్కిరెడ్డిపాలెం గ్రామం రోడ్డు వద్ద, చల్లావారిపాలెం గ్రామం, గుంటూరు–522 005, ఆంధ్రప్రదేశ్.	₹ 25,54,679/-	27.11.2023 **రూ.34,01,743/- (ముప్పై నాలుగు లక్షల ఒక వేయ్యా ఏడు వందల నలభై మూడు రూపాయలు మాత్రమే) 24.11.2023** నాటికి	**ఎ–షెడ్యూల్ :** గుంటూరు జిల్లా, నల్లపాడు ఉపజిల్లా, చల్లావారిపాలెం గ్రామ పంచాయతీ ఏరియా, అంకిరెడ్డిపాలెం గ్రామం, డోనం.823, బయట 2553–14 చ.గ.లు. విస్తీర్ణం 2148–55 చ.గ.లు. తో కన్నా టవర్స్ భవనం మూల్యాంకనం నం.326 **హద్దులు : తూర్పు :** రోడ్డు 151'–06", **దక్షిణం:** ఎస్.వెంకటేశ్వర్లు ఆస్తి 122'–00", **పడమర :** పొన్నగంటి లక్ష్మి మరియు ఇతరుల సైట్ 169'–06", **ఉత్తరం :** వై.రాధాకృష్ణ మూర్తి ఆస్తి 117'–03". పై సరిహద్దుల 2148–55 చ.గ.లు.లో అవిభక్త మరియు పేర్కొనబడని విస్తీర్ణం 42 చ.గ.లు. లేదా 35–11 చ.మీ.లు. **బి–షెడ్యూల్ :** షెడ్యూల్ ఎ లో 2148–55 చ.గ.లు.లో పైన పేర్కొన్న 42 చ.గ.లు. లేదా 35–11 చ.మీ.లు. తో కన్నా టవర్స్ ఒకటవ అంతస్తు వద్ద డబుల్ బెడ్ రూము ఫ్లాట్ నం.206 తో 1150 చ.అ.లు. (కామన్ ఏరియాతో సహా) **హద్దులు : తూర్పు :** కామన్ కారిడార్, **దక్షిణం:** ఓపెన్ టు స్కై, **పడమర :** ఓపెన్ టు స్కై, **ఉత్తరం :** ఓపెన్ టు స్కై. ఈ సరిహద్దులతో కన్నా టవర్స్ ఒకటవ అంతసు వద్ద పేర్కొన్న ఫ్లాట్ నం.206 యొక్క అన్నీ ఫిక్చర్లు మరియు ఫిట్టింగులు తో సౌలభ్య హక్కులు, కామన్ పార్కింగ్, కామన్ కారిడార్, లిఫ్ట్, డ్రైనేజ్ కనెక్షన్, మరియు మొదలైనవి.

రుణగ్రహీత(లు) డిమాండ్ నోటీసు (లు)కు కట్టుబడి ఉండాలని మరియు ఈ ప్రచురణ తేదీ నుండి 60 రోజులలోపు వర్తించే వడ్డీ, అదనపు వడ్డీ, బౌన్స్ ఛార్జీలు, ఖర్చులు మరియు ఖర్చులతోపాటు అందులో పేర్కొన్న డిమాండ్ మొత్తాన్ని చెల్లింపు యొక్క సాక్షాత్కార తేదీ వరకు చెల్లించాలని దీని ద్వారా సూచించారు. చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ సురక్షిత రుణదా అని మరియు రుణగ్రహీత (లు) పొందే రుణ సదుపాయం స్థిరాస్తి/ ఆస్తులు తనఖాగా ఉంచిన సురక్షి ఆస్తి (లు)కి వ్యతిరేకంగా సురక్షి రుణం అని రుణగ్రహీత (లు) గమనించవచ్చు. రుణగ్రహీతలు నిర్ణీ గడువులోగా తమ బాధ్యతలను పూర్తి చేయడంలో విఫలమైతే, సురక్షితమైన ఆస్తులు (లు) స్వాధీనం చేసుకోవడానికి చట్టంలోని సెక్షన్ 13 (4) ప్రకారం అన్ని హక్కులను వినియోగించుకోడానికి సురక్షి రుణదాకు అర్హత ఉంటుంది. విక్రయం ద్వారా చట్టం మరియు దాని క్రింద ఉన్న నిబంధనల ప్రకారం అందుబాటులో ఉన్న ఏదైనా ఇతర పరిష్కారాన్ని అమలు చేయడం ద్వారా మరియు ద్వారా వాటిని బదిలీ చేయడానికి మాత్రమే పరిమితం కాకుండా. సురక్షిత రుణదాతకు అమ్మకం లేదా బదిలీ హక్కును అమలు చేయడానికి ముందు సురక్షి ఆస్తులు(లు) **అటాచ్** చేయడానికి మరియు/**లేదా సీల్** చేయడానికి కూడా అధికారం ఉంది. సురక్షిత ఆస్తుల (ల) విక్రయం ర్వా, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు చెల్లించాల్సిన బకాయిలను కవర్ చేయడానికి తనఖా పెట్టబడిన ఆస్తుల విలువ సరిపోకపోతే, బ్యాలెన్స్ బకాయిలను తిరిగి పొందటానికి ప్రత్యేక చట్టపరమైన చర్యలను ప్రారంభించే హక్కు కూడా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు ఉంది. ఈ పరిహారం అదనంగా మరియు ఏదైనా ఇతర చట్టం ప్రకారం సెక్యూర్డ్ క్రెడిటార్‌కు అందుబాటులో ఉన్న అన్ని ఇతర నివారణలకు స్వతంత్రంగా ఉంటుంది. అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13(8) కి, సురక్షిత ఆస్తులను మరియు చట్టంలోని సెక్షన్ 13(13)కి రుణగ్రహీతల దృష్టిని ఆహ్వానిస్తున్నారు. దీని ద్వారా రుణగ్రహీత (లు) సురక్షిత ఆస్తి (ల)ను పాడు చేయడం లేదా వాటితో వ్యవహరించడం లేదా అమ్మకం, లీజు లేదా ఇతరత్రా (సాధారణ వ్యాపారంలో కాకుండా) ఏదైనా సురక్షి ఆస్తి(ల) యొక్క ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేకుండా బదిలీ చేయడం నుండి నిరోధించబడింది/నిషేధించబడింది సెక్యూర్డ్ క్రెడిటార్ మరియు పైన పేర్కొన్న వాటిని పాటించకపోవడం, పేర్కొన్న చట్టంలోని సెక్షన్ 29 ప్రకారం శిక్షార్హమైన నేరం. డిమాండ్ నోటీసు కాపీ కింద సంతకం చేసిన వారి వద్ద అందుబాటులో ఉంటుంది మరియు రుణగ్రహీత (లు) వారు కోరుకున్నట్లయితే, సాధారణ కార్యాలయ వేళల్లో ఏదైనా పని దినాన దిగువ సంతకం చేసిన వారి నుండి సేకరించుకోవచ్చును.

సం/–
అధీకృత అధికారి
ప్రదేశం: గుంటూరు, ఆంధ్రప్రదేశ్
తేది: 27.11.2023
మెసెర్స్ చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్. తరపున

ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

ADITYA BIRLA CAPITAL
PROTECTING INVESTING FINANCING ADVISING

నమోదిత కార్యాలయం:– ఇండియన్ రేయాన్ కాంపౌండ్, వెరవల్, గుజరాత్–362266

కార్పొరేట్ కార్యాలయం : 10వ అంతస్తు, ఆర్ టెక్ పార్క్, నిర్లోన్ కాంప్లెక్స్, హబ్ మాల్ వద్ద, గోర్‌గావ్ (తూర్పు) ముంబై–400 063, ఎమ్‌హెచ్

డిమాండ్ నోటీసు

సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 ("ది రూల్స్") యొక్క రూల్ 3 తో చదువుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్స్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్ 2002 ("ది యాక్ట్") యొక్క సెక్షన్ 13(2) క్రింద

దిగువసంతకందారుదు అయిన ఆదిత్య బిర్లా ఫైనాన్స్ లిమిటెడ్ (ఎబిఎఫ్ఎల్) యొక్క అధీకృత అధికారి యాక్ట్ యొక్క రూల్ 3 తో చదువుతూ సెక్షన్ 13(12) క్రింద అతనికి అందించిన అధికారాలను వినియోగించుకుంటూ యాక్ట్ యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసులను జారీ చేయడమైనది. పేర్కొన్న నోటీసు రసీదు తేది నుండి 60 రోజులలోపు సంబంధిత నోటీసులలో పేర్కొన్న మొత్తాన్ని చెల్లించమంటూ క్రింది రుణగ్రహీతలను పిలువడమైనది. రుణగ్రహీతలు (లు) డిమాండ్ నోటీసు(ల) సేవలను తప్పించుకుంటున్నారని దిగువసంతకందారు సహేతుకంగా విశ్వసిస్తున్నారు, కాబట్టి నిబంధనల ప్రకారం అనుబంధం మరియు ప్రచురించడం ద్వారా నోటీసు సేవ అమలు చేయబడుతుంది. డిమాండ్ నోటీసులలోని విషయాలు ఇక్కడ క్రింద సంగ్రహించబడ్డాయి :

పైన పేర్కొన్న వాటికి సంబంధించి, సంబంధిత నోటీసు/ల తేదీ నుండి 60 రోజులలోపు, ఎబిఎఫ్ఎల్‌కి చెల్లించమని చెప్పబడిన రుణగ్రహీత / చట్టపరమైన వారసుడు(లు) / చట్టపరమైన ప్రతినిధి(లు)కి మరోసారి నోటీసు ఇవ్వబడింది, క్రింద పేర్కొన్న మొత్తం వారి పేర్లకు వ్యతిరేకంగా, దిగువ కాలమ్ (డి)లో క్రింద పేర్కొన్న సంబంధిత తేదీల నుండి చెల్లింపు మరియు / లేదా సాక్షాత్కార తేదీ వరకు వివరించిన తదుపరి వడ్డీతో పాటు, క్రింద పేర్కొన్న మొత్తం వారి పేర్లకు వ్యతిరేకంగా, దిగువ కాలమ్ (డి)లో క్రింద పేర్కొన్న సంబంధిత తేదీల నుండి చెల్లింపు మరియు / లేదా సాక్షాత్కార తేదీ వరకు వివరించిన తదుపరి వడ్డీతో పాటు, రుణ ఒప్పందం మరియు ఇతర పత్రాలు / రచనలు ఏవైనా ఉంటే, పేర్కొన్న రుణగ్రహీత ద్వారా అమలు చేయబడిన వాటిని చదవండి. రుణం బకాయి తిరిగి చెల్లించడానికి సెక్యూరిటీగా, ఈ క్రింది సురక్షిత ఆస్తి(లు) వరుసగా పేర్కొన్న రుణగ్రహీత ద్వారా ఎబిఎఫ్ఎల్‌కి తనఖా పెట్టబడ్డాయి.

క్ర. సు	రుణగ్రహీత(లు) పేరు మరియు చిరునామ	డిమాండ్ నోటీసు తేది	స్థిరాస్తి వివరణ
1	1. 1. పవన్ సాయి మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్, దీని ప్రొప్రైటర్. రెండుచింతల వెంకట శివరామ అంజనేయ ప్రసాద్, మొబైల్ నం.9440461609, ఇ మెయిల్ : lallihkannu@gmail.com 2. శ్రీ.వివిఎస్ఆర్ఎ ప్రసాద్ రెండుచింతల, తండ్రి. వెంకట సుబ్బారావు రెండుచింతల 3. శ్రీమతి. రెండుచింతల ఎన్‌వి రామలక్ష్మి, భర్త. అంజనేయ ప్రసాద్, మొబైల్ నం.9494422616 చిరునామా 1 : డో.నం.2-39/ఎ, చిన్నముట్టేవి, చిన్న ముట్టేవి గ్రామం, మొవ్వ మండలం, కృష్ణాజిల్లా–521136. ఎల్ఎఎన్ : ABVJWSTS000000563256	15th Nov. 2023 & 03th Nov. 2023 / అసాధారణ బకాయి మొత్తం: ₹ 42,06,501/- as on 15.11.2023	కృష్ణాజిల్లా, పామర్రు సబ్ రిజిస్ట్రార్, పామర్రు గ్రామం మరియు గ్రామ పంచాయతీ ఏరియా వద్ద ఉన్న డో.నం.19–62 వద్ద బేరింగ్ ప్లాట్ నం.25, పామర్రు యొక్క ఆర్.ఎస్.నం.286/6బి, 6సి మరియు 6డి లో ఉన్న స్థలం మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ మరియు భవనం విస్తీర్ణం 159 చ.గ.లు. లేదా 133.56 చ.మీ.లు. రెసిడెన్షియల్ సైట్ తో కలిపి అందులో నిర్మాణాలతో అన్నీ సౌలభ్య హక్కులు. ఉన్న హద్దులు : ఉత్తరం : బొమ్మారెడ్డి శేషమ్మ బేరింగ్ ప్లాట్ నం.24 ఆస్తి, దక్షిణం: 20.0 అ.లు. వెడల్పు రోడ్డు, తూర్పు: బొమ్మారెడ్డి శేషమ్మ బేరింగ్ ప్లాట్ నం.16 ఆస్తి, పడమర : 20.0 అ.లు. వెడల్పు రోడ్డు.
2	2. హాఫియా పాలీమర్స్, దీని ప్రొప్రైటర్. షేక్ షబ్బీర్‌బాబు మొబైల్ నం.9133922269, ఇ మెయిల్ : Hafiyapolymers@Gmail.com 2. శ్రీ.షేక్ షబ్బీర్ బాబు, తండ్రి. షేక్ మహబూబ్ సుభాని 3. శ్రీమతి. షేక్ హాఫియా, భర్త. షేక్ షబ్బీర్ బాబు, మొబైల్ నం.8142053526 చిరునామా 1 : 502–ఎ, అమీనాబాద్ గ్రామం, ఫిరంగిపురం మండలం, గుంటూరు, ఆంధ్రప్రదేశ్–522 529; చిరునామా 2 : 3–129, అమీనాబాద్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్–522 529. ఎల్ఎఎన్ : ABVJWSTS000000513504	15th Nov. 2023 & 03th Nov. 2023 / అసాధారణ బకాయి మొత్తం: ₹ 37,45,117.26 as on 15.11.2023	గుంటూరు జిల్లా, ఫిరంగిపురం మండలం, అమీనాబాద్ గ్రామం, అమీనాబాద్ గ్రామ పంచాయతీ పరిధిలోని మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ స్థలం మరియు భవనం డో.నం.502–ఎ మరియు సైట్ విస్తీర్ణం ఎసి. 0.60 సెంట్లు లేదా 2904 చ.గ.లు. తో అన్నీ నిర్మాణాలు మరియు ఫిట్టింగులు ఉన్న హద్దులు : ఉత్తరం : షేక్ సుభాహాన్ కి చెందిన ఆస్తి, దక్షిణం: సర్కార్ డొంక రోడ్డు, తూర్పు : చప్పిడి గోపి కి చెందిన ఆస్తి, పడమర : పీర్ల మహబుల్లా కి చెందిన ఆస్తి.

తదుపరి వడ్డీతో పాటు, పైన పేర్కొన్న సంబంధిత డిమాండ్ నోటీసులలో ప్రత్యేకంగా పేర్కొన్న విధంగా అదనపు వడ్డీ, యాదృచ్ఛిక ఖర్చులు, ఖర్చులు, చెల్లింపు మరియు / లేదా రియలైజేషన్ తేదీ వరకు జరిగిన ఛార్జీలు మొదలైనవి. పైన పేర్కొన్న విధంగా రుణగ్రహీతలు ఎబిఎఫ్ఎల్‌కి చెల్లింపు చేయడంలో విఫలమైతే, ఎబిఎఫ్ఎల్ పేర్కొన్న చట్టంలోని సెక్షన్ 13(4) మరియు వర్తించే నిబంధనల ప్రకారం ఖర్చులు మరియు పర్యవసానాలకు సంబంధించి చెప్పబడిన రుణగ్రహీత / చట్టపరమైన వారసుడు(లు) / చట్టపరమైన ప్రతినిధి(లు) పైన పేర్కొన్న సురక్షిత ఆస్తి(లు) / స్థిరాస్తి (లు)పై పూర్తిగా రిస్క్‌లో కొనసాగుతాయి.

పేర్కొన్న రుణగ్రహీత / చట్టపరమైన వారసుడు(లు) / చట్టపరమైన ప్రతినిధులు(లు) పైన పేర్కొన్న సురక్షిత ఆస్తి(లు) / స్థిరాస్తి(లు), విక్రయం ద్వారా, లీజు ద్వారా లేదా ఎబిఎఫ్ఎల్ యొక్క సమ్మతి ముందస్తుగా రాసి ఇవ్వకుండా బదిలీ చేయడం ఈ చట్టం ప్రకారం నిషేధించబడింది. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 (2002 యొక్క 54) యొక్క సెక్షన్ 13(2) క్రింద ఇది చివరి నోటీసు అని దయచేసి గమనించండి. రుణగ్రహీత(లు)కి వ్యతిరేకంగా పైన పేర్కొన్న ఏదైనా లేదా అన్ని హక్కులను పూర్తిగా వారి రిస్క్, బాధ్యత మరియు ఖర్చుల వద్ద ఉపయోగించుకునే హక్కు ఎబిఎఫ్ఎల్‌కి ఉంటుందని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

సం/–
ప్రదేశం : కృష్ణ/గుంటూరు, ఆంధ్రప్రదేశ్
తేది : 29.11.2023
అధీకృత అధికారి
ఆదిత్య బిర్లా ఫైనాన్స్ లిమిటెడ్

డిజిటల్ నైపుణ్యానికి ఇన్ఫోసిస్ శిక్షణ

ప్రజాశక్తి –ఆనందపురం (విశాఖపట్నం)

విద్యార్థుల్లో డిజిటల్ నైపుణ్యానికి ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డ్ నిర్వహిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సర్వ శిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండలంలోని నేలతేరు కెజిబివిలో కంప్యూటర్ ఫ్యాకల్టీకి ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డ్ శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థుల్లో డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించేందుకు టెక్ దిగ్గజం ఇన్ఫోసిస్ మంచి ప్రోగ్రామ్‌తో ముందుకొచ్చిందన్నారు. స్ప్రింగ్ బోర్డ్ అనే ఉచిత డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించి, ఈ ప్రోగ్రామ్ ద్వారా 2025 నాటికి 10 మిలియన్లకు పైగా విద్యార్థుల్లో డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించాలని లక్ష్యంగా, విద్యార్థులకు కార్పోరేట్ గ్రేడ్ లెర్నింగ్ ఎక్స్‌పీరియన్స్ అందిస్తుందన్నారు. ఒక్కసారి ఎన్‌రోల్ అయిన ప్రతి విద్యార్థీ, 6 వ తరగతి నుంచి జీవితకాలం పాటు నూతన టెక్నాలజీస్‌పై శిక్షణ అందుకోవచ్చన్నారు. ఇండస్ట్రీ ఎక్స్‌పర్ట్స్ ఫ్యాకల్టీతో విద్యార్థులకు లైవ్ సెషన్స్ ఏర్పాటు చేస్తారన్నారు. పాఠశాల, కళాశాల విద్యార్థుల నుంచి ప్రొఫెషనల్స్, పెద్దల వరకు ఎవరైనా ఆసక్తి ఉన్నవారంతా స్ప్రింగ్‌బోర్డ్‌లో పాల్గొనవచ్చన్నారు. ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డ్ వెబ్‌సైట్ లేదా యాప్‌లో విద్యార్థిని ఎలా నమోదు చేసుకోవాలో ఇన్ఫోసిస్ బృందం క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సర్వశిక్ష ఎపిసి శ్రీనివాసరావు, జిసిడిఓ ఖలియాబేగం, కెజిబివి ప్రత్యేక అధికారి చంద్రకళ, ఇన్ఫోసిస్ బృందం , ఉపాధ్యాయులు పాల్గొన్నారు

పోస్టల్ బ్యాలెట్‌లో అక్రమాలు

- మధ్యప్రదేశ్ సిఇఒకు కాంగ్రెస్ ఫిర్యాదు
- తిరస్కరించిన అధికారులు

భోపాల్ : మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ జిల్లాలో పోస్టల్ బ్యాలెట్‌లో అక్రమాలు జరిగాయని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి అనుపమ్ రాజన్‌కు కాంగ్రెస్ నాయకులు మెమొరాండం సమర్పించారు. స్ట్రాంగ్‌రూమ్ నుంచి పోస్టల్ బ్యాలెట్లను బయటికి తీసి బాలాఘాట్ కలెక్టర్ గిరీష్ చంద్ర మిశ్రా, ఇతర అధికారులు అక్రమాలకు పాల్పడ్డారని, వీరిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. కాంగ్రెస్ ఆరోపణలను ఎన్నికల అధికారులు, కలెక్టరేట్ అధికారులు తీవ్రంగా ఖండించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పోస్టల్ బ్యాలెట్ పత్రాలను ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటలకు తెరిచి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా జాగ్రత్తగా కట్టలుగా ఉంచుతామని తెలిపారు. ఈ ప్రక్రియను అన్ని పార్టీల పోలింగ్ ఏజెంట్ల సమక్షంలోనే చేస్తామని చెప్పారు. ఈ ప్రక్రియను ఎవరో వీడియో తీసి సోషల్ మీడియాలో షేర్ చేయడంతో గందరగోళం ఏర్పడిందని అధికారులు వెల్లడించారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న డివిజనల్ కమిషనర్ ఈ ప్రక్రియను నిర్వహించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు నోడల్ అధికారి హిమ్మత్ సింగ్‌ను సస్పెండ్ చేశారు. మధ్యప్రదేశ్‌లో ఈ నెల 17న అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. డిసెంబర్ 3న ఫలితాలు వెల్లడించనున్నారు.

మరో మూడు వారాల వ్యవధి ఇవ్వండి

- జ్ఞానవాపీ మసీదు కేసులో సైంటిఫిక్ సర్వే నివేదిక సమర్పణపై ఎఎస్ఐ విజ్ఞప్తి

వారణాసి : జ్ఞానవాపీ మసీదు సముదాయానికి సంబంధించిన సైంటిఫిక్ సర్వే నివేదికను సమర్పించడానికి మరో మూడు వారాల వ్యవధి కావాలని ఆర్కియాలజికల్ సర్వే ఇండియా (ఎఎస్ఐ) కోరింది. జ్ఞానవాపీ మసీదు కేసు వివాదాన్ని వారణాసి జిల్లా కోర్టు విచారణ చేస్తున్న విషయం తెలిసిందే. నవంబర్ 28లోగా సైంటిఫిక్ సర్వే నివేదికను సమర్పించాలని గత విచారణలో ఎఎస్ఐను కోర్టు ఆదేశించింది. పురావస్తు శాస్త్రవేత్తలు, సర్వేయర్లు, ఇతర నిపుణులు సేకరించిన సమాచారాన్ని క్రోడీకరించడానికి మరింత సమయం కావాలని మంగళవారం విచారణలో ఎఎస్ఐ కోరింది. విచారణను కోర్టు ఈ నెల 29కి అంటే బుధవారానికి వాయిదా వేసింది. కోర్టు ఆదేశాల మేరకు ఆగస్టు 4 నుంచి జ్ఞానవాపీ మసీదు ప్రాంగణంలో ఎఎస్ఐ సర్వే నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే.

పూనవల్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

POONAWALLA HOUSING FINANCE
Apna Ghar, Apni Pehchan

(ఇంతకుముందు మాగ్మా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తెలిసినది)

రిజిష్టర్డు ఆఫీసు: 602, 6వ ఫ్లోర్, జీరో వన్ ఐటీ పార్క్, సర్వే నెం.79/1, ఘోర్‌పాడి, ముంద్వా రోడ్, పూణె–411036.

అనుబంధం-4 (రూల్ 8(1) చూడండి) స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

ఏదైతే క్రింది సంతకందారులు **పూనవల్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఇంతకుముందు మాగ్మా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా తెలిసినది)** యొక్క అధీకృత అధికారిగా పైన పేర్కొన్న కార్పొరేట్/ రిజిస్టర్డ్ కార్యాలయానికి సంబంధించి సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (ఇకమీదట "సదరు చట్టం"గా పేర్కొనబడును) లోని సెక్షన్ 13(12) మరియు దీనితో పాటు చదవదగిన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 3 ప్రకారం సంక్రమించిన అధికారాల ద్వారా దిగువ పేర్కొన్న రుణగ్రహీతలకు నోటీసు ముట్టిన తేదీ నుంచి 60రోజుల్లోపు బకాయిలను తిరిగి చెల్లించాలని డిమాండ్ నోటీసు ఇవ్వడం జరిగింది.

తనఖాదారులు / హామీదారులు పేరు మరియు చిరునామా : **1) తల్లం వెంకట నాగభానుప్రసాద్, తండ్రి : లక్ష్మీనరసింహమూర్తి,** 8-678, మెయిన్ బజార్, మంగళగిరి-522503, **తనఖాదారు - మెస్సర్స్ సాయి విజయ ట్రేడర్స్ మరియు ఆస్తిపై రుణం, 2) శ్రీమతి తల్లం విజయకుమారి, భర్త : లక్ష్మీనరసింహమూర్తి,** 8-678, మెయిన్ బజార్, మంగళగిరి-522503, **హామీదారు & తనఖాదారు - మెస్సర్స్ సాయి విజయ ట్రేడర్స్, 3) శ్రీమతి తొండెపు తనూజ, భర్త : శ్రీ కృష్ణ హరిప్రసాద్,** 2-14, అరుంధతి నగర్, రజక వీధి, కంచికచర్ల, కృష్ణా జిల్లా. **హామీదారు& తనఖాదారు - మెస్సర్స్ సాయి విజయ ట్రేడర్స్ మరియు ఆస్తిపై రుణం.**

యన్‌పిఎ తేది : 31-10-2019	**డిమాండ్ నోటీసు తేది : 21-01-2021**
డిమాండ్ నోటీసు నందు పేర్కొన్న బకాయి : **తేది.31-12-2020 నాటికి బకాయి రూ.74,13,789/- (అక్షరాల డెబ్బైనాలుగు లక్షల పదమూడు వేల ఏడు వందల ఎనభైతొమ్మిది రూపాయలు మాత్రము) ప్లస్ తదుపరి జమకూడు వడ్డీ మరియు ఇతర ఖర్చులు.**	
స్వాధీనత తేది : 09-03-2022	
స్వాధీనత నోటీసు నందు పేర్కొన్న బకాయి : **తేది.09-03-2022 నాటికి బకాయి రూ.84,84,235.51 పై॥ (అక్షరాల ఎనభైనాలుగు లక్షల ఎనభై నాలుగు వేల రెండు వందల ముప్పైఐదు రూపాయలు మరియు పైసలు యాభైఒక్కటి మాత్రము) మరియు తదుపరి జమకూడు వడ్డీ మరియు ఖర్చులు.**	

లోకల్ గవర్నమెంట్‌కు చెల్లించవలసిన ఆస్తి పన్ను, వాటర్ బిల్స్ మొ॥నవి ఏదేని చెల్లించవలసి ఉంటే ఆసక్తిగల బిడ్డర్లు విచారించుకొనవలయును మరియు విజయవంతమైన బిడ్డరు సదరు బకాయిలను చెల్లించవలెను.

స్థిరాస్తుల వివరములు
1) గుంటూరు జిల్లా, మంగళగిరి, నన్నపనేని కళ్యాణ మండపం వెనుకవైపు, సర్వే నెం.258/బి, వార్డు నెం.7, డోరు నెం.7-541 నందు **శ్రీమతి తల్లం విజయకుమారి, భర్త : తల్లం లక్ష్మీనరసింహమూర్తి, తల్లం వెంకట నాగభానుప్రసాద్, తండ్రి : తల్లం లక్ష్మీనరసింహమూర్తి మరియు శ్రీమతి తొండెపు తనూజ, భర్త : తొండెపు శ్రీ కృష్ణ హరిప్రసాద్ లకు చెందిన 210 చ॥గ॥లు లేదా 175.58 చ॥మీ॥ల విస్తీర్ణముగల ఖాళీస్థలము నకు సంబంధించిన యావదాస్తి. దీనికి హద్దులు : తూర్పు** : మునిసిపల్ బజారు -30.6 అ॥; **దక్షిణం** : శరణం రామమోహన్ రావు యొక్క ఆస్తి - 62 అ॥; **పడమర** : మునిసిపల్ బజారు -30.6 అ॥; **ఉత్తరం** : తల్లం బదరి నారాయణ యొక్క ఆస్తి - 62 అ॥.
2) మంగళగిరి, నన్నపనేని కళ్యాణ మండపం వెనుకవైపు, సర్వే నెం.258/బి, వార్డు నెం.7, డోరు నెం.7-541 నందు **శ్రీమతి తల్లం విజయకుమారి, భర్త : తల్లం లక్ష్మీనరసింహమూర్తి, తల్లం వెంకట నాగభానుప్రసాద్, తండ్రి : తల్లం లక్ష్మీనరసింహమూర్తి మరియు శ్రీమతి తొండెపు తనూజ, భర్త : తొండెపు శ్రీ కృష్ణ హరిప్రసాద్ లకు చెందిన 11 చ॥గ॥లు లేదా 9.19 చ॥మీ॥ల విస్తీర్ణముగల ఖాళీస్థలమునకు సంబంధించిన యావదాస్తి. దీనికి హద్దులు : తూర్పు** : తల్లం బదరి నారాయణ యొక్క ఆస్తి - 6.6 అ॥; **దక్షిణం** : తల్లం బదరి నారాయణ యొక్క ఆస్తి - 15.5 అ॥; **పడమర** : శరణం రామమోహన్ రావు యొక్క ఆస్తి - 6.6 అ॥; **ఉత్తరం** : మునిసిపల్ బజారు -15.5 అ॥.
3) మంగళగిరి, నన్నపనేని కళ్యాణ మండపం వెనుకవైపు, సర్వే నెం.258/బి, వార్డు నెం.7, డోరు నెం.7-541 నందు **శ్రీమతి తల్లం విజయకుమారి, భర్త : తల్లం లక్ష్మీనరసింహమూర్తి, తల్లం వెంకట నాగభానుప్రసాద్, తండ్రి : తల్లం లక్ష్మీనరసింహమూర్తి మరియు శ్రీమతి తొండెపు తనూజ, భర్త : తొండెపు శ్రీ కృష్ణ హరిప్రసాద్ లకు చెందిన 15.25 చ॥గ॥లు లేదా 12.75 చ॥మీ॥ల విస్తీర్ణముగల ఖాళీస్థలమునకు సంబంధించిన యావదాస్తి. దీనికి హద్దులు : తూర్పు** : తల్లం బదరి నారాయణ యొక్క ఆస్తి; **దక్షిణం** : షేక్ రమిజున్నీసా యొక్క ఆస్తి; **పడమర** : శరణం రామమోహన్ రావు యొక్క ఆస్తి; **ఉత్తరం** : గుబ్బా వరప్రసాదరాయ్ యొక్క స్థలము, **ఉత్తరం** : దండమూడి రాజశేఖర్ మరియు ఇతరుల యొక్క స్థలము.

రిజర్వు ధర : రూ.67,87,000/-, ధరావత్తుసొమ్ము : రూ.6,78,700/-

ఈ-వేలము యొక్క తేది మరియు సమయము : ది.29-12-2023 న ఉ॥గం॥10:30 ని॥ల నుండి మ॥గం॥ 12:30 ని॥ల వరకు. వేలము పొడిగింపు సమయము 10 నిమిషాల వ్యవధి. ఈ-వేలం పోర్టల్ : **https://www.mstcecommerce.com/auctionhome/ibapi**	
ఉద్దేశించిన బిడ్డర్లు/ కొనుగోలు దారులు వారి మొబైల్ నెంబరు మరియు ఇ-మెయిల్ ఐడి ని ఉపయోగించి **https://www.mstcecommerce.com/auctionhome/ibapi** పోర్టల్‌లో నమోదుచేసుకోవాలి. ఇంకా అవసరమైన కెవైసి పత్రాలను అప్‌లోడ్ చేయాలని వారు అభ్యర్థించారు. కెవైసి పత్రాలు ధృవీకరించబడిన తర్వాత ఇ-వేలం సేవా ప్రదదాత (2 పని రోజులు పట్టవచ్చు) ఉద్దేశించిన బిడ్డర్లు/ కొనుగోలు దారులు తమ గ్లోబల్ **EMD** వాలెట్ ఖాతాలో ఆన్‌లైన్ మోడ్‌ను ఉపయోగించి **EMD** మొత్తాన్ని ది.28-12-2023 సాయంత్రం 4.00 గంటల లోపు బదిలీ చేయవలెను.	
బిడ్ పెంపుదల మొత్తం : రూ.50,000/-	వేలం పొడిగింపు సమయము : 10 నిమిషాలు
బ్యాంక్ వారికి తెలిసినంతవరకు ఎటువంటి తాకట్టు ఋణభారాలు లేవు.	
ఆస్తిని తనిఖీచేయు తేది మరియు సమయం : ది.29-11-2023 నుండి బ్యాంకు వారి పనివేళలతో ముందస్తు అనుమతితో	
ఆన్‌లైన్ లో ధరావత్తుతో బిడ్లు సమర్పించుటకు ఆఖరు తేది : 28-12-2023, సాయంత్రం 4 గం॥ల లోగా.	

* **చట్టబద్ధమైన బకాయిలు కన్నా బ్యాంకు బకాయిలకు ప్రాధాన్యత ఉంటుంది.**
అమ్మకం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం దయచేసి సర్వీస్ ప్రొవైడర్ యొక్క వెబ్‌సైట్‌లో లింకును చూడగలరు. 1) **https://www.ibapi.in** 2) **https://www.mstcecommerce.com/auctionhome/ibapi** లేదా బ్యాంక్ వెబ్‌సైట్ **www.iob.in** ను సందర్శించగలరు.
ఇతర పూర్తి వివరముల కొరకు సంప్రదించండి **బ్రాంచి మేనేజర్, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, మంగళగిరి బ్రాంచి, యమ్.పి. కళ్యాణమండపం ప్రక్కన, తెనాలి రోడ్, మంగళగిరి-522503 వారి ఆఫీస్ పనిచేయు వేళలలో, ఫోన్ నెం.08645-234208/ 234209. సర్వీస్ ప్రొవైడర్ : మెస్సర్స్ MSTC లిమిటెడ్, రిజిస్టర్డ్ ఆఫీస్ : 225-సి, ఎ.జె.సి. బోస్ రోడ్డు, కోల్‌కతా-700020 (కాంటాక్ట్ ఫోన్ నెం. & టోల్ ఫ్రీ నెంబర్స్ : 033-22901004, ఆపరేషన్ టైమ్ హెల్ప్‌డెస్క్ : ఉ॥8.00 గం॥ల నుండి సా॥8.00 గం॥ల వరకు.**
తేది : 28-11-2023, ప్రదేశం : మంగళగిరి **సం/- అధీకృత అధికారి, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్**

బెంగుళూరులో ప్లకార్డు చూపుతున్న ఐటి ఉద్యోగి

త్రిపుర రాజధాని అగర్తలలో భారీ ర్యాలీ

పాండిచ్చేరిలో కార్మికులు, రైతులను అడ్డుకుంటున్న పోలీసులు

బిజెపిని అధికారం నుంచి తరిమి కొట్టాలి

- కార్మిక, కర్షక మహాధర్నా పిలుపు
- భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తాం : నేతలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రజలను, దేశాన్ని రక్షించడానికి బిజెపిని అధికారం నుంచి తరిమి కొట్టాలని 'కిసాన్ మజ్దూర్ మహాపడావ్' పిలుపునిచ్చింది. మోడీ సర్కార్ కార్మిక, రైతు, ప్రజా, దేశ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా మూడు రోజుల మహాధర్నా విజయవంతమైంది. ఈ చారిత్రాత్మక మహాధర్నాను విజయవంతం చేసినందుకు కార్మికులు, రైతులకు కార్మిక, రైతు సంఘాలు అభినందనలు తెలిపాయి. అనేక రాష్ట్రాల్లో రాజ్‌భవన్‌కు చేరుకుని గవర్నర్‌లకు మెమోరాండం, చార్టర్ ఆఫ్ డిమాండ్లను సమర్పించడంతో మహాధర్నా పోరాటం ముగిసింది.

రైతు, కార్మిక నేతలపై కేసులు నమోదు చేసి, ఎన్నో అడ్డంకులు సృష్టించినా, పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించి, మూడు రోజులపాటు మహాధర్నా చేశారు. కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర సెక్టోరల్ ఫెడరేషన్లు/ సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా సంయుక్త వేదిక పిలుపు మేరకు ఈ నెల 26 నుంచి 28 వరకు నిర్వహించిన మహాధర్నాలో లక్షల మంది కార్మికులు, రైతులు భాగస్వాములయ్యారు. వివిధ ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి. అనేక మంది మేధావులు, కళాకారులు, రచయితలు, ప్రముఖులు సంఘీభావం తెలిపారు. సిపిఎంతోపాటు వివిధ పార్టీలు మద్దతు ఇచ్చాయి.

అండమాన్ నికోబార్ రాజధాని పోర్ట్ బ్లెయిర్, త్రిపురలోని అగర్తల, పాండిచ్చేరితో పాటు దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల రాజధాని నగరాల్లో రాజ్ భవన్ (గవర్నర్ కార్యాలయం)ల ఎదుట మూడు రోజుల పాటు మహాధర్నా నిర్విరామంగా జరిగింది. మూడు రోజులపాట ఆందోళన సైట్ల వద్దే వంటావార్పు చేసుకుని, తాత్కాలిక గుడారాలు ఏర్పాటు చేసుకొని రాత్రుళ్లు అక్కడే బస చేశారు.

స్వామినాథన్ కమిషన్ ఇచ్చిన ఫార్ములా ప్రకారం రైతు ఉత్పత్తులపై కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) నిర్ణయించాలని, ఢిల్లీ సరిహద్దుల్లో 13 నెలలపాటు రైతులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని, ఆందోళనలో అమరులైన రైతులకు పరిహారం ఇవ్వాలని, దోషులను శిక్షించాలని ఎస్‌కెఎం, సిటియు డిమాండ్ చేశాయి. దేశవ్యాప్తంగా రైతులు, కార్మికుల డిమాండ్లపై మరింత నిర్ణయాత్మక, ఉమ్మడి పోరాటాలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశాయి. కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అమలు చేసేందుకు కేంద్రంలో గానీ, రాష్ట్రాల్లోగానీ ఏ ప్రభుత్వమూ సాహసం చేయనంత స్థాయిలో కార్మికులు, రైతుల ఉమ్మడి, సమన్వయ పోరాటాలు బలోపేతం అవుతాయని నేతలు పిలుపునిచ్చాయి. ఇడి, సిబిఐ, ఎన్ఐఎ వంటి దర్యాప్తు సంస్థల సహాయంతో యుఎపిఎ, దేశద్రోహ చట్టం వంటి చట్టాలను కేంద్రం దుర్వినియోగం చేస్తోందని, రచయితలు, మేధావులు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు, ప్రతిపక్ష సభ్యులను లక్ష్యంగా చేసుకుని అక్రమ అరెస్టులకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశాయి. న్యూస్‌క్లిక్ మీడియా ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థ, హెచ్ఆర్ మేనేజర్ అమిత్ చక్రవర్తి చారిత్రాత్మక రైతు పోరాటంపై నిజం, వాస్తవాలను ప్రచురించినందున కేంద్ర ప్రభుత్వం జైలుకు పంపిందని విమర్శించింది. ప్రజల డిమాండ్లపై మరింత భారీ, ఐక్య పోరాటాలు చేస్తామని ఎస్‌కెఎం, సిటియుఎస్‌లు హెచ్చరించాయి.

ఈ సందర్భంగా రైతు, కార్మిక సంఘాల నేతలు మాట్లాడుతూ.. దేశ, విదేశీ బ్రాండ్‌లకు చెందిన కార్పొరేట్లకు ప్రయోజనం చేకూర్చడానికి బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రజల జీవితాన్ని దుర్భరం చేసిందని విమర్శించారు. మోడీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని గౌరవించడంలేదని, ఉల్లంఘించిన వారికి అండగా నిలుస్తుందని అన్నారు. మహాపడావ్ కార్యక్రమాలను సమీక్షించిన అనంతరం సిటియులు, ఎస్‌కెఎం తదుపరి దశ ఆందోళనలను నిర్ణయిస్తామని నాయకులు తెలిపారు.

ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జరిగిన ఆందోళనలో సిఐటియు అధ్యక్షులు కె హేమలత మాట్లాడుతూ.. నయా ఉదారవాద విధానాల వ్యవస్థాగత సంక్షోభం నుండి దేశ ఆర్థిక వ్యవస్థను రక్షించాలని కార్మికులు, రైతులు కోరుతున్నారని అన్నారు. వేతనాలు పెంచడం, ప్రభుత్వ నిధులతో సామాజిక భద్రతా చర్యలను విస్తరించడం, వ్యవసాయ ఇన్‌పుట్‌లతో సహా రైతులకు సబ్సిడీ, ప్రభుత్వ యాజమాన్యంలోని మండీలు, ఎంఎస్‌పి, రైతుల కష్టాలను తీర్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్, ఎఐసిసిటియు ప్రధాన కార్యదర్శి రాజీవ్ దిమ్రి, ఎఐకెఎస్ కోశాధికారి కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల్లో తపన్ సేన్ (సిఐటియు), అశోక్ సింగ్ (ఐఎన్‌టియుసి), ఎఆర్ సింధు (సిఐటియు), ఆర్ కె శర్మ (ఎఐయుటియుసి), షణ్ముగమ్ (ఎల్‌పిఎఫ్), మనలి (ఎస్ఇడబ్ల్యుఎ), అశోక్ ఘోష్ (యుటియుసి), ఇందుప్రకాష్ మీనన్ (టియుసిసి), ఎస్‌కెఎం నేతలు అశోక్ ధావలే, విజూ కృష్ణన్, హన్నన్ మొల్లా, రాకేష్ తికాయత్, దర్శన్ పాల్, జోగిందర్ సింగ్ ఉగ్రహాన్, సునీలం, అవిక్ సాహా తదితరులు పాల్గొన్నారు.

రోడ్ షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న బృందాకరత్

ఇది రోడ్ షో కాదు.. పోరాటాల షో

- బూర్జువా పార్టీల మాయాజాలాన్ని తిప్పికొట్టాలి
- లాల్ జెండా ముద్దు బిడ్డ మల్లు లక్ష్మిని గెలిపించాలి : బృందాకరత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇది రోడ్ షో మాత్రమే కాదు.. పోరాటాల షో అని.. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ అన్నారు. ఎన్నికలు వచ్చాయంటే వానాకాలంలో వచ్చే కప్పల్లాగా పూటకో పార్టీ మారుతున్నారని, ఎర్రజెండా పట్టుకున్న కార్యకర్తలు, నాయకులు నికరంగా ఉంటారని తెలిపారు. లాల్ జెండా ముద్దుబిడ్డ మల్లు లక్ష్మిని గెలిపించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలోని సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి మల్లు లక్ష్మి గెలుపును కాంక్షిస్తూ మంగళవారం పట్టణ కేంద్రంలో నిర్వహించిన రోడ్ షోలో బృందా కరత్ పాల్గొన్నారు. ఎర్రజెండాలతో హుజూర్‌నగర్ గడ్డ ఎరుపెక్కింది. ప్రజలు పూల జల్లు కురిపించారు. అనంతరం పొట్టిశ్రీరాములు సెంటర్‌లో జరిగిన సభలో బృందా కరత్ ప్రసంగించారు. ఎన్నికల్లో బిజెపి, బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు అధిక మొత్తంలో డబ్బులు ఖర్చు చేసి గెలవాలని చూస్తున్నారన్నారు. వారికి ఓట్లతో బుద్ధిచెప్పాలని కోరారు. ఎర్రజెండా ఒక సిద్ధాంతం కోసం, పేదల కోసం పని చేస్తోందని చెప్పారు. తమ పార్టీ పోటీ చేస్తోందని వ్యక్తుల కోసం, పార్టీ కోసం కాదని, పేద ప్రజల కోసమని వివరించారు. ఎన్ని కష్టాలున్నా నిరంతరం ప్రజల పక్షాన పోరాడేది ఒక ఎర్రజెండా మాత్రమేనని తెలిపారు. కాంగ్రెస్ ఎంపి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రజలకు చేసిందేమీలేదన్నారు. మల్లు లక్ష్మిని గెలిపిస్తే ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజాస్వామ్యం, ధనస్వామ్యం మధ్య జరుగుతున్న ఈ ఎన్నికల్లో ప్రతి ఓటరూ ఆలోచించి సిపిఎంకు ఓటేసి మల్లు లక్ష్మిని గెలిపించాలని కోరారు. సిపిఎం పట్టణ కార్యదర్శి నాగారపు పాండు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే అభ్యర్థి మల్లు లక్ష్మి, జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, నాయకులు పారేపల్లి శేఖర్ రావు, కొలిశెట్టి యాదగిరి, నెమ్మాది వెంకటేశ్వర్లు, కోటా గోపి, చెరుకు ఏకలక్ష్మి పాల్గొన్నారు.

5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు 2023

రోడ్‌షోలో మాట్లాడుతున్న రాహుల్ గాంధీ, పక్కన ప్రియాంక, రేవంత్

మేము పాలకులం కాదు.. ప్రజా సేవకులం

- నిరంకుశ కెసిఆర్ ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పాలి
- కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్, ప్రియాంక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కెసిఆర్ నిరంకుశ ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ఎఐసిసి నాయకులు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ అన్నారు. మేము పాలకులము కాదు.. ప్రజల సేవకులమని తెలిపారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి అభ్యర్థి మైనంపల్లి హనుమంతరావు ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ రోడ్‌షోలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. డప్పు దరువులతో, బతుకమ్మ, బోనాలు, నృత్యాలతో వేలాది మంది ప్రజలతో ఆనంద్ బాగ్ చౌరస్తా నుంచి మల్కాజ్‌గిరి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రియాంక గాంధీ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు ప్రత్యేక రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేస్తే, కెసిఆర్ కుటుంబం ప్రజలను అడ్డగోలుగా దోచుకుంటుందని అన్నారు.

బడుగు బలహీన తరగతుల ప్రజలను మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రవేశపెట్టిన పథకాలు అన్నింటిలో 30 శాతం కమీషన్ తీసుకున్న ఘనత కెసిఆర్ కుటుంబానికి దక్కుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పొందుపరిచిన ఆరు గ్యారంటీలను తమ ప్రభుత్వం అధికారంలో రాగానే అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కెసిఆర్ తెలంగాణకు చేసిందేమీ లేదని, ప్రజలను మోసం చేస్తూ తన ఆస్తులను పెంచుకున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రజలను మోసం చేసిన కెసిఆర్‌ను గద్దె దించే సమయం ఆసన్నమైందన్నారు. మల్కాజ్‌గిరి అభ్యర్థి మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ.. మల్కాజిగిరి ప్రజలను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటానని, అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని అన్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి యంత్రాంగం

- డిజిపికి హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

పోలీసులకు ప్రజలు ఇచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేకంగా ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని డిజిపిని హైకోర్టు ఆదేశించింది. ఈ విష యంపై సుప్రీంకోర్టు లలిత కుమార్ వర్సెస్ ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం మధ్య జరి గిన కేసులో ఇచ్చిన తీర్పు ప్రతిని తెలుగులో అందరికీ తెలిసేలా అన్ని పోలీస్ స్టేషన్లకు పంపాలంది. ప్రజల నుంచి ఫిర్యాదులు అందాక ఎఫ్ఐఆర్ నమోదు 24 గంటల్లో చేయాలంది. ఆ విధంగా చేయకపోతే ఫిర్యాదు ఏ దశలో ఉందో ఫిర్యాదుదారుడికి తెలియజేయాలంది. ఈ మేరకు జస్టిస్ వెంకట జ్యోతిర్మయి తీర్పు చెప్పారు. విశాఖలోని మహారాణిపేట పోలీసులు తన ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ దాఖలు చేయకపోవడంపై కె రామారావు దాఖలు చేసిన పిటిషన్‌లో ఈ తీర్పు వెలువడింది.

ఐఐటి మద్రాస్ ప్రొఫెసర్ సస్పెన్షన్

- రీసెర్చ్ స్కాలర్ ఆత్మహత్యపై కమిటీ నివేదిక

చెన్నై: రీసెర్చ్ స్కాలర్ ఆత్మహత్యకు బాధ్యుడైన ఐఐటి మద్రాస్ ప్రొఫెసర్ అశీష్ కుమార్ సేన్‌ను యాజమాన్యం సస్పెండ్ చేసింది. ఈ ఏడాది మార్చి 31న మెకానికల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ వద్ద పిహెచ్‌డి స్కాలర్, 31 ఏళ్ల సచిన్ కుమార్ జైన్ ఆత్మహత్య చేసుకున్నారు. దీనిపై జైన్ సోదరుడు భవేష్ జైన్ ఐఐటి మద్రాస్ డైరెక్టర్ వి కామకోటికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రాసిన ఆరు పేజీల లేఖలో పిహెచ్‌డి గైడ్, మెకానికల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ చీఫ్ ప్రొఫెసర్ అశీష్ కుమార్ సేన్ వేధింపుల కారణంగానే తన సోదరుడు ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆరోపించారు. తోటి విద్యార్థులు కూడా సచిన్ కుమార్ ఆత్మహత్యపై దర్యాప్తు జరపాలని కోరారు. దీంతో మాజీ డిజిపి జి తిలగవతి అధ్యక్షతన ఐదుగురు బృందంతో విచారణ కమిటీని నియమించారు. విచారణ జరిపిన ఈ కమిటీ ప్రొఫెసర్ అశీష్ కుమార్ వేధింపుల కారణంగానే సచిన్ ఆత్మహత్యకు పాల్పడ్డారని నిర్ధారించింది. సచిన్ రీసెర్చ్ ఐదేళ్లలో పూర్తి కావాల్సి ఉందని, అశీష్ కుమార్ చర్యల వల్ల ఎనిమిదేళ్లయినా పూర్తికాలేదని కమిటీ గుర్తించింది. ఆత్మహత్యకు ముందు రోజు సచిన్ తన థీసిస్‌ను సమర్పించారని, దానిని రివ్యూ చేయాలని ఒక జూనియర్‌కు అశీష్ కుమార్ అప్పగించడం సచిన్‌ను తీవ్రంగా కలచి వేసిందని కమిటీ తన విచారణలో నిర్ధారించింది.

కలెక్టర్లకు ఇడి సమన్లపై మద్రాస్ హైకోర్టు స్టే

చెన్నై: అక్రమ ఇసుక తవ్వకాలకు సంబంధించి విచారణకు హాజరుకావాలని తమిళనాడులోని ఐదు జిల్లాల కలెక్టర్లకు ఇడి సమన్లు జారీచేయడంపై మద్రాస్ హైకోర్టు స్టే విధించింది. రాష్ట్రంలో ఇసుక అక్రమ తవ్వకాలపై మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి ఇడి విచారణ జరుపుతున్న సంగతి తెలిసిందే.. ఈ సమన్లకు వ్యతిరేకంగా రాష్ట్ర కార్యదర్శి కె.నంతకుమార్, ఐదుగురు కలెక్టర్లు మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటీషన్‌ను మంగళవారం విచారించిన జస్టిస్ ఎస్ఎస్ సుందర్, జస్టిస్ సుందర్ మోహన్‌లతో కూడిన ధర్మాసనం మధ్యంతర స్టే ఇచ్చింది. ఈ పిటీషన్‌పై స్పందించేందుకు ఇడికి మూడు వారాల సమయం ఇచ్చింది.

విచారణకు ఒక రోజు ముందు.. ప్రజారోగ్య బిల్లుపై ఆరిఫ్ ఖాన్ సంతకం

- రాష్ట్రపతి ఆమోదానికి మరో 7 బిల్లులు

తిరువనంతపురం: తనపై సుప్రీంకోర్టులో విచారణకు ఒక రోజు ముందు ప్రజారోగ్య బిల్లుపై కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ సంతకం చేశారు. మరో ఏడు బిల్లులు రాష్ట్రపతి ఆమోదం కోసం పంపారు. లోకాయుక్త చట్టం సవరణ, యూనివర్సిటీ చట్టం సవరణ, సహకార చట్టం సవరణ వంటి బిల్లులను రాష్ట్రపతికి పంపారు. శాసనసభ ఆమోదించిన బిల్లులను సుదీర్ఘకాలం గవర్నర్ పెండింగ్‌లో పెట్టుకోవడాన్ని వ్యతిరేకిస్తూ కేరళ ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు బుధవారం విచారించనుంది. శాసనసభ ఆమోదించిన బిల్లులను గవర్నర్లు నిరవధికంగా నిలుపుదల చేయడాన్ని సుప్రీంకోర్టు ఇటీవల విమర్శించింది.

పంజాబ్ గవర్నర్‌ను విమర్శిస్తూ ఇచ్చిన తీర్పును కేరళ గవర్నర్ చదివితే బాగుంటుందని కోర్టు అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలోనే తమ వద్ద నిలిపివుంచిన ఎనిమిది బిల్లుల్లో ఏడు బిల్లులను రాష్ట్రపతి ఆమోదం కోసం పంపాలని గవర్నర్ నిర్ణయం తీసుకున్నారు. లోకాయుక్త సవరణ బిల్లు, గవర్నర్‌ను ఛాన్సలర్ పదవి నుంచి తొలగించేందుకు యూనివర్సిటీల చట్టంలో రెండు సవరణలు, వైస్‌ఛాన్సలర్ నియామకానికి సంబంధించిన సెర్చ్ కమిటీ బిల్లు, యూనివర్సిటీ అప్పిలేట్ అథారిటీ బిల్లు, సహకార చట్ట సవరణ బిల్లు రాష్ట్రపతికి పంపారు. ఈ విషయాన్ని సుప్రీంకోర్టుకు తెలియజేయాలని రాజ్ భవన్ నిర్ణయించింది. కేరళ ప్రజారోగ్య బిల్లుకు గవర్నర్ ఆమోదం తెలిపారు. ప్రజారోగ్య బిల్లును ఈ ఏడాది మార్చిలో విజయన్ ఆమోదించి, ఏప్రిల్‌లో గవర్నర్ ఆమోదం కోసం పంపారు.

నష్టపరిహార ప్రక్రియలో జోక్యం చేసుకోవద్దు

- మణిపూర్‌లో పౌర సంస్థలను ఆదేశించాలని సుప్రీంకు ప్యానెల్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ : మణిపూర్ హింసలో మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వమిస్తున్న రూ.10 లక్షల నష్టపరిహారాన్ని 38 కుటుంబాలు తిరస్కరించిన నేపథ్యంలో ఈ ప్రక్రియలో జోక్యం చేసుకోకుండా పౌర సంస్థలను ఆదేశించాలని సుప్రీం కోర్టు నియమించిన ప్యానెల్ కోరింది. బాధిత కుటుంబాలను ఒప్పించేందుకు ఒకపక్క జిల్లా యంత్రాంగం ప్రయత్నిస్తుండగా, మరోపక్క ఎక్స్‌గ్రేషియా మొత్తాలను ఆమోదించాల్సిందిగా 38 కుటుంబాలను కోర్టు ఆదేశించాలని ప్యానెల్ కోరింది. జమ్ము కాశ్మీర్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి గీతా మిట్టల్ నేతృత్వంలోని కమిటీ తన నివేదికను అక్టోబరు 21న సుప్రీంకు అందజేసింది. ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ నేతృత్వంలోని బెంచ్ డిసెంబరు 4న ఈ కేసుపై విచారణ జరపనుంది. రాష్ట్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం, అక్టోబరు 7 నాటికి 175 మరణాలు నమోదు కాగా, 169 కేసుల్లో మృతులను గుర్తించారు. వీటిలో 81 మృతదేహాలను బాధిత కుటుంబాలు క్లెయిమ్ చేశాయి. మరో 88 మృతదేహాలను మృతుల బంధువులు క్లెయిమ్ చేయలేదు. మిగిలిన ఆరు మృత దేహాలను కూడా గుర్తించడానికి ప్రయత్నిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం కమిటీకి తెలిపింది. మృత దేహాలను గుర్తించిన 169 కేసుల్లో 73 కేసులకు ప్రత్యక్ష నగదు బదిలీగా నష్టపరిహారం చెల్లించారు. మరో 58 కేసుల్లో వెరిఫికేషన్ పెండింగ్‌లో వుంది, మరో 38 కుటుంబాలు నష్టపరిహారాన్ని తీసుకోవడానికి తిరస్కరించాయి. ఐటిఎల్ఎఫ్, జెపిఓ, కెఐఎం వంటి పౌర సంస్థల నుంచి వస్తున్న ఒత్తిళ్లతోనే ఈ కుటుంబాలు నగదును తీసుకోవడం లేదని కమిటీ పేర్కొంది.

క్రీడలను రాజకీయం చేయొద్దు

- ఉపా కింద విద్యార్థులను అరెస్టును ఖండించిన తరిగామి

జమ్ము : క్రీడలను రాజకీయం చేయొద్దని సిపిఎం నాయకులు ఎంవై తరిగామి విజ్ఞప్తి చేశారు. ఉపా చట్టం కింద యూనివర్సిటీ విద్యార్థులను అరెస్టు చేయడాన్ని ఆయన ప్రశ్నించారు. 'విద్యార్థుల అరెస్టు పూర్తిగా తప్పు. వారిపై ఉపా చట్టం కింద అభియోగాలు మోపడం మరింత అన్యాయం. క్రీడలను రాజకీయం చేయొద్దు' అని తరిగామి అన్నారు. 'భారత క్రికెటర్లకు ఇతర దేశాల్లో ఎంత ఆదరణ ఉంటుందో, ఇతర దేశాల క్రికెటర్లకు కూడా భారత్‌లో అంతే ఆదరణ ఉంటుంది. రాజకీయాలను, క్రీడలను లింక్ చేయడం మంచిది కాదు' అని తెలిపారు. 'వారు (విద్యార్థులు) ఉగ్రవాదులా.. ప్రభుత్వానికి అభ్యంతరం ఉంటే ఇతర చట్టాలు ఉన్నాయి. విద్యార్థులపై ఉపా కింద కేసులు ఎందుకు నమోదు చేయాలి' అని తరిగామి ప్రశ్నించారు. ఈ సందర్భంలో న్యూస్‌క్లిక్ సంపాదకులు ప్రబీర్ పుర్కాయస్థ, హెచ్ఆర్ హెడ్ అమిత్ చక్రవర్తిలను ఉపా చట్టం కింద అరెస్టు చేయడాన్ని కూడా తరిగామి ఖండించారు. ఇటీవల జరిగిన ప్రపంచకప్ ఫైనల్‌లో భారత్ ఓటమితో సంబరాలు చేసుకున్నారని, అభ్యంతరకమైన నినాదాలు చేశారనే ఆరోపణలతో షేర్-ఎ-కాశ్మీర్ యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ (ఎస్‌కెయుఎఎస్‌టి) విద్యార్థులను పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ప్రజల దృష్టిని మరల్చడానికి కేంద్రం విభజన రాజకీయాలకు పాల్పడుతుందని తరిగామి విమర్శించారు.

గాజాలో కాల్పుల విరమణ మరో 48గంటలు పొడిగింపు

- 60శాతానికి పైగా ఇళ్లు ధ్వంసం
- రోజుకు 16లక్షల డాలర్లు నష్టం

గాజా : గాజాలో గత నాలుగు రోజులుగా అమలవుతున్న కాల్పుల విరమణను మరో 48గంటలు పొడిగించారు. ఇరు పక్షాలు ఇందుకు అంగీకరించాయని మధ్యవర్తి ఖతార్ తెలిపింది. దీంతో ఇరు పక్షాల ఆధీనంలో వున్న బందీలు మరింత మంది విడుదలవుతారనే ఆశలు నెలకొన్నాయి. మరోవైపు కాల్పుల విరమణ మరింతగా పొడిగించే అవకాశాలు వుండవచ్చనే అంచనాలు, ఆశలు కూడా పెరిగాయి. దీనివల్ల గాజాలోకి మరింతగా మానవతా సాయం అందుతోంది. నాల్గవ రోజు బందీల మార్పిడిలో భాగంగా 33మంది పాలస్తీనియన్ ఖైదీలు ఇజ్రాయిల్ జైళ్ల నుండి విడుదలయ్యారు. వారు మంగళవారం తెల్లవారు జామున తూర్పు జెరూసలేం, వెస్ట్ బ్యాంక్ పట్టణమైన రమల్లాకు చేరుకున్నారు. మరోవైపు హమాస్ విడుదల చేసిన 11మంది ఇజ్రాయిలీ మహిళలు, పిల్లలు సోమవారం రాత్రికి ఇజ్రాయిల్‌లోకి ప్రవేశించారు. వీరిని తరలించేందుకు ఏర్పాట్లు చేసినట్లు రెడ్ క్రాస్ తెలిపింది. హమాస్ సైనిక సామర్థ్యాలను అణచివేయడానికే తాము కట్టుబడి వున్నట్లు ఇజ్రాయిల్ మరోసారి ప్రకటించింది. గాజాలో 16ఏళ్ల హమాస్ పాలనకు ముగింపు పలుకుతామని చెప్పింది.

క్రమిత వెస్ట్ బ్యాంక్‌లో ఇజ్రాయిల్ సైనికులు ఇద్దరు పాలస్తీనియన్లను చంపేశారు. ఇప్పటివరకు గాజాలో 15వేల మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారు. తూర్పు జెరూసలేంతో సహా వెస్ట్ బ్యాంక్‌లో ఇప్పటివరకు 231మంది పాలస్తీనియన్లు మరణించారని ఐక్యరాజ్య సమితి మానవతా కార్యకలాపాల సహాయ కార్యాలయం (ఒసిహెచ్ఎ) వెల్లడించింది.

కాల్పుల విరమణ జరగడంతో గాజాలో చోటు చేసుకున్న విధ్వంసానికి సంబంధించిన వివరాలు వెల్లడవుతున్నాయి. గాజాలో ఆరోగ్య వ్యవస్థను తక్షణమే పునరుద్ధరించని పక్షంలో మరింతమంది మరణించే అవకాశముందని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించింది. అల్‌షిఫా అస్పత్రిలో డయాలసిస్ యూనిట్‌ను పునరుద్ధరించారని, రోగులను కూడా చేర్చుకుంటున్నామని ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. గాజాలో సుదీర్ఘకాలం కాల్పుల విరమణ ఆమలు చేయాలని, మొత్తంగా బందీలందరినీ విడుదల చేయాలని యుఎన్ చీఫ్ కోరారు.

గాజా వ్యాప్తంగా 60శాతానికి పైగా ఇళ్లు ధ్వంసమయ్యాయని ఐక్యరాజ్య సమితి తన కొత్త నివేదికలో తెలిపింది. ఇజ్రాయిల్ బాంబు దాడుల కారణంగా మొత్తంగా ఉత్పత్తి స్తంభించిపోయిందని, ఫలితంగా రోజుకు 16లక్షల డాలర్లు నష్టం జరిగిందని పాలస్తీనా కేంద్ర గణాంకాల బ్యూరో వెల్లడించింది. వ్యవసాయ పరికరాలు, వేలాదిగా వృక్షాలు, పొలాల విధ్వంసాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటే ఈ నష్టాలు ఇంకా ఎక్కువగానే వుంటాయని బ్యూరో తెలిపింది.

ఆరోగ్య సంరక్షణ కార్యకర్తలకు చట్టపరమైన రక్షణ కల్పించాలి

- ప్రభుత్వాన్ని కోరిన పార్లమెంటరీ కమిటీ

న్యూఢిల్లీ : చికిత్స పొందుతూ రోగులు చనిపోయినప్పుడు వారి బంధువులు, అటెండెంట్ల నుండి దాడులను, హింసను ఎదుర్కొంటున్న ఆరోగ్య సంరక్షణ కార్యకర్తలకు సముచితమైన రీతిలో చట్టపరమైన ఆరోగ్య రక్షణలను ప్రవేశపెట్టే విషయాన్ని ప్రభుత్వం పరిశీలించాలని బిజెపి సభ్యుడు బ్రిజ్‌లాల్ నేతృత్వంలో హోం వ్యవహారాలపై పార్లమెంటరీ స్థాయీ సంఘం కోరింది. ప్రతిపాదిత మూడు క్రిమినల్ చట్టాలను పరిశీలించిన, వివిధ వైద్య సమాఖ్యలు, సంఘాలు అందజేసిన మెమొరాండాలపై చర్చించిన ఈ స్థాయీ సంఘం ఆరోగ్య కార్యకర్తలకు చట్టపరమైన రక్షణలు కల్పించాలంటూ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ఈ మేరకు కమిటీ తన నివేదికను అందజేసింది. ఆరోగ్య సేవలందించే సిబ్బందిపై హింసకు దిగడం వంటి చర్యలకు శిక్ష విధించేలా భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్)లోని 115వ క్లాజు కింద నిబంధనలను ప్రవేశపెట్టాలని వివిధ వైద్య సంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ఆరోగ్య సంరక్షణ కార్యకర్తలపై ఇలాంటి హింసాత్మక దాడులు దేశమంతా జరుగుతునే వున్నాయి. ఈ నేపథ్యంలో కార్యకర్తల ప్రయోజనార్థం కొన్ని చట్టపరమైన రక్షణలు ఏర్పాటు చేయాల్సిన అవసరం వుందని వైద్య సమాఖ్యలు కమిటీని కోరాయి. సాధారణ శిక్షార్హమైన నిబంధనలు అందరికీ వర్తిస్తాయని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. డాక్టర్లు, ఇతర ఆరోగ్య సిబ్బందికి ప్రత్యేక నిబంధనలు రూపొందిస్తే ఇతర వర్గాల నుండి ఇదే రకమైన డిమాండ్లు రావచ్చని హోం శాఖ పేర్కొంది. హింసాత్మక దాడులను ఎదుర్కొనే ఆరోగ్య సంరక్షణ కార్యకర్తల కోసం మెడికల్ ప్రొఫెషనల్స్ యాక్ట్‌ను ప్రవేశపెట్టాలని ఆరోగ్య శాఖ ఒక ప్రతిపాదన పెట్టిందని, ప్రభుత్వం తగు చట్టపరమైన రక్షణలు కల్పించగలదని ఆశిస్తున్నామని కమిటీ అభిప్రాయపడింది.

ఆచారాల ప్రకారం అంత్యక్రియలు పూర్తి చేయండి

రాష్ట్రప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ : మణిపూర్ హింసాకాండలో మృతి చెందిన వ్యక్తుల మృతదేహాలకు త్వరగా అంత్యక్రియలను పూర్తి చేయాలని సుప్రీంకోర్టు మంగళవారం స్పష్టం చేసింది. అంత్యక్రియలను నిర్వహించడానికి మృతుల బంధువులకు అనుమతించింది. మృతదేహాలను ఇంకా మార్చురీలో ఉంచడం సముచితం కాదని ధర్మాసనం పేర్కొంది. వారు (మృతులు) గౌరవప్రదమైన వీడ్కోలుకు అర్హులని పేర్కొంది. డిసెంబరు 4లోగా అంత్యక్రియలను నిర్వహించాలని ఆదేశించింది. మే 3 నుంచి జరిగిన మణిపూర్‌లో హింసాకాండలో మరణించిన 175 మంది మృతదేహాలను వివిధ మార్చురీల్లో భద్రపరిచారు. వాటికి అంత్యక్రియల విషయంలో వివాదం నెలకొంది. అంత్యక్రియలు చేసే ప్రాంతంపై కొన్ని పౌర సంఘాలు వివాదం రేపుతున్నాయి. ఈ అంశంపై పౌర సంఘాలకు ఎలాంటి హక్కు ఉండదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. బంధువులు వారి మత అచారాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించుకోవచ్చునని తెలిపింది. అంత్యక్రియల్లో మూడో పక్షం జోక్యానికి తావులేకుండా భద్రతా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ అధికారులను ఆదేశించింది.

ప్రచారానికి తెర... ప్రలోభాల ఎర

(మొదటి పేజీ తరువాయి)

పార్టీల అగ్ర నాయకులంతా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.

ఈ ఎన్నికల్లో ఒంటరిగా బరిలోకి దిగిన సిపిఎం 19 నియోజకవర్గాల్లో పోటీలో ఉంది. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుంచీ పార్టీ శ్రేణులు ప్రజల్లోకి వెళ్లాయి. స్థానిక సమస్యలే అజెండాగా సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధి నినాదంతో సిపిఎం విస్తృత ప్రచారం చేసింది. కళా జాతాలు, ఉద్యమ గేయాలతో నిర్వహించిన సిపిఎం అభ్యర్థుల ప్రచారానికి ప్రజల నుంచి మంచి ఆదరణ లభించింది. కరపత్రాలు, సోషల్ మీడియా ప్రచారంలో సిపిఎం ముందుంది. సిపిఎం తరుపున ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్ బ్యూరో సభ్యులు బృందా కరత్, బివి.రాఘవులు, విజయ రాఘవన్, సుభాషిణి అలీ, త్రిపుర మాజీ సిఎం మాణిక్ సర్కార్ తదితరులు ప్రచారం నిర్వహించి బహిరంగ సభల్లో ప్రసంగించారు. రోడ్ షోలు నిర్వహించారు. సిపిఐ తరుపున ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా, నాయకులు అజీజ్ పాషా, నారాయణ, చాడ వెంకటరెడ్డి తదితరులు ప్రచారం చేశారు.

బిఆర్ఎస్ నుంచి సిఎం కెసిఆర్, మంత్రులు కెటిఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవిత రాష్ట్రమంతటా పర్యటించారు. కెసిఆర్ మొత్తం 96 సభల్లో పాల్గొన్నారు. మంత్రి కెటిఆర్ 60 రోజుల్లో 30 పబ్లిక్ మీటింగ్‌లు, 70 రోడ్ షోలు, 30కి పైగా ప్రత్యేక ఇంటర్వ్యూలు, 150కి పైగా టెలికాన్ఫరెన్స్‌లు నిర్వహించారు.

మంత్రి హరీశ్ రావు 60 రోజుల్లో 80కి పైగా సభలు, రోడ్ షోల్లో పాల్గొని బిఆర్ఎస్ అభ్యర్థుల తరుపున ప్రచారం చేశారు. బిఆర్ఎస్ పార్టీ ప్రచారంలో ప్రధానంగా కాంగ్రెస్ పార్టీనే టార్గెట్ చేసింది. కాంగ్రెస్ పార్టీ ప్రచారాన్ని ఆలస్యంగా ప్రారంభించినా ఆ పార్టీ అగ్ర నాయకత్వం మొత్తం తెలంగాణపై దృష్టి కేంద్రీకరించింది. సెప్టెంబర్ 17న తుక్కుగూడ సభలో సోనియా గాంధీ ఆరు గ్యారెంటీలు ప్రకటనతో మొదలైన కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం మల్కాజ్‌గిరిలో రాహుల్ గాంధీ రోడ్ షోతో ముగిసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పది సభలు, రాహుల్ గాంధీ 23 సభలు, ప్రియాంక గాంధీ 26 సభలు, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య 3 సభలు, ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ 10 సభలు, ఛత్తీస్‌గఢ్ సిఎం భూపేష్ భఘేల్ 4 సభలు, రాజస్థాన్ సిఎం అశోక్ గెహ్లాట్ 3 సభల్లో పాల్గొన్నారు. ప్రచారం చివరి రోజు సోనియా గాంధీ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. 'దొరల తెలంగాణను ప్రజల తెలంగాణగా మార్చుకుందాం. తెలంగాణ ప్రజల స్వప్నాలు సాకారం కావాలి. ఈసారి మీరంతా సర్వశక్తులు ఒడ్డి మార్పు తీసుకురావడానికి కృషి చేయండి. మార్పు కావాలి. కాంగ్రెస్ రావాలి' అని ఈ సందేశంలో తెలంగాణ ప్రజలను కోరారు. టిపిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి 55 సభల్లో పాల్గొన్నారు.

తెలంగాణపై బిజెపి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ఆ పార్టీ నేతలందరినీ రంగంలోకి దింపింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మొత్తం 5 రోజులు 8 సభలతోపాటు హైదరాబాద్‌లో రోడ్ షోలో పాల్గొన్నారు. అమిత్ షా 8 ఎనిమిది రోజుల పాటు ఎన్నికల ప్రచారంలో పాల్గొని 17 సభలు, 7 రోడ్ షోలలో ప్రసంగించారు.

బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా 5 రోజులపాటు 8 సభలు, 3 రోడ్ షోలలో పాల్గొన్నారు. రాజనాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, నిర్మలా సీతారామన్, పీయూష్ గోయల్, అనురాగ్ సింగ్ ఠాకూర్, ముఖ్యమంత్రులు యోగి ఆదిత్యానాథ్, ప్రమోద్ సావంత్, ఏక్‌నాథ్ శిండే, హిమంత విశ్వశర్మ తదితరులు పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బిజెపి అభ్యర్థుల తరుపున ప్రచారం నిర్వహించారు. ప్రచార పర్వం ముగియడంతో ప్రధాన రాజకీయ పార్టీలన్నీ పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి పెట్టాయి.

మీ కోసం
వెండి సామగ్రి, ఆభరణాలు ఉంచేచోట కర్పూరం బిళ్లలను ఉంచితే అవి నల్లబడకుండా ఉంటాయి.

జీవన సారథం
మనం చేసే పనులవల్లే, గొప్పవాళ్లమవుతాం, పుట్టుకతో కాదు.

వ్యవసాయం

అనగనగా సీతారాంపూర్ అనే ఊరిలో సాంబయ్య, లక్ష్మి అనే దంపతులు ఉండేవారు. వారి కొడుకు రాహుల్ ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. రాహుల్ తండ్రి సాంబయ్య అప్పుడప్పుడు దిగులుతో ఉంటున్నాడు. తండ్రి దిగులును గమనించిన రాహుల్ 'ఏమైందని' ఎంత అడిగినా సమాధానం చెప్పేవాడు కాదు.

కొన్ని రోజులకు, తమ కొద్దిపాటి పొలంలో వ్యవసాయం సాగడం లేదన్న కారణంగానే తండ్రి బాధపడుతున్నాడని రాహుల్ గమనించాడు. కానీ, ఏం చేయాలో తెలియక బాధపడ్డాడు. ఒక రోజు రాహుల్ క్లాస్‌లో సైన్సు మాస్టారు వ్యవసాయం పాఠం చెప్పారు. పంటమార్పిడి వల్ల లాభాలు అర్థమయ్యేలా వివరించారు. ఇదే విషయాన్ని రాహుల్, తన తండ్రితో చెప్పాడు. ఈసారి పంట మార్పిడిలో భాగంగా కూరగాయల సాగు చేయమని సలహా ఇచ్చాడు.

కొడుకు మాటలు విన్న సాంబయ్య మొదట ఆశ్చర్యపోయినా, ఆ తరువాత మాస్టారు చెప్పినట్లు కూరగాయల సాగు చేసి లాభం పొందాడు. పంటమార్పిడి చేస్తూ మరుసటి ఏడాది వరి పంట వేస్తే దిగుబడి బాగా వచ్చింది. సాంబయ్య కుటుంబం చాలా సంతోషించింది. చిన్నవాడైనా రాహుల్ సూక్ష్మ బుద్ధికి వాళ్లమ్మ ఎంతో మురిసిపోయింది. ఊర్లోని ప్రజలు కూడా సాంబయ్య వలే పంట మార్పిడి చేస్తూ అధిక లాభాలు పొందసాగారు.

- చెప్యాల శరణ్య, 8వ తరగతి, జెడ్‌పిహెచ్ఎస్, హవేలీ ఘనపూర్, మెదక్ జిల్లా. 70362 77957

లెక్క చేయండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని పండ్లను అంకెలుగా గణించి లెక్క చేశాం. చివరి వరుస సమాధానం మీరు రాబట్టండి.



నేను గీసిన బొమ్మ

దేవులపల్లి శ్రీ వర్షు, నంగునూర్, సిద్దిపేట జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

వన భోజనాలకు వెళుతున్నారా?

కార్తీకమాసంలో వనభోజనాలు, జనసమూహాల సందళ్లు కనువిందుగా సాగుతాయి. పండుగలు, పబ్బాలకో.. జాతరలు, ఉత్సవాలు జరిగినప్పుడో ఒకచోట కలిసే జనం మరొక్కసారి ఏకమయ్యే ఆహ్లాద సందర్భాలివి! నిత్యం ఎన్నో సంఘర్షణలతో తలమునకలౌతూ ఉండే మనుషులకు కాస్తంత విరామం, వినోదం కావాలి. ఆధునిక సమాజంలో వినోద మాధ్యమాలకేం కొదవ లేదు. అయితే అవన్నీ తాత్కాలిక ఆనందాలే! ఒక్క క్షణమో, ఒక్క రోజో గుర్తుండిపోయే అల్ప సంతోషాలు. అదే, ఏడాదిలో ఒక్కరోజు నిర్వహించుకునే ఈ వనభోజనాలకు ప్రణాళికాబద్ధంగా సమాయత్తమైతే, ఆ ఆనంద క్షణాలు ఏడాది పొడుగునా గుర్తుంటాయి.

ముందుగా ప్లాన్ చేసుకోండి..

వనభోజనాలకు సిద్ధమయ్యే కుటుంబాలు ముందుగా అంటే నిర్దేశించుకున్న రోజుకు ఓ పదిరోజుల ముందే ఏ ప్రాంతాలు అనువుగా ఉంటాయో ఆలోచించాలి. వాటిలో అందరూ ఇష్టపడే ప్రాంతం ఎంచుకోవాలి. అక్కడి వాతావరణంపై కాస్తంత అవగాహన ఉన్న వారి అభిప్రాయం తప్పక తీసుకోవాలి. అప్పుడే అక్కడి సదుపాయాల్లో లోటుపాట్లు తెలుస్తాయి. అలాగే బృందంలో ఇద్దరు లేదా ముగ్గురు కలసి ఆ ప్రాంతాన్ని ఒకసారి చూసి వస్తే మేలు. అలా చేస్తే, రోడ్డు పరిస్థితులు, రవాణామార్గంలో ఎదురయ్యే సమస్యలపై ఒక అవగాహన వస్తుంది. అలాగే ఆ ప్రాంతం అనువైనదీ లేనిదీ ప్రత్యక్షంగా తెలుసుకోవచ్చు. అన్ని వయసుల వారితో పెద్ద సంఖ్యలో వెళుతున్నప్పుడు జలపాతాలు, నదీ ప్రవాహాలు, సముద్ర తీరాలను ఎంచుకోకుండా ఉంటేనే మంచిది. ఒకవేళ అలాంటి ప్రదేశాలకే వెళ్లాల్సి వస్తే - పిల్లలు, యువకులు ప్రమాదాలు కొని తెచ్చుకోకుండా తగిన జాగ్రత్త వహించాలి.

వంటావార్పుపై ప్రత్యేక శ్రద్ధ

వనభోజనాల్లో ఎక్కువగా వంట మాస్టర్లను మాట్లాడుకుని అక్కడే వంటలు చేయిస్తుంటారు. వారు, ఉదయం మొదలుపెట్టి, మధ్యాహ్నానికి వంట పూర్తిచేసి, నిర్వాహకులకు అప్పజెప్పి వెళ్లిపోతుంటారు. ఎంతమందికి భోజనాలు అవసరమో ముందుగానే అంచనా వేసుకొని వండించాలి. అలాగే ఆహారపదార్థాలు వృధా కాకుండా జాగ్రత్తపడాలి. వండివార్చేవారు కార్యక్రమం పూర్తయ్యేవరకు అక్కడే ఉండేలా ప్రణాళిక వేసుకోవాలి. ఒకవేళ ఆహారం మిగిలిపోతే దాన్ని ఏం చేయాలో కూడా ముందే ఆలోచించాలి. ఆ ఆహారాన్ని సమీపంలోని అనాథ శరణాలయాల్లోనో, వసతి గృహాల్లోనో ఇచ్చేలా ప్రణాళిక వేసుకోవాలి.

ఆటపాటల్లో అందరూ ఉండాలి

ఈ వనభోజనాల్లో ఆటపాటలది ప్రత్యేకస్థానం. నిర్వాహకులు రకరకాల ఆటలపోటీలు నిర్వహిస్తుంటారు. వీటిలో అందరూ పాల్గొనేలా చూడాలి. చిన్న పిల్లలు ఆడే ఆటలు, పెద్దలు భాగస్వామ్యమయ్యేవి, వృద్ధులు చొరవ చూపేవి ఉండేలా చూసుకోవాలి. అప్పుడే వన విహారం అందరికీ మధురజ్ఞాపకంగా మిగిలిపోతుంది. అయితే వినోదం పంచే కార్యక్రమాలుగా వెగటు పుట్టించే జబర్దస్త్ వంటి వాటి జోలికి వెళ్లకపోవడం మంచిది. అలాగే పిల్లలు ఆస్వాదించేలా ఏదైనా మ్యాజిక్ షో ఏర్పాటు చేస్తే ఎంజాయ్ చేస్తారు. అందరినీ ఆనంద పరచడమే లక్ష్యంగా ఉండాలి.

ఏం తీసుకెళ్లాలి?

ఏం తీసుకెళ్లాలి? ఎన్ని తీసుకెళ్లాలి? అనే వాటిపై కూడా అవగాహనకు రావాలి. అంటే ఆటలు, ఇతర కార్యక్రమాలకు వెంట తీసుకెళ్లే వస్తువులను ఒక జాబితా తయారు చేసుకోవాలి. వాటి నిర్వహణను ఉత్సాహవంతమైన యువతకు అప్పగిస్తే బాధ్యత నేర్పిన వారవుతారు. అలాగే చిన్నపిల్లలు, మహిళలు, పురుషులు, వృద్ధులు ఇలా వయసుల వారీగా, గ్రూపులను విడగొట్టుకోవాలి. ఆ గ్రూపుల బాధ్యతను ఒక్కొక్క వ్యక్తికి కాక, బృంద సభ్యులకి అప్పగించాలి. ఆ బృందంలో తమకు అప్పగించిన సభ్యులు అందరూ పాల్గొనేలా చూడడానికి ఒకరు, ఆటసామగ్రి నిర్వహణకు మరొకరు, విజేతలను ప్రకటించే సభ్యులు, ఇలా వెసులుబాటును బట్టి బాధ్యతలు పంచుకోవాలి. అప్పుడు నిర్వహణ తేలిక అవుతుంది. అందరూ పాల్గొనే అవకాశం వస్తుంది.

అవసరాలను గుర్తించాలి

మరుగుదొడ్ల నిర్వహణ, నీటి వసతిపై శ్రద్ధ పెట్టాలి. చిన్నపిల్లలకు ఉపయోగపడే డ్రైపర్లు, శానిటరీ ప్యాడ్లను కూడా సామగ్రిలో భాగం చేసుకోవాలి. ఎవరికి వారే తెచ్చుకున్నా, అత్యవసరాలప్పుడు పనికివస్తాయి. అలాగే జలుబు, దగ్గు, కీళ్లనొప్పుల టాబ్లెట్లు, వాంతులు, విరేచనాల టాబ్లెట్లు, గ్యాస్ టాబ్లెట్లు, గుండెపోటు నివారణకు పనికివచ్చే ఆస్పిరిన్ టాబ్లెట్లు, సిపిఆర్ కిట్ వెంట తీసుకెళ్లడం శ్రేయస్కరం.

అతివేగం వద్దు..

బైక్, ఆటో, వ్యాన్, బస్‌ల్లో వనభోజనాలకు చేరుకుంటుంటారు. ఈ ప్రయాణాల్లో చాలా జాగ్రత్తలు పాటించాలి. అతివేగం వద్దు. వాహనాల బ్రేక్‌లు, కండిషన్ ఒకసారి సరిచూసుకోవాలి. అనుభవం ఉన్న డ్రైవరును ఎంచుకోవాలి. ఒక్కోసారి ఎంత అనుభవం ఉన్నా, అలసత్వం ప్రమాదాలకు కారణమవుతుంది. కాబట్టి ఎప్పుడూ జాగరూకతతో ఉండాలి. సమయం మించిపోయిందని, గమ్యానికి త్వరగా చేరాలని, వేగంగా వెళ్తున్న డ్రైవర్లను హెచ్చరించాలి.

చెత్త సేకరణపై దృష్టి పెట్టాలి

భోజనాలకు ఉపయోగించిన ప్లేట్లు, గ్లాసులు, ఇతర సామగ్రిని ఎక్కడపడితే అక్కడ పారేయకుండా చూడాలి. చెత్త సేకరణ డబ్బాల్లో నిల్వచేసి దూరంగా పారేయాలి. వనాలు, తోటలు లాంటివైతే మొక్కలు, చెట్లకు హానిచేయకుండా ఉండాలి. సాధరణంగా ఇలాంటిచోట కోతుల బెడద ఎక్కువగా ఉంటుంది. వాటి నుండి రక్షణ కోసం ముందుగానే జాగ్రత్త వహించాలి.

మధుర జ్ఞాపకంగా..

ఊరు ఊరంతా ఏకమై చేసుకునే జాతర కంటే, ఇంటిల్లిపాది పాల్గొనే పండగ కంటే ఈ వనభోజనాలు ఎంతో ప్రత్యేకమైనవి. పేద, ధనిక తారతమ్యం లేకుండా, చిన్నా, పెద్దా ఆస్వాదించేవి. కుల మతాలకు తావివ్వకుండా, విద్వేష చర్చలు రానీయకుండా జరుపుకునేవి. ఆహ్లాద వాతావరణంలో ఆత్మీయతలు, అనుబంధాలు వెల్లివిరిసేవి. అన్ని జాగ్రత్తలతో, అందరి భాగస్వామ్యంతో వన భోజనాలు మధురజ్ఞాపకంగా మిగిలిపోవాలి.

ర్యాట్ హోల్ మైనర్లే.. హీరోలు

దెహ్రాడూన్ : ఉత్తర్‌కాశీలోని సొరంగంలో చిక్కుకుపోయిన 41 మంది కార్మికులను బయటకు తీసుకుని రావడంలో ర్యాట్ హోల్ మైనర్లే హీరోలుగా నిలిచారు. కార్మికులను బయటకు తీసుకొచ్చేందుకు ఎన్‌డిఆర్‌ఎఫ్, ఇతర రెస్క్యూ బృందాలు అనేక మార్గాల్లో తీవ్ర ప్రయత్నాలు చేసిన సంగతి తెలిసిందే. భారత మిషన్లతోపాటు అమెరికా నుంచీ తీసుకొచ్చిన అత్యాధునిక మెషిన్లు కూడా డ్రిల్లింగ్‌లో ధ్వంసమయ్యాయి. ఇలాంటి సమయం లో ర్యాట్ హోల్ మైనర్లు అత్యంత ప్రమాదకరమైన విధానంలోనే సొరంగంలో చిక్కుకున్న కార్మికులను బయటకు తీసుకొచ్చి కార్మికులకు కొత్త జీవితం అందించారు. ఢిల్లీ, ఝాన్సీ నుంచి వచ్చిన ఈ మైనర్లు కేవలం 24 గంటల్లోనే వాయువేగంతో డ్రిల్లింగ్ పూర్తిచేశారు. ఈ ఆపరేషన్ తరువాత ర్యాట్ హోల్ మైనర్లు మీడియాతో మాట్లాడారు. 'మేం 15 మీటర్లు తొలిచి సొరంగంలోకి చేరుకున్నాం. అక్కడ కార్మికులను చూడగానే చాలా సంతోషంగా అనిపించింది' అని తెలిపారు. కార్మికులు మమల్ని హత్తుకున్నారని, బాదం పప్పులు ఇచ్చారని ర్యాట్ హోల్ మైనర్లు తెలిపారు.

అసలు ర్యాట్ హోల్ మైనింగ్ అంటే..

సమాంతరంగా సన్నని గుంతలు తవ్వుతూ బొగ్గును బయటకు తీసే పద్ధతినే ర్యాట్ హోల్ మైనింగ్‌గా వ్యవహరిస్తారు. ఇలా నేలలో ఇరుకైన గుంతలను తవ్వడాన్నే ర్యాట్ హోల్‌గా పేర్కొంటారు. ఇది సుమారు నాలుగు అడుగుల వెడల్పుతో మాత్రమే ఉంటుంది. కేవలం ఒక్క మనిషి మాత్రమే వెళ్లగలడు. ఈ క్రమంలో నిర్దేశిత బొగ్గు పొరను చేరుకున్న తర్వాత.. బొగ్గును వెలికి తీసేందుకు సొరంగ మార్గాన్ని ఏర్పాటు చేసుకుంటారు. పార, తదితర ప్రత్యేక పనిముట్లతో చేతుల ద్వారానే తవ్వకం చేపడతారు. తాళ్లు, అవసరమైతే నిచ్చెనల సాయంతో వెళ్లి కొద్ది కొద్దిగా తవ్వుకుంటూ.. ఆ శిథిలాలను కొంత దూరంలో డంప్ చేస్తారు. అక్కడినుంచి ట్రాలీ ద్వారా బయటకు తరలిస్తారు. అత్యంత పలుచటి భూపొరలుండే మేఘాలయ వంటి ప్రాంతాల్లో చేసే మైనింగ్‌లో ఈ పద్ధతిని ఎక్కువగా ఉపయోగిస్తుం టారు. ఇతర సాంకేతికతలతో పోలిస్తే ఖర్చు తక్కువగా ఉండటంతో పలు ప్రాంతాల్లో దీన్నే ఎక్కువగా ఎంచుకుంటారు.

ప్రస్తుతం ఉత్తరాఖండ్‌లో మాత్రం 80 సెంటీ మీటర్ల వ్యాసార్థం గల పైపు ద్వారా నిపుణులు లోపలికి వెళ్లి తవ్వకాలు చేపట్టారు. పైపులైన్‌లో లైట్లు, ఆక్సిజన్ అందించే ఏర్పాటు చేశారు. ర్యాట్ హోల్ మైనింగ్‌పై అనేక విమర్శలు, వివాదాలూ ఉన్నాయి. ఈ విధానంలో గనుల్లోకి వెళ్లే కార్మికులకు భద్రత లేకపోవడం ప్రధాన సమస్య. వర్షాలు వచ్చినప్పుడు అవి నీటితో నిండిపోవడం వంటివి ప్రతికూల అంశాలు. దీంతో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్.. 2014 లో దీన్ని నిషేధించింది. నిషేధించిన టెక్నిక్‌ను ఎలా వాడారని అధికారులను ప్రశ్నించగా, అత్యవసర పరిస్థితుల్లో ఇటువంటివి వాడుకోవడం తప్పేమీ కాదని సమాధానమిచ్చారు.

సొరంగం తవ్వకాలు సాగిన తీరిలా !

నవంబరు 12న కొండచరియ విరిగిపడడంతో ఉత్తరకాశీ జిల్లాలోని యమునోత్రి రహదారిపై సిల్క్‌యారా వద్ద నిర్మిస్తున్న సొరంగంలో 41మంది కార్మికులు చిక్కుకుపోయారు.

- ♦ సమాచారం తెలిసిన వెంటనే లోపల వున్నవారిని వెలికి తీసే కార్యక్రమం ఆరంభించారు. డెహ్రాడూన్ నుండి వచ్చిన ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు స్థానిక పోలీసులు, జిల్లా యంత్రాంగం సాయంతో రంగంలోకి దిగాయి.
- ♦ సొరంగంలోని శిథిలాలను తొలగించేందుకు ముందుగా జెసిబిని దింపారు. కానీ పైనుండి శిథిలాలు పడుతుండడంతో ఆ ప్రయత్నం విజయవంతం కాలేదు. దాంతో డెహ్రాడూన్ నుండి ఆగర్ యంత్రాన్ని రప్పించి డ్రిల్లింగ్ మొదలుపెట్టారు.
- ♦ అయితే ఇది కూడా విఫలమైంది. సొరంగంలో 50మీటర్లు డ్రిల్లింగ్ తర్వాల ఇనుప పట్టీ అడ్డు రావడంతో యంత్రం పనిచేయలేదు. హైదరాబాద్ నుండి ప్లాస్మా కట్టర్‌ను తీసుకువచ్చారు. ఆగర్ యంత్రాన్ని కట్ చేసి 57 మీటర్ల వరకు తవ్వారు.
- ♦ 16వ రోజున ఇంకో రెండు మీటర్ల దూరంలో లక్ష్యం వుందనగా, ర్యాట్ హోల్ మైనర్లతో మాన్యువల్ డ్రిల్లింగ్ చేపట్టారు. మంగళవారం రాత్రి 9గంటల కల్లా మొత్తంగా 41మందినీ బయటకు తీసుకువచ్చారు.
- ♦ ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్, బిఆర్‌ఓ, ఆర్‌విఎన్‌ఎల్, ఎస్‌జెవిఎన్‌ఎల్, ఓఎన్‌జిసి, ఐటిబిపి, ఎన్‌హెచ్‌ఎఐడిసిఎల్, టిహెచ్‌డిసి, ఉత్తరాఖండ్ ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, భారత ఆర్మీ, వైమానిక దళంతో సహా పలు సంస్థలు, అధికారులు, ఉద్యోగులు ఈ రెస్క్యూ ఆపరేషన్‌లో కీలక పాత్ర పోషించారు.

మ్యాక్స్‌వెల్ మెరుపు శతకం

- భారీ లక్ష్యాన్ని ఛేదించిన ఆసీస్
- గైక్వాడ్ సెంచరీ వృథా
- మూడో టి20లో ఐదు వికెట్ల తేడాతో ఓడిన టీమిండియా

మ్యాక్స్‌వెల్(104నాటౌట్; 48బంతుల్లో 8ఫోర్లు, 8సిక్సర్లు)

గౌహతి: ఆస్ట్రేలియా బ్యాటర్ మ్యాక్స్‌వెల్ బ్యాట్‌నుంచి మరోసారి పరుగుల వరద పారింది. ఆసీస్ జట్టు చివరి 12బంతుల్లో 45పరుగులు చేయాల్సిన దశలో మ్యాక్స్‌వెల్(104నాటౌట్; 48బంతుల్లో 8ఫోర్లు, 8సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగి మ్యాచ్‌ను ముగించిన తీరు అత్యద్భుతం. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారతజట్టు నిర్ణీత 20 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 222పరుగుల భారీ స్కోర్‌ను నమోదు చేసింది. రుతురాజ్ గైక్వాడ్ (123నాటౌట్; 57బంతుల్లో 13ఫోర్లు, 7సిక్సర్లు) సెంచరీతో కదం తొక్కాడు. ఛేదనలో భాగంగా ఆసీస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 225 పరుగులు చేసి గెలిచింది. చివరి ఓవర్లో గెలుపుకు 21పరుగులు చేయాల్సిన దశలో మ్యాక్స్‌వెల్ ఫోర్లు, సిక్సర్లతో మ్యాచ్‌ను ముగించాడు. అలాగే ఆసీస్ బౌలర్ మ్యాక్స్‌వెల్ ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో 30 పరుగులు సమర్పించుకొని ఓ చెత్త రికార్డును నమోదు చేశాడు. ఈ రికార్డు ఇంతకుముందు బ్రెట్ లీ(ఆస్ట్రేలియా) పేరిట 2009లో ఉంది. వెస్టిండీస్‌పై అతడు చివరి ఓవర్లో ఏకంగా 27 పరుగులు సమర్పించుకోగా.. తాజాగా మ్యాక్స్‌వెల్ 30సమర్పించుకొన్నాడు.

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్ జైస్వాల్(6), ఇషాన్(0) నిరాశపరిచారు. దీంతో భారతజట్టు 24పరుగులకే 2వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. జైస్వాల్ (6).. బెరెన్‌డార్ఫ్ వేసిన రెండో ఓవర్లో వికెట్ కీపర్ వేడ్‌కు క్యాచ్ ఇవ్వగా.. ఆ మరుసటి ఓవర్లోనే ఇషాన్ కిషన్ (0)ను కేన్ రిచర్డ్‌సన్ బౌలింగ్‌లో కవర్స్ దిశగా ఆడబోయి స్టొయినిస్ చేతికి చిక్కాడు. ఆ దశలో రుతురాజ్ గైక్వాడ్(123నాటౌట్; 57బంతుల్లో 13ఫోర్లు, 7 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడాడు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్(39), తిలక్ వర్మ(31 నాటౌట్) కూడా బ్యాట్ ఝుళిపించడంతో టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 222 పరు గుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. రిచర్డ్సన్, బెహ్రెన్‌డార్ఫ్, హార్డీకి ఒక్కో వికెట్ దక్కాయి.

భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఆసీస్ ఓపెనర్ హెడ్(35) రాణించినా.. హార్డీ(16), ఇంగ్లీ(10), స్టొయినీస్(17) నిరాశపరిచారు. ఆ తర్వాత టిమ్ డేవిడ్(0) కూడా డకౌట్ కావడంతో ఆ జట్టు 134 పరుగులకే 5వికెట్లు కోల్పోయి ఓటమికోరల్లో నిలిచింది. క్రమంలో కెప్టెన్ మాథ్యు వేడ్(28నాటౌట్; 16 బంతుల్లో 3ఫోర్లు, సిక్సర్) సాయంతో మ్యాక్స్‌వెల్ (104) సెంచరీతో కదం తొక్కాడు. రవి బిష్ణోయ్‌కు రెండు, అర్ష్‌దీప్, ఆవేశ్‌ఖాన్, అక్షర్ పటేల్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. దీంతో ఐదు టి20ల సిరీస్‌లో భారత్ 2-1 ఆధిక్యతలో ఉండగా.. నాల్గో టి20 రాయ్‌పూర్ వేదికగా డిసెంబర్ 1న జరగనుంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మ్యాక్స్‌వెల్‌కు లభించింది.

టి20ల్లో గైక్వాడ్ తొలి సెంచరీ..

టి20ల్లో రుతురాజ్ గైక్వాడ్ తొలి సెంచరీని కొట్టాడు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఔటయ్యాక తిలక్‌వర్మతో జతకట్టిన గైక్వాడ్ బ్యాట్ ఝుళిపించడం మొదలుపెట్టాడు. కేన్ రిచర్డ్‌సన్ వేసిన 12వ ఓవర్లో తిలక్ రెండు ఫోర్లు బాదగా.. గైక్వాడ్ ఓ బౌండరీ కొట్టాడు. హార్డీ వేసిన 14వ ఓవర్లో రెండు ఫోర్లు బాదిన గైక్వాడ్ 33 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తిచేశాడు. అర్ధసెంచరీ తర్వాత రుతురాజ్ మరింత రెచ్చిపోయాడు. సంఘా వేసిన 15వ ఓవర్లో 4, 6 కొట్టిన గైక్వాడ్.. హార్డీ వేసిన 18వ ఓవర్లో 6, 6, 4, 6తో మొత్తం 25పరుగులు రాబట్టాడు. మ్యాక్స్‌వెల్ వేసిన ఆఖరి ఓవర్లో ఫస్ట్ బాల్‌కే సిక్సర్ కొట్టి శతకం పూర్తిచేశాడు. అంతర్జాతీయ టి20లలో అతడికి ఇదే తొలి శతకం. 33 బంతుల్లో అర్ధసెంచరీ చేసిన అతడు తర్వాత 19 బంతుల్లోనే సెంచరీ పూర్తిచేయడం గమనార్హం. దీంతో టి20 ఫార్మాట్‌లో సెంచరీ కొట్టిన భారత ఆటగాళ్లలో ఆరో బ్యాటర్‌గా నిలిచాడు.

స్కోర్‌బోర్డు...

ఇండియా ఇన్నింగ్స్: జైస్వాల్ (సి)వేడ్ (బి)బెహ్రెన్‌డార్ఫ్ 6, గైక్వాడ్ (నాటౌట్) 123, ఇషాన్ కిషన్ (సి)స్టొయినీస్ (బి)రిచర్డ్సన్ 0, సూర్యకుమార్ (సి)వేడ్ (బి)హార్డీ 39, తిలక్ వర్మ (నాటౌట్) 31, అదనం 23. (20 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి) 222పరుగులు. **వికెట్ల పతనం:** 1/14, 2/24, 3/81 **బౌలింగ్:** రిచర్డ్సన్ 3-0-34-1, బెహ్రెన్‌డార్ఫ్ 4-1-12-1, ఎల్లిస్ 4-0-36-0, సాంఘా 4-0-42-0, హార్డీ 4-0-64-1, మ్యాక్స్‌వెల్ 1-0-30-0.

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: రిచర్డ్సన్ (సి)బిష్ణోయ్ (బి)ఆవేశ్ ఖాన్ 35, హార్డీ (సి)ఇషాన్ (బి)ఆవేశ్ ఖాన్ 16, ఇంగ్లిస్ (బి)రవి బిష్ణోయ్ 10, మ్యాక్స్‌వెల్ (నాటౌట్) 104, స్టొయినీస్ (సి)సూర్యకుమార్ (బి)అక్షర్ పటేల్ 17, టిమ్ డేవిడ్ (సి)సూర్యకుమార్ (బి)రవి బిష్ణోయ్ 0, వేడ్ (నాటౌట్) 28, అదనం 15. (20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 225పరుగులు. **వికెట్ల పతనం:** 1/47, 2/66, 3/68, 4/128, 5/134 **బౌలింగ్:** అర్ష్‌దీప్ సింగ్ 4-0-44-1, ప్రసిధ్ కృష్ణ 4-0-68-0, రవి బిష్ణోయ్ 4-0-32-2, ఆవేశ్ ఖాన్ 4-0-37-1, అక్షర్ పటేల్ 4-0-37-1.

రేపు నంద్యాల, కడప జిల్లాలకు సిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఈ నెల 30న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నంద్యాల, కడప జిల్లాల్లో పర్యటించనున్నారు. ఉదయం పది గంటలకు తాడేపల్లిలోని తన నివాసం నుండి సిఎం బయలుదేరి నంద్యాల జిల్లాలో అవుకు రెండవ టన్నెల్‌ను జాతికి అంకితం చేయనున్నారు. అవుకు మండలం మెట్టుపల్లి వద్ద టన్నెల్, సాగునీటి ప్రాజెక్టులపై చేసిన ఎగ్జిబిషన్‌ను పరిశీలించిన అనంతరం టన్నెల్ పైలాన్‌ను ఆవిష్కరిస్తారు. అనంతరం అక్కడ నుండి కడప నగరంలో పెద్దదర్గా ప్రధాన ఉరుసు ఉత్సవాల్లో పాల్గొంటారు. సాయంత్రం తాడేపల్లికి చేరుకుంటారు.

ఆర్థికశాఖలో భయం.. భయం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఇటీవల జరిగిన ఎసిబి దాడితో ఆర్థికశాఖ ఉలిక్కిపడింది. ఉన్నతాధికారులు నిఘా పెంచడంతో సిబ్బందిలో ఆందోళన నెలకొంది. ఉన్నతస్థాయిలో జరిగిన ఆన్‌లైన్‌లో జరిగిన సమావేశంలో నిఘా విషయమై నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. స్వయంగా ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి కూడా ఇదే విషయమై ఉన్నతస్థాయి అధికారులతో చర్చించినట్లు తెలిసింది. ఎసిబి అధికారులు ఒక సెక్షన్ అధికారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నప్పటికీ, అతని వెనుక మరికొందరు మధ్యస్థాయి అధికారుల ప్రమేయం కూడా ఉందన్న ప్రచారం జరుగుతోంది. వాస్తవంగా ఆర్థికశాఖ చెల్లించాల్సిన అనేక బిల్లులు వేల సంఖ్యలోనే పెండింగ్‌లో ఉన్నాయి. దీనిని ఆసరాగా తీసుకుని బిల్లుల చెల్లింపులు చేసేందుకు లంచం తీసుకుంటున్న ఉద్యోగులు కూడా పెరుగుతున్నట్లు కనిపిస్తోంది. పెద్ద, మధ్య స్థాయి అధికారులతో ముందుగానే మాట్లాడుకుని, బిల్లుల కోసం వచ్చే వారి నుంచి నగదు వసూలు చేస్తున్నారన్న ప్రచారం విస్తృతంగా జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఉన్నతస్థాయి అధికాంరులు మొత్తం శాఖపై నిఘా పెంచారు. ఈ పరిణామంతో ఆర్థికశాఖఉద్యోగులు వాట్సప్ ద్వారా మాత్రమే మాట్లాడుతున్నారు. సాధారణ ఫోన్‌కాల్స్‌కు స్పందించడం లేదు.

కర్రసాము పోటీల్లో గన్నవరం విద్యార్థుల ప్రతిభ



బాలికలను అభినందిస్తున్న హెచ్ఎం ఝాన్సీ రాణి

ప్రజాశక్తి-గన్నవరం (కృష్ణాజిల్లా)

జాతీయ స్థాయి సిలబం(కర్రసాము) పోటీల్లో కృష్ణాజిల్లా క్రీడాకారులు సత్తా చాట్టారు. ఎన్‌టిఆర్ జిల్లాలో జరిగిన 4వ జాతీయస్థాయి సిలంబం పోటీల్లో గన్నవరం విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. ఈ మేరకు గన్నవరంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విజేతల అభినందన కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు డి ఝాన్సీ రాణి మాట్లాడుతూ... జాతీయస్థాయి సిలంబం పోటీలు ఈ నెల 24 నుండి 26వరకు విజయవాడ రాజీవ్‌నగర్‌లోని మాస్టర్ మైండ్ స్కూల్ ఆవరణలో జరిగినట్లు తెలిపారు. అండర్ 12 బాలుర సింగిల్ స్టిక్ విభాగంలో మానికొండ సాయి ప్రశాంత్ కాంస్య పతకం, సింగిల్ స్టిక్ ఫైట్ విభాగంలో బంగారు పతకం సాధించారని తెలిపారు. అండర్ 14 బాలికల సింగిల్ స్టిక్ ఫైట్ విభాగంలో మానికొండ సాయి సత్యచిన్మయి రజిత పతకం, సింగిల్ స్టిక్ ఫైట్ విభాగంలో బంగారపు పతకం సాధించారని తెలిపారు. కర్రసాము పోటీల్లో బంగారు పతకాలు సాధించినందుకు విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పిడి కె గీత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68